thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 345 కరీంనగర్ గురువారం, 20 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నిప్పులు

న్యూఢిల్లీ : "భారత ఆర్థిక వ్యవస్థ మంచి రాబడినిస్తోంది" అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ చీఫ్ ఖర్గే నిప్పులు చెరిగారు. దూరదృష్టి, దృక్పథం లోపించిన ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ సర్వనాశనం అయిందని, కుప్పకూలిందని దుయ్యబట్టారు. "మన ఆర్థిక వ్యవస్థ మంచి రాబడినిస్తోందని మోదీ ప్రభుత్వం, కేంద్ర మంత్రి నిర్మల చెప్పడాన్ని మించిన అతి పెద్ద జోక్ ఇంకొకటి లేదు" అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఖర్గే పేర్కొన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు భారత స్టాక్ మార్కెట్‌లో రూ.45 లక్షల కో ట్లు ఆవిరయ్యాయని వివరించారు. విదేశీ పెట్టుబడిదారులు గత అక్టోబరు నుంచి ఇప్పటి వరకు రూ.1.56 లక్షల కోట్ల స్టాక్స్‌ను విక్రయించారని, దీనిలో రూ.లక్ష కోట్లు ఈ ఒక్క ఏడాదివేనని ఖర్గే తెలిపారు.




# వరద నిధులొచ్చేశాయ్!

## ఏపీ, తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు రూ.1554.99 కోట్లు విడుదల

ఢిల్లీ: దేశంలో గతేడాది ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రభావితమైన ఐదు రాష్ట్రాలకు కేంద్రం అదనపు సాయం మంజూరు చేసింది. ఐదు రాష్ట్రాలకు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (ఎన్డీఆర్ఎఫ్) కింద రూ. 1,554.99 కోట్ల అదనపు కేంద్ర సహాయాన్ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన బుధవారం జరిగిన ఉన్నత స్థాయి కమిటీ ఆమోదించింది. ఈ జాబితాలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలు ఉన్నాయి. 2024లో ఆయా రాష్ట్రాలలో ప్రకృతి వైపరీత్యాలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. వరదలు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం, తుఫానులను ఎదుర్కొన్న రాష్ట్రాలకు మద్దతు ఇవ్వడంలో భాగంగా కేంద్రం ఈ నిధులను విడుదల చేసింది. ఆమోదించబడిన రూ. 1,554.99 కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ. 608.08 కోట్లు, నాగాలాండ్‌కురూ. 170.99 కోట్లు, ఒడిశాకు రూ. 255.24 కోట్లు, తెలంగాణకు రూ. 231.75 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్ల సాయం అందనుంది. ఈ నిధులను ఎన్డీఆర్ఎఫ్ నుంచి అందించనున్నారు. ఈ ఆర్థిక సహాయం రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి (ఎస్‌డీఆర్ఎఫ్) ద్వారా రాష్ట్రాలకు ఇప్పటికే కేటాయించిన నిధులకు అదనంగా ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం ఎస్‌డీఆర్ఎఫ్ ద్వారా 27 రాష్ట్రాలకు రూ. 18,322.80 కోట్లు, ఎన్డీఆర్ఎఫ్ నుంచి 18 రాష్ట్రాలకు రూ. 4,808.30 కోట్లు విడుదల చేసింది. అదనంగా రాష్ట్ర విపత్తు ఉపశమన నిధి (ఎస్డీఎంఎఫ్) నుంచి 14 రాష్ట్రాలకు రూ. 2,208.55 కోట్లు, జాతీయ విపత్తు ఉపశమన నిధి (ఎన్డీఎంఎఫ్) నుంచి 8 రాష్ట్రాలకు రూ. 719.72 కోట్లు కేటాయించింది. ఇక, ప్రకృతి వైపరీత్యాల తర్వాత అధికారిక అభ్యర్థన కోసం వేచి ఉండకుండా.. ప్రభావిత రాష్ట్రాలలో పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర ప్రభుత్వం అంతర్-మంత్రిత్వ కేంద్ర బృందాలను పంపింది. ఇక, గతేడాది ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో వర్షాలు, వరదలు బీభత్సం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడతో పాటు పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తిన సంగతి తెలిసిందే. భారీ వర్షాలు, బుడమేరు ఎగువ ప్రాంతం నుంచి ఊహించని విధంగా వరద రావడం, గండ్లు పడటంతో.. ఆ నీరు విజయవాడ నగరంలోకి ప్రవేశించింది. మరోవైపు తెలంగాణలో మున్నేరు వాగు ఉగ్రరూపం దాల్చడంతో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ఇక, తెలుగు రాష్ట్రాల్లోని వరద ప్రభావిత ప్రాంతాలలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కూడా పర్యటించి.. క్షేత్ర స్థాయిలో జరిగిన నష్టాన్ని పరిశీలించారు.




వనపర్తి జిల్లా , ఫిబ్రవరి 19: జిల్లాలోని బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. మదనపురం మండలం కొన్నూరు గ్రామంలో శివకేశవరెడ్డి అనే రైతుకు చెందిన కోళ్ల ఫామ్‌లో 4000 కోళ్లు మృత్యువాతపడ్డాయి. బర్డ్ ఫ్లూ వ్యాధితో ఇంత పెద్ద సంఖ్యలో కోళ్లలో మృతి చెందినట్లు తెలుస్తోంది. ఎప్పటి లాగే ఈరోజు ఉదయం రైతు శివకేశవరెడ్డి కోళ్లఫామ్‌కు వచ్చి చూడగా వేల సంఖ్యలో కోళ్లు చనిపోయి కనిపించాయి.

దీంతో వాటిని గుంతలో పోడ్చేశారు. అయితే నాలుగువేళ్ల కోళ్ల మృతిపై వెటర్నరీ అధికారులకు రైతు సమాచారం ఇచ్చాడు. అయితే అధికారులు పట్టించుకోకపోవడంతో రైతు ఆగ్రహం వ్యక్తం చేశాడు. కోళ్లు చనిపోవడంపై రైతు మాట్లాడుతూ.. ఇన్ని కోళ్లు చనిపోవడానికి కారణం ఏంటో చెప్పాలని.. తనకు న్యాయం చేయాలని కోరారు. బర్డ్ ఫ్లూ వల్లే కోళ్లు చనిపోయాయని అనుకుంటున్నానని.. దానిపై అధికారులు నిర్ధారణ చేయాలన్నారు. ప్రతీసారి తనకు కోళ్లపై లాభం వచ్చేదని.. కానీ ఈసారి మాత్రం పూర్తి నష్టపోయాయనని న్యాయం చేయాలని రైతు కోరుతున్నారు. కాగా.. 5500 కోళ్ల కెపాసిటీతో నిర్మించిన శివకేశవరెడ్డికి చెందిన కోళ్లఫామ్‌లో నాలుగువేల కోళ్లు మృత్యువాతపడ్డాయి.

## మళ్లీ మనదే అధికారం.. కష్టపడి పనిచేయాలి

హైదరాబాద్ : తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తాజాగా జరిగిన బీఆర్ఎస్ (భారతీయ రాష్ట్ర సమితి) నేతల విస్తృతస్థాయి సమావేశంలో కమ్యూనిస్టులపై తీవ్ర విమర్శలు చేశారు. ఈ క్రమంలో కమ్యూనిస్టులు అధికార పార్టీతో అనుసంధానమై, ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యతను విస్మరించి కాంగ్రెస్‌కు తొత్తులుగా మారిపోయారని ఆరోపించారు.

అంతేకాదు ఈ సమావేశంలో కేసీఆర్, తెలుగుదేశం పార్టీ ప్రాస్థానం గురించి కూడా మాట్లాడారు. ఎన్టీఆర్ (నందమూరి తారక రామారావు) పడిన కష్టనష్టాలను వివరించారు. టీడీపీ ఎన్టీఆర్ కాలంలో ఉన్న పరిస్థితులను గుర్తుచేశారు.

**ప్రజల్లో వ్యతిరేకత...** ఈ క్రమంలోనే ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి పాలనపై ప్రజలలో వ్యతిరేకత పెరుగుతున్న విధానంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సీఎంపై ఇంత తొందరగా ప్రజల్లో వ్యతిరేకత వస్తుందనుకోలేదని ఆయన అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతుందని చెప్పారు. కానీ ప్రస్తుతం మాత్రం ప్రభుత్వంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుందని ఆరోపించారు. అదే అధికారులు ఉన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి చేయించుకోవడం రావడం లేదని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో ఆయన యువ నేతలకు కష్టపడి పనిచేయాలని సూచించారు.

**ఉపఎన్నికలపై సూచనలు...** ఈ క్రమంలో రాష్ట్రంలో త్వరలో ఉపఎన్నికలు వస్తాయని, అందుకు సంబంధించి పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని సూచించారు. మళ్లీ మనదే అధికారమని, మీరే ఎమ్మెల్యేలు అవుతారని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఈ సమావేశంలో కేసీఆర్, టీడీపీ పార్టీ ప్రాస్థానం, కష్టనష్టాలు, ఎన్టీఆర్ కాలం గురించి వివరిస్తూ, ప్రజల మద్దతు పొందేందుకు పార్టీ కార్యకర్తలను ప్రోత్సహించారు. ఆయన వ్యాఖ్యలు



ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఉత్కంఠను పెంచాయని చెప్పవచ్చు. ముఖ్యంగా కమ్యూనిస్టులపై చేసిన విమర్శలు, టీడీపీ ప్రస్తావనతోపాటు సీఎంపై వ్యతిరేకత అంశం వ్యాఖ్యలు ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారాయి.

# కార్పొరేటర్ టు సీఎం!

## దిల్లీ కొత్త సీఎంగా రేఖా గుప్తా

### నేడే ప్రమాణ స్వీకారోత్సవం - భారీగా ఏర్పాట్లు!




దిల్లీ: దిల్లీ కొత్త సీఎం ఎవరనే అంశంపై కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. దిల్లీ నూతన ముఖ్యమంత్రిగా రేఖా గుప్తా ఎంపికయ్యారు. పలువురు సీనియర్ నేతల పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ.. రేఖా గుప్తా వైపే భాజపా అధిష్ఠానం మొగ్గు చూపింది. షాలిమార్‌బాగ్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన 50 ఏళ్ల రేఖా గుప్తాకు దిల్లీ సీఎం పగ్గాలు అప్పగించడం విశేషం. ఏబీవీపీ నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. భాజపాలో పలు విభాగాల్లో క్రియాశీలంగా కృషిచేశారు. అలాగే, దిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగానూ గతంలో సేవలందించారు.

**దిల్లీకి నాలుగో మహిళా సీఎం..** రేఖా గుప్తా దిల్లీకి నాలుగో మహిళా సీఎంగా సేవలందించనున్నారు. గతంలో సుష్మాస్వరాజ్ (భాజపా), షీలాదీక్షిత్ (కాంగ్రెస్), ఆతిశీ (ఆప్) ముఖ్యమంత్రులుగా పనిచేసిన విషయం తెలిసిందే.

**ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు...** ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా ఘన విజయం సాధించిన నేపథ్యంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. గురువారం రాంలీలా మైదానంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.34 గంటల వరకు ప్రమాణస్వీకారోత్సవం జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భారీ ఎత్తున నిర్వహించే ఈ కార్యక్రమానికి భాజపా అగ్ర నేతలతో పాటు భాజపా, ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు హాజరు కానున్నారు.

**సుదీర్ఘ రాజకీయ అనుభవం..** రేఖా గుప్తాకు గతంలో ఎమ్మెల్యే, ఎంపీగా పనిచేసిన అనుభవం లేదు. కానీ రాజకీయంగా ఆమెకు సుదీర్ఘ అనుభవం ఉంది. విద్యార్థి నాయకురాలిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన ఆమె.. పితంపుర, షాలీమార్ బాగ్ ప్రాంత ప్రజలకు సుపరచితురాలు. స్థానికంగా పార్కుల అభివృద్ధికి ఆమె ఎంతగానో కృషిచేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండేవారు.

రేఖాగుప్తా కుటుంబానికి సంఘ్ నేపథ్యం ఉండటం ఆమెకు కలిసొచ్చింది. విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకైన పాత్ర పోషించిన ఆమె ఆ తర్వాత బీజేపీలో చేరారు. పితంపుర కౌన్సిలర్‌గా, షాలీమార్ బాగ్-బి నుంచి కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. స్థానిక ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే నాయకురాలు. ఢిల్లీ ప్రాంతంలో పార్టీ వాయిస్‌ను గట్టిగా వినిపించే నేతల్లో ఆమె ఒకరు. షాలీమార్ బాగ్ శాసనసభ నియోజకవర్గం నుంచి 2015, 2020 ఎన్నికల్లో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి సమీప ప్రత్యర్థి ఆప్‌కు చెందిన బందనాకుమారి చేతిలో ఓటమి చెందారు. 2025లో అదే నియోజకవర్గం నుంచి బందనాకుమారిని 29వేలకు పైగా ఓట్ల తేడాతో ఓడించారు. రేఖాగుప్తా బీజేపీలో ఎన్నో బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ ఢిల్లీ శాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. పదవులతో సంబంధం లేకుండా నిరంతరం ప్రజల్లో ఉంటూ.. వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేయడమే ఆమెను సీఎంగా బీజేపీ ఎంపిక చేయడానికి ఒక కారణంగా చెప్పుకోవచ్చు.

**విద్యార్థి దశ నుంచి..** 1994-95 సంవత్సరంలో ఆమె దౌలత్ రామ్ కళాశాలలో చదువుతున్న సమయంలో ఆ కళాశాల విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1995-96 సంవత్సరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీచేసి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1996-97 సంవత్సరంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీచేసి విజయం సాధించారు. విద్యాభ్యాసం పూర్తైన తర్వాత ఆమె బీజేపీలో చేరారు. 2003 నుంచి 2004 వరకు బీజేవైఎం ఢిల్లీ కార్యదర్శి పదవిని నిర్వహించారు. 2004 నుంచి 2006 వరకు బీజేవైఎం జాతీయ కార్యదర్శిగా పనిచేశారు. 2007లో ఢిల్లీలోని ఉత్తరి పితంపుర వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. 2012లో జరిగిన ఎన్నికల్లోనూ ఉత్తరి పితంపుర నుంచి కౌన్సిలర్‌గా రెండోసారి గెలిచారు. 2022లో షాలీమార్ బాగ్-బి నుంచి కార్పొరేటర్‌గా గెలుపొందారు. ఆమె వార్డు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా పనిచేసిన సమయంలో ఆ ప్రాంత అభివృద్ధికి విశేషకృషి చేశారు. పితంపుర ప్రాంతంలో ఎగువ మధ్య తరగతితో పాటు ఉద్యోగస్తుల కుటుంబాల ప్రజలు ఎక్కువగా నివాసం ఉంటారు. ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా.. అపార్ట్‌మెంట్‌ల పక్కన పార్కుల నిర్మాణంతో పాటు, వాటి అభివృద్ధికి విశేషకృషి చేశారు.



# ఏప్రిల్ 27న బీఆర్ఎస్ బహిరంగ సభ.. ప్రకటించిన కేసీఆర్

హైదరాబాద్ : ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశమైంది. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, సిల్వర్ జూబ్లీ వేడుకలు, పార్టీ సంస్థాగత ఎన్నికలపై చర్చించారు. పార్టీ సిల్వర్‌జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించారు. ఏడాది పొడవునా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించాలని శ్రేణులకు సూచించారు. అలాగే, పార్టీ కమిటీలు వేయాలని నిర్ణయించిన కేసీఆర్.. కమిటీలకు ఇన్‌చార్జ్‌గా హరీశ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే మహిళా కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఏప్రిల్ పదో తేదీ నుంచి బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఉంటుందని.. ప్రతి జిల్లా కేంద్రంలో పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగుతుందన్నారు. అనుబంధ సంఘాల పటిష్టత కోసం సీనియర్ నేతలతో సబ్ కమిటీలు వేయనున్నట్లు తెలిపారు. అదే నెల 10న పార్టీ ప్రతినిధుల సభ ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ సమాజం సామాజిక చారిత్రక అవసరాల దృష్ట్యా తెలంగాణ చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ రాజకీయ అస్తిత్వ పార్టీగా, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి తన చారిత్రక బాధ్యతను నిర్వహించిన తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్ అని తెలిపారు. తెలంగాణ సమాజంలోని అన్ని వర్గాలను చైతన్య పరుస్తూ, తెలంగాణ అస్తిత్వ పటిష్టతకు కృషి చేస్తూ, గతం గాయాల నుంచి కోలుకున్న తెలంగాణను తిరిగి అవే కష్టాల పాలు కాకుండా, గత దోపిడీ వలస వాదుల బారిన పడకుండా, తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయం అందించే దిశగా సమస్త పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి దాకా పటిష్ట నిర్మాణం చేసి అటు పార్టీ విజయాన్ని.. ఇటు తెలంగాణ ప్రజల శాశ్వత విజయం కోసం సమాంతరంగా పని చేయాలని సమావేశంలో పాల్గొన్న నాయకులకు అధినేత దిశానిర్దేశం చేశారు. పార్టీ ఆవిర్భవించి 25వ సంవత్సరంలోకి అడుగిడుతున్న నేపథ్యంలో సిల్వర్ జూబ్లీ వేడుకలను ఏడాది కాలం పాటు నిర్వహించాలని తెలిపారు. విద్యార్థి, మహిళా సహా పార్టీ అనుబంధ విభాగాలను మరింత పటిష్ట పరచాలన్నారు. అందుకోసం సీనియర్ పార్టీ నేతలతో కూడిన సబ్ కమిటీ లను ఏర్పాటు చేసి కార్యాచరణ ప్రారంభించాలన్నారు. తెలంగాణ అస్థిత్వ పార్టీ బీఆర్ఎస్ అని కేసీఆర్ అన్నారు. గత గాయాల నుంచి కోలుకున్న రాష్ట్రాన్ని మళ్లీ అదే స్థితికి కాంగ్రెస్ నేతలు తీసుకువెళుతున్నారని.. మరోసారి దోపిడీ, వలసవాదుల బారినపడకుండా తెలంగాణను కాపాడాలన్నారు. తెలంగాణ ప్రజలకు శాశ్వత విజయమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోతుందన్న కేసీఆర్.. సీఎంపై ప్రజల్లో ఇంతలా వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదన్నారు. తెలంగాణలో కచ్చితంగా ఉప ఎన్నికలు వస్తాయని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుందని.. మనం ఏటా ఆదాయం పెంచుకుంటూ వెళ్లామన్నారు. అదే అధికారులు ఉన్నారు కానీ.. ఈ ప్రభుత్వానికి పని చేయించుకోవడం రావడం లేదన్నారు.



# రైతుల ఉసురు తగిలే.. KCR మంచాన పడ్డడు

సూర్యాపేట: పెద్దగట్టు లింగమంతుల స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే నిధులు మంజూరు చేయిస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు. బుధవారం (ఫిబ్రవరి 19) దురాజ్ పల్లి లింగమంతుల స్వామి వారిని మంత్రి కోమటిరెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, బత్తుల లక్ష్మారెడ్డి, పటేల్ రమేష్ రెడ్డి, తదితర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. దర్శనం అనంతరం మంత్రి కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పెద్దగట్టు ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ. 80 కోట్లు అవసరమయిన మంజూరు చేస్తామన్నారు. వయసు పైబడిన భక్తులకు గుట్టు ఎక్కడం కష్టంగా మారిందని.. వచ్చే జాతర నాటికి ఘాట్ రోడ్డు, విశ్రాంతి భవనాలు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ఏడాదిలోనే పెద్దగట్టు పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రారంభిస్తామని అన్నారు. ఇక, మంగళవారం పెద్దగట్టుకు వచ్చి.. రైతులకు నీరివ్వని కాంగ్రెస్ సర్కారుకు రైతుల ఉసురు తగులుతుందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మంత్రి కోమటిరెడ్డి ఫైర్ అయ్యారు. రైతుల ఉసురు తగలేది కాంగ్రెస్?కు కాదని.. రైతుల ఉసురు తగిలే కేసీఆర్ మంచానికి పడ్డారు.. కవిత జైలు పాలయ్యారని కౌంటర్ ఇచ్చారు.




# మిషన్ భగీరథకు.. 16 వేల కోట్లివ్వండి

హైదరాబాద్ : తెలంగాణలో ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర తాగునీటి అవసరాలు తీర్చేందుకు నీతి ఆయోగ్ గతంలో సిఫార్సు చేసిన విధంగా కనీసం రూ. 16 వేల కోట్లు మంజూరు చేయా లని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ లో రెండు రోజుల పాటు జరుగుతున్న అన్ని రాష్ట్రాల ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్ మంత్రుల రెండో సదస్సులో మంత్రి సీతక్క పాల్గొని ప్రసంగించారు.

కేంద్ర జలశక్తి శాఖమంత్రి సీఆర్ పాటిల్, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అన్ని రాష్ట్రాల మంత్రులు పాల్గొన్న సదస్సులో.. తెలంగాణలో అమలవుతున్న మిషన్ భగీరథ, ఇతర తాగు నీటి పథకాలు, రాష్ట్ర అవసరాలపై ప్రజెంటేషన్ ఇచ్చారు. నిధుల మంజూరు విషయంలో కేంద్రం తన బాధ్యతను నెరవేర్చాలన్నారు.




# హైదరాబాద్ - విజయవాడ.. ప్రయాణికులకు గుడ్‌న్యూస్

ప్రయాణికులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) శుభవార్త తెలిపింది. విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి ఈ గుడ్‌న్యూస్ అందించింది. హైదరాబాద్–విజయవాడ మార్గంలో ప్రత్యేక రాయితీలను ప్రకటిస్తున్నట్లు తెలంగాణ ఆర్టీసీ వెల్లడించింది. లహరి– నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10 శాతం రాయితీ, అదే రాజధాని ఏసీ బస్సుల్లో 8 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు టీజీఆర్టీసీ తెలిపింది. ఈ మేరకు బుధవారం ఆర్టీసీ యాజమాన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ రాయితీతో కల్పించే డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించింది. టీజీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం https://tgsrtcbus.in అధికారిక వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించింది. ఈ విషయాన్ని టీజీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ (ట్విట్టర్) వెల్లడించారు. విజయవాడ రూట్‌లో ప్రయాణించే వారికి టికెట్లపై ఆర్టీసీ డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.



# యాసంగిలో రైతులకు ఎలాంటి ఇబ్బంది రానివ్వొద్దు

హైదరాబాద్: యాసంగి సాగుకు నీటి విడుదలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు ఇరిగేషన్ శాఖ కసరత్తులు చేస్తున్నది. చివరి ఆయకట్టుకు ప్రాధాన్యం ఇచ్చేలా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో నీళ్లివ్వనున్నారు. ఏప్రిల్ వరకు ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో వివిధ ప్రాజెక్టుల కింద 33.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వాలని నిర్ణయించారు. సెక్రటేరియెట్‌లో యాసంగి పంటలకు నీరు, కరెంట్ సరఫరాపై అధికారులతో సీఎస్ శాంతి కుమారి రివ్యూ చేశారు. కలెక్టర్లతో వర్చువల్‌గా మాట్లాడారు. పంటలకు సాగు నీరు, విద్యుత్ సరఫరా, తాగునీరు, రైతు భరోసా, రేషన్ కార్డుల జారీపై సూచనలు చేశారు. యాసంగి లక్ష్యానికి అనుగుణంగా పంటలకు నీళ్లివ్వాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

డిస్ట్రిబ్యూటరీల గేట్లను అనధికారికంగా ఎత్తకుండా పోలీస్, స్థానిక ఈఈలు పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రాష్ట్రంలో తగినంత విద్యుత్ అందుబాటులో ఉందని.. వ్యవసాయం, గృహ, పారిశ్రామిక రంగాలకు వేసవిలో డిమాండ్?కు అనుగుణంగా అంతరాయం ఉండకుండా సప్లై చేయాలని సూచించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావు, రాధా కిషన్‌రావుకు ఊరట

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీశ్‌రావు, రాధా కిషన్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. పంజాగుట్ట పీఎస్‌లో నమోదైన కేసు దర్యాప్తుపై హైకోర్టు స్టే ఇచ్చింది. పిటిషన్‌పై తదుపరి విచారణ చేపట్టే వరకు ఎలాంటి చర్యలు



చేపట్టవద్దని న్యాయస్థానం స్టే విధించింది. తన ఫోన్ ట్యాప్ చేశారంటూ రియల్టర్ చక్రధర్ ఫిర్యాదు మేరకు పంజాగుట్ట పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ కేసులో హరీశ్‌రావు వద్ద గతంలో పనిచేసిన కంప్యూటర్ ఆపరేటర్‌ను పోలీసులు అరెస్టు చేశారు



# రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలో పలు చోట్ల వాన జల్లులు

హైదరాబాద్: తెలంగాణలో 34 నుంచి 37 డిగ్రీల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు, 18 నుంచి 22 డిగ్రీల వరకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గత రెండు రోజులుగా ఉష్ణోగ్రతలు తగ్గాయని, సాధారణం కన్నా ఒకటి, రెండు డిగ్రీలు మాత్రమే అధికంగా నమోదవుతున్నట్లు వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. గాలిలో అనిశ్చితి కారణంగా రానున్న రెండు, మూడు రోజుల్లో తెలంగాణలో పలు చోట్ల జల్లులు కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు.



# రైతాంగాన్ని ఆదుకోవాలి.. లేదంటే తీవ్ర పరిణామాలు

వరంగల్: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూసేకరణతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని.. ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుందని చెప్పారు. వరంగల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈటల మాట్లాడారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు వేగంగా జరుగుతున్నా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నా సీఎం పట్టించుకోవడం లేదని విమర్శించారు. అభివృద్ధికి భాజపా వ్యతిరేకం కాదన్నారు. తెలంగాణ రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని.. లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అవసరమైతే అన్నదాతల తరఫున పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఈటల అన్నారు.

# ముడా కేసు.. సిద్ధరామయ్యకు వ్యతిరేకంగా ఆధారాల్లేవ్!: లోకాయుక్త

ముంబయి: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) భూముల వ్యవహారంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్యకు భారీ ఉపశమనం లభించింది. ఈ భూముల కేటాయింపులో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఆయనకు వ్యతిరేకంగా ఆధారాల్లేవని లోకాయుక్త పోలీసులు వెల్లడించారు. ఈ కేసులో సీఎంతో పాటు ఆయన సతీమణి పార్వతి, తదితరులకు వ్యతిరేకంగా ఎలాంటి ఆధారాల్లేవని తేల్చి చెప్పారు. ఈ అంశంపై తుది నివేదికను హైకోర్టుకు సమర్పించనున్నట్లు సామాజిక కార్యకర్త స్నేహమయి కృష్ణకు రాసిన లేఖలో పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో తొలి నలుగురు నిందితులపై వచ్చిన ఆరోపణలకు ఆధారాల్లేకపోవడంతో నిరూపితం కాలేదని తెలిపారు. ఈ నివేదికపై అభ్యంతరాలు తెలిపేందుకు స్నేహమయికి వారం రోజులు గడువు ఇస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని స్పష్టంచేశారు. ముడా భూముల వ్యవహారంలో సీఎం సిద్ధరామయ్యపై ఆరోపణలు రావడం కన్నడ రాజకీయాలను కుదిపేసింది. దీంతో ఈ కేసు తెరపైకి వచ్చీ రాగానే రాష్ట్ర ప్రభుత్వం గతేడాది ఆగస్టులోనే లోకాయుక్త విచారణకు ఆదేశించింది.

గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాత్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఫిర్యాదుదారులు టి.జె.అబ్రహం, స్నేహమయి కృష్ణ పిటీషన్లపై విచారణ చేపట్టిన కోర్టు గత సెప్టెంబరులో నివేదిక ఇవ్వాల్సిందిగా పోలీసులకు ఆదేశించింది. ముఖ్యమంత్రి, ఆయన సతీమణి పార్వతి, బావమరిది మల్లికార్జునపై కేసులు నమోదు కావటం, లోకాయుక్త ఎస్పీ టి.జె.ఉదేశ్ నేతృత్వంలో విచారణ ప్రారంభమైంది. ముఖ్యమంత్రి ఏ1 నిందితుడిగా కేసు నమోదు కాగానే ఆయన భార్య తనకు ముడా ఇచ్చిన స్థలాలను వెనక్కి ఇచ్చేయడం, విచారణ కోసం గతేడాది నవంబరు 5న ముఖ్యమంత్రి మైసూరులోని లోకాయుక్త కార్యాలయంలో విచారణకు హాజరవటం వంటి పరిణామాలు చకచకా జరిగిపోయాయి. ఈ విచారణ ప్రక్రియలో ముఖ్యమంత్రి గానీ, ఆయన కుటుంబ సభ్యుల పాత్ర గానీ లేదని పోలీసులు గుర్తించినట్లు సమాచారం.

# మహాకుంభమేళా.. ఖైదీలకూ గంగా జలం!


ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న కుంభమేళాకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తూనే ఉన్నారు. ఇప్పటి వరకు 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా కుంభమేళాలో పవిత్ర స్నానం చేయాలనుకుంటున్న ఖైదీల కోసం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 75 జైళ్లలోని 90 వేలకుపైగా ఖైదీలకు గంగా జలాలతో స్నానం చేసే అవకాశం కల్పిస్తామని అధికారులు వెల్లడించారు. ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలోని పవిత్ర జలాలను సేకరించి.. ఫిబ్రవరి 21న ఆయా జైళ్లకు తీసుకువెళుతామని అధికారులు పేర్కొన్నారు. ఆయా కారాగారాల్లో ఉన్న నీటితో గంగా జలాలను కలుపుతామన్నారు.

పవిత్ర స్నానాల అనంతరం పూజలు, ఇతర క్రతువులు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర జైళ్ల శాఖ మంత్రి దారా సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాను కూడా పాల్గొంటున్నట్లు వెల్లడించారు. కుంభమేళాలో పాల్గొనాలనుకునే ఖైదీల కోసం చరిత్రలో తొలిసారిగా ఇలాంటి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. జనవరి 13న మొదలైన మహా కుంభమేళా కార్యక్రమం ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26నాటికి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేసిన భక్తుల సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత దీనికి 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచనా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తారు. ఫిబ్రవరి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్రయాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ ప్రభుత్వం పేర్కొంది.

# దక్షిణ కైలాసం... శ్రీకాళహస్తి క్షేత్రం

## - ఫిబ్రవరి 21 నుంచి మార్చి 6 తేదీ వరకు వేడుకలు

## శ్రీకాళహస్తీశ్వర శివరాత్రి ఉత్సవాల సందర్భంగా...



ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం లోని చిత్తూరు జిల్లాలో శ్రీకాళహస్తి పట్టణం స్వర్ణముఖి నదికి తూర్పు ఒడ్డున ఉంది. ఇది దక్షిణ భారత దేశంలోనే ప్రాచీనమైన, పంచభూత లింగములలో నాల్గవ దైన వాయు లింగము గల గొప్ప శైవ పుణ్యక్షేత్రము. ఇక్కడ రెండు దీపాలలో ఒకటి ఎప్పుడూ గాలికి కదులుతూ ఉంటుంది, మరొకటి ఎల్లప్పుడు నిశ్చలముగా ఉంటుంది. పంచ భూతాలయిన భూమి, ఆకాశం, నీరు, వాయువు, అగ్ని శక్తులను పరమేశ్వరుడు తనలో నిక్షేపించు కొని, లింగాకారంగా ఆవిర్భవించాడు. కంచి క్షేత్రంలో పృథ్వీ లింగంగా, చిదంబర క్షేత్రంలో ఆకాశ లింగంగా, జంబుకేశ్వర క్షేత్రంలో జల లింగంగా, అరుణా చలంలో అగ్ని లింగంగా, శ్రీకాళహస్తిలో వాయు లింగంగా ఆవిర్భవించాడు. అందుకే శ్రీకాళహస్తీశ్వరుని పక్క నున్న రెండు దీపాలు శివలింగ ఉచ్ఛ్వాస నిశ్వాసాల వలన వచ్చే గాలికి కదులుతూ వుంటాయి. ఈ శివలింగం స్వయంభూ లింగం. శైవ క్షేత్రాలలో కల్లా అత్యుత్తమ మైంది శ్రీకాళహస్తీశ్వర క్షేత్రం. ఇక్కడి పర్వత శ్రేణులే దక్షిణ కైలాసగిరి పర్వతాలు. ఈ క్షేత్రాన్ని దక్షిణ కైలాసం అని పిలుస్తారు. పవిత్ర శ్రీకాళహస్తి క్షేత్రానికి వచ్చి, శ్రీకాళ హస్తీశ్వరుని, శ్రీ జ్ఞాన ప్రసూనాంబికా దేవిని దర్శించినంత మాత్రాన ముక్తి కలుగుతుందని ప్రశస్తి. ఆలయ దర్శనం ద్వారా చతుర్విధ పురుషార్థ సిద్ధి లభిస్తుందని భక్తుల విశ్వాసం. పాతాళ గణపతి ఉత్తరాభి ముఖునిగాను, జ్ఞాన ప్రసూనాంబ తూర్పు ముఖంగాను, కాళహస్తీశ్వరుడు పశ్చిమ ముఖంగాను దక్షిణా మూర్తి దక్షిణ ముఖం (మహాద్వారం ఎదురు) ఒక్కొక్కరు ఒక్కొక్క దిక్కునకు అభిముఖులై ఉన్నారు. క్షేత్ర పురాణ కథనాల ప్రకారం దక్షిణ కైలాస మందు వాయు లింగాకృతి గల శివలింగాన్ని కాళం అనే పేరుగల సర్పం ప్రాతఃకాల మందే మణులతో పూజిస్తూండేది. మధ్యాహ్న సమయంలో అక్కడికి వచ్చే ఏనుగు శివునికి సర్పంచే సమర్పించబడ్డ మణులను రాళ్ళుగా భావించి, వాటిని తొలగించి తన తొండంతో తెచ్చిన నీటితో లింగానికి అభిషేకం చేసి, కమలాలతో పూజిస్తూండేది. సర్పం సమర్పించిన మణులను ఏనుగు, ఏనుగు సమర్పించిన కమలాలను సర్పం తొలగిస్తూం డేవి. తమ పూజలకు భంగం కలిగిస్తున్న వారిని కనిపెట్టి, శిక్షించాలని ఒకటి కొకటి భావించాయి. ఒకరోజు సర్పం శివలింగం వెనుక భాగాన వేచి ఉండగా, ఏనుగు ప్రతిరోజూ లాగానే వచ్చి, మణులను తొలగించి, అభిషేకం చేసి పద్మాలతో పూజిస్తూండగా సర్పం, తను సమర్పించిన మణులను తొలగించిన ఏనుగు తొండంలోకి ప్రవేశించింది. ఆ బాధను భరించలేక ఏనుగు ఘీంకారం చేస్తూ శివుని వెనుక భాగాన గల పర్వతాన్ని తొండంతో ఢీకొట్టింది. వెంటనే ఏనుగు, అదే సమయంలో తొండంలో గల సర్పం కూడా మరణించడం జరిగాయి. రెండూ ఒకేసారి రెండు జీవులూ పరమ శివునిలో ఐక్యమైనాయి. పరమశివుడు వాటి భక్తికి మెచ్చి వరం కోరుకోమనగా, అవి, ఆ వాయులింగం తమ పేరున ప్రసిద్ధి చెందాలని కోరుకున్నాయి. మొదట 'శ్రీ' అనే పేరు గల సాలీడు శివ సాయుజ్యం పొందడం, తర్వాత కాళం, హస్తి శివసాయుజ్యం పొందినందున, వాటి కోరికపై పరమేశ్వరుడు వెలసిన వాయులింగాన్ని 'శ్రీకాళ హస్తీశ్వరుడు' అని, ఆ క్షేత్రం దక్షిణ కైలాసానికి బదులుగా 'శ్రీకాళహస్తి' అని పిలువబడు తుందని కైలాస నాథుడు అనుగ్రహించినట్లు పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. క్రీ.శ. 12వ శతాబ్దంలో రాజేంద్ర చోళుడు అనే రాజు శ్రీకాళహస్తీశ్వర ఆలయాన్ని నిర్మించినట్లుగా చారిత్రక ఆధారాలున్నాయి. రాజేంద్ర చోళుని పాలన 13వ శతాబ్దంలో ముగిసిన తర్వాత, విజయ నగర రాజులైన సాళువ రాజు, శ్రీకృష్ణదేవ రాయలు, శ్రీకాళ హస్తి జమిందారుల హయాంలో ఈ దేవాలయం అనేకవిధాలుగా అభివృద్ధి చెందినట్లు చెపుతారు. తరువాత చోళులు పదకొండవ శతాబ్దంలో పల్లవులు నిర్మించిన పాత దేవాలయాన్ని మెరుగు పరచడం జరిగింది. ఒకటవ కులోత్తుంగ చోళుడు ప్రవేశ ద్వారం వద్దగల దక్షిణ గాలి గోపురాన్ని, మూడవ కులోత్తుంగ చోళుడు ఇతర ఆలయాలను నిర్మించారు. క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన వీరనరసింహ యాదవరాయ అనే రాజు ప్రస్తుతం ఉన్న ప్రాకారాలను, నాలుగు ద్వారాలను కలిపే గోపురాలను నిర్మించాడు. క్రీస్తుశకం 1516 విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవ రాయల రాతిపై చెక్కించిన రచనల ఆధారంగా ఆయన1516 వ సంవత్సరంలో గజపతులపై విజయానికి సూచనగా వంద స్తంభాలు కలిగిన మంటపం, అన్నింటికన్నా తూర్పు పడమర దిక్కుల వైపుకు ఉన్న ఎత్తైన గాలి గోపురాన్ని నిర్మించినట్లు తెలియ జేస్తుంది. క్రీస్తుశకం 1529 అచ్యుత రాయలు తన పట్టాభిషేక మహోత్సవాన్ని ముందు ఇక్కడ జరుపుకొని తరువాత తన రాజధానిలో జరుపు కొన్నాడు. ఈ ఆలయంలో ప్రధానంగా రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు విశేషంగా జరుగుతాయి. దేశం నలు మూలల నుంచి వచ్చిన భక్తులు ఇక్కడ తమ దోష నివృత్తి కావించు కుంటారు. రుద్రాభిషేకం, పాలాభిషేకం, పచ్చ కర్పూరాభిషేకం మొదలైన పూజలు కూడా జరుగుతాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు సేవలు నిర్వహించ నున్నారు. ఈ ఏడు శివరాత్రి ఉత్సవాలు ఫిబ్రవరి 21న భక్త కన్నప్ప ధ్వజారోహణం, 22 న స్వామివారి ధ్వజారోహణం, 23 రెండవ తిరునాళ్లు (భూత రాత్రి), 24వ తేదీ మూడవ తిరునాళ్లు (గంధర్వ రాత్రి), 25 (నాగరాత్రి) నాలుగవ తిరునాళ్లు, 26 న మహాశివరాత్రి, నంది సేవ, లింగోద్భవం, 27 న ( రాత్రి) రథోత్సవం (ఉదయం), బ్రహ్మరాత్రి, తెప్పోత్సవం, 28న శివపార్వతుల కల్యాణం. (స్కంద రాత్రి), 1న సభాపతి కల్యాణం (ఆనంద రాత్రి), 2న గిరి ప్రదక్షిణ. (రుషి రాత్రి), 3 న తీర్థవారి, ధ్వజావరోహణం, 4: పల్లకీ సేవ (రాత్రి), 5న ఏకాంత సేవ, 6 న నిత్యోత్సవం, అభిషేకం నిర్వహించ నున్నారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు ఆలయ అధికారులు చర్యలు చేపట్టారు. శివరాత్రి రాత్రి రోజున లింగోద్భవం జరుగుతుందని, భక్తులందరికి దర్శన భాగ్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరుణ్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు అందరికీ ఉచితంగా లడ్డూలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. వీఐపీల కోసం ప్రత్యేక దర్శన వేళలు అమలు చేయాలని నిర్ణయించారు. వార్షిక బ్రహ్మోత్సవాలను డ్రోన్లు, 350 నుంచి 400 కెమెరాలతో పర్యవేక్షించనున్నారు. ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో దర్శనానికి వచ్చే మహిళలకు గాజులు, అమ్మవారి కుంకుమ ప్రసాదం, జాకెట్ అందించాలని నిర్ణయించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యర్థన మేరకు శ్రీకాళహస్తి ప్రజలకు ఫిబ్రవరి 27న ఆలయంలో ఉచిత దర్శన సౌకర్యం కల్పించారు. ఆధార్ కార్డు ఆధారంగా వారికి ఉచితంగా దర్శనం కల్పించనున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పారిశ్రామికవేత్త హత్య కేసులో షాకింగ్ నిజాలు!






సమాజంలో బంధాలు, అనుబంధాలు, మమతలు, మానవత్వాలు మట్టికొట్టుకుపోతున్నాయి. చిన్న పిల్లాడి నుంచి కాటికి కాలుచాచిన పెద్దమనిషి దాక అందరూ డబ్బుకు దాసోహం అంటున్నారు. భార్యాభర్తల మధ్య డబ్బుల గొడవలే..తల్లిదండ్రులు పిల్లల మధ్య డబ్బుల గొడవలే..చుట్టాల నుంచి స్నేహితుల దాక అన్నీ పైసా బంధాలే..భూమి పంచాయితీలు మొదలు బిజినెస్ పంపకాల వరకు నిత్యం ఏదో ఒక చోట కలహాలు కలవరపెడుతున్నాయి. డబ్బు కోసం కొట్టుకున్నారంటే అర్థముంటుంది కానీ ఏకంగా ప్రాణాలు తీసేస్తున్నారు నేటి మనుషులు. డబ్బు సంపాదన ధ్యేయంగా పరుగులు పెడుతూ ఈజీ మనీ కోసం జనాలు వెంపర్లాడుతున్నారు. మనీ మత్తులో మనోళ్లు అని కూడా చూడకుండా మటాష్ చేసేస్తున్నారు. ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో ఓ బడా పారిశ్రామికవేత్త హత్య అందరినీ కలిచివేసింది. తాత తనకు ఆస్తి పంచివ్వలేదని సొంత మనవడే దారుణంగా చంపిన విషయం తెలిసి సగటు జీవి మనస్సు కకావికలమైంది. హైదరాబాద్ మహానగరంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త చంద్రశేఖర్ జనార్దన్ రావు హత్య విషయం అందరికీ తెలిసిందే. ఆయన హత్య చేసింది సొంత మనవడు. కుమార్తె కొడుకు అయిన కిలారు కీర్తితేజ. జనార్దన్ రావు హత్య జరిగిన తర్వాత వెంటనే పోలీసులు నిందితుడిని గుర్తించారు. కీర్తితేజను అరెస్ట్ చేసి అతడి నుంచి హత్య వివరాలను రాబట్టారు. కీర్తితేజ పోలీస్ కస్టడీ సోమవారమే ముగిసింది. పోలీస్ విచారణలో షాకింగ్ గురి చేసే ఎన్నో అంశాలు బయటపడ్డాయి. కీర్తితేజ తన తాతను హత్య చేయడానికి దారితీసిన కారణాలు, హత్య చేసిన విధానం చూసి పోలీసులే నివ్వెరపోయారు. తాజాగా కీర్తితేజ నుంచి రాబట్టిన విషయాలను పోలీసులు వెల్లడించారు. తాత జనార్దన్ రావు తనను నిత్యం అవమానించేవాడని, అది భరించలేకే హత్య చేసినట్టు కీర్తితేజ విచారణలో చెప్పినట్టు సీఐ శోభన్ తెలిపారు.. తాత జనార్దన్ రావు..తనను ఏనాడు మనవడిగా చూడలేదని, కనీసం కుటుంబ సభ్యుడినన్నా వాత్సాల్యం చూపించలేదని.. అందరి కంటే హీనంగా చూస్తూ తనపట్ల దయనీయంగా వ్యవహరించేవాడని కీర్తితేజ పోలీసుల ఎదుట వాపోయాడు. ప్రతీ రోజూ తనను బెగ్గర్ అంటూ సంబోధించడమే కాకుండా తమ ఆఫీస్ కు వెళ్తే అక్కడ కూడా హీనంగా చూసేవాడట. దీంతో తమ సిబ్బంది కూడా తనను చిన్నచూపు చూసేవారని చెప్పుకొచ్చాడు. ఆస్తి పంపకాలు పదవులు కేటాయింపుల్లోనూ తనను తక్కువగా చూశాడని, చివరకు డైరెక్టర్ పదవి కూడా జనార్దన్ రావు రెండో కుమార్తె కొడుకుకు ఇచ్చాడని, అప్పటి నుంచి తనకు, తాతకు మధ్య గొడవలు పెరిగాయని, దీంతో చేసేదేంలేక తాతను హత్య చేయాలని నిర్ణయించుకున్నట్లు కీర్తితేజ వెల్లడించాడు. తాతను హత్య చేస్తేనే తనకు ఆస్తి దక్కుతుందని ఇన్ స్టా మార్ట్ నుంచి ఓ కత్తిని కొనుగోలు చేశాడని చెప్పాడు. హత్య జరిగిన రోజు తనకు తాత జనార్దన్ రావుకు పెద్ద గొడవ జరిగిందని, తనకు వాటా కావాలని అడిగితే..ఇవ్వను పో అంటూ దూషించాడట. ఇక కోపంతో రగిలిపోయిన కీర్తితేజ తాను కొన్న కత్తితో తాతను కసితీరా పొడిచి అక్కడి నుంచి పారిపోయాడు. హత్య చేసిన తర్వాత బీఎస్ మక్తా ఎల్లమ్మగూడ పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో కత్తి, రక్తంతో తడిచిన బట్టలను తగులబెట్టానని కీర్తితేజ వెల్లడించాడు. అయితే మంటల్లో కత్తి కాలిపోకపోవడంతో దాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన వెంటనే కీర్తితేజను పోలీసులు అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించారు. అయితే మొదటి రోజు విచారణలో అతడు నోరు విప్పలేదు. సీన్ రీకన్ స్ట్రక్షన్ కు కూడా సహకరించలేదు.

ఏ ప్రశ్న అడిగినా నేలచూపులు చూసేవాడు. ఇక రెండో రోజు సైతం సీన్ రీకన్ స్ట్రక్షన్ కు తీసుకెళ్లిన పోలీసులు తమదైన శైలిలో విచారణ మొదలుపెట్టారు. ఇక అప్పటి నుంచి కీర్తితేజ హత్యపై నోరువిప్పాడు. నిందితుడిని విచారణ అనంతరం చంచల్ గూడ జైలుకు తరలించినట్టు పోలీసులు తెలిపారు. కీర్తితేజ లాంటి యువత నేడు సమాజంలో ఎక్కువగా పెరిగిపోతుండడం కలవరపరిచే అంశమే. ఆస్తి పంపకాలు ఇప్పుడు చాలెంజింగ్ గా మారాయి. కుటుంబ సభ్యులు అందరు కూర్చుని మాట్లాడుకుంటే సద్దుమణిగే సమస్యలు ఎన్నో ఉంటాయి. క్షణికావేశంలో తీసుకుంటున్న నిర్ణయాలు మనుషుల ప్రాణాలను తీసుకుంటుండడం బాధాకరం.

# పెళ్లి కలలు.. యువతికి 6లక్షలు టోకరా వేసిన మోసగాడు

అధునాతన సమాజంలో పెళ్లి అనేది చాలామందికి పీడ కలగా మారింది. తనకు పెళ్లవుతుందా లేదా? ప్రేమ వివాహం అవుతుందా లేక పెద్దలు కుదిర్చిన వివాహం అవుతుందా? అంటూ ఎన్నో సందేహాలు. ఇదే డౌట్ ఆన్ లైన్‌లో పరిచయమైన ఒక జ్యోతిష్కుడిని అడిగింది 24 ఏళ్ల బెంగళూరు యువతి. విజయ్ కుమార్ అని తనను తాను పరిచయం చేసుకున్న మోసగాడు.. ఆ మహిళది ప్రేమ వివాహం అని, కానీ ఆమె జాతకంలో కొన్ని దోషాలున్నాయని జ్యోతిషంలో పరిష్కారం లభిస్తుందని నమ్మబలికాడు. లోటుపాట్లను పూజల ద్వారా పరిష్కరించవచ్చని చెప్పాడు. దాని కోసం అతడు ఏకంగా రూ.6 లక్షలు గుంజాడు. ఎలక్ట్రానిక్స్ సిటీ బెంగళూరులో మోసం ఇది. ఒక ప్రైవేట్ సంస్థ ఉద్యోగి అయిన ప్రియ (పేరు మార్చాం) దాఖలు చేసిన ఫిర్యాదు ప్రకారం.. జనవరి 5న ఇన్‌స్టాలో %ంజూశ్రీఅశీ1ఱఅఎఱుఖుర్‌తీశీశ్రీశీస్త్రవతీ% అనే ఖాతాలో ఒక వ్యక్తి పరిచయమయ్యాడు. ప్రొఫైల్‌లో అఘోరి బాబా ఫోటో ఉంది. తాను ప్రముఖ జ్యోతిష్కుడిని అని అతడు నమ్మబలికాడు. విజయ్ కుమార్ అని పరిచయం చేసుకున్న అతడికి ప్రియా ఒక మెసేజ్ చేసింది. తన



పేరు, పుట్టిన తేదీని వాట్సాప్ మెసేజ్ పంపి తన జాతకాన్ని చూడాల్సిందిగా కోరింది. వెంటనే అతడు జోశ్యం చెప్పడం ప్రారంభించాడు. ఆమెకు ప్రేమవివాహం అవుతుందని నమ్మించాడు. దీనికోసం రూ.1,820 ఖర్చయ్యే పూజ చేయాల్సి ఉంటుందన్నాడు. డబ్బును డిజిటల్ చెల్లింపు యాప్ ద్వారా చెల్లింపు చేయాలని కోరాడు. పెళ్లి అనే సమస్యను అతడు ఉపయోగించుకున్నాడు. తెలివిగా కథలు అల్లాడు. వరుసగా పూజలు చేయాలనే నెపంతో డబ్బును దోచుకున్నాడు. అతడికి దాదాపు రూ.6 లక్షలు చెల్లించిన తర్వాత కూడా ఇంకా డబ్బు గుంజాలని చూసాడు. చివరికి తనను మోసం చేస్తున్నాడని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. అయితే డబ్బు వెనక్కిస్తున్నాననే పేరుతో రూ.13,000 తిరిగి ఇచ్చిన అతడు తనను బలవంతం చేస్తే ఆత్మహత్య చేసుకుంటానని.. సూసైడ్ నోట్‌లో ఆమె పేరును కూడా రాస్తానని కుమార్ బెదిరించాడు. కొన్ని రోజుల తర్వాత, ప్రశాంత్ అనే వ్యక్తి ఆమెకు ఫోన్ చేసి తనను తాను న్యాయవాదిగా పరిచయం చేసుకున్నాడు. కుమార్ తన తరపున అనేక పూజలు చేసిన తర్వాత కూడా డబ్బు తిరిగి ఇవ్వమని ఆమె బలవంతం చేస్తుండటంతో ఆత్మహత్యకు సిద్ధంగా ఉన్నాడని న్యాయవాది ప్రియాకు చెప్పాడు. దీంతో ఇక ఈ మోసాన్ని భరించలేని ప్రియా తరువాత పోలీసులను సంప్రదించింది. మోసం జరిగిన తీరును బట్టి సైబర్ కేటుగాళ్ల పని ఇదని పోలీసులు నిర్ధారించారు. ఈ ఎపిసోడ్ లో జ్యోతిష్కులు లేరు.. న్యాయవాది లేడు. కానీ మోసం జరిగింది. ఎలక్ట్రానిక్స్ సిటీ పోలీసులు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం , బిఎన్ఎస్ సెక్షన్ 318 (మోసం) కింద కేసు నమోదు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

# అమెరికాపై అక్రమంగా కాలుమోపని తెలుగోడు.. డిపోర్టేషన్ జాబితానే సాక్ష్యం

అమెరికా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టారో లేదో.. డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన డిపోర్టేషన్ (అక్రమ వలసదారుల తరలింపు) ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతోంది. ఆ దేశం వారు ఈ దేశం వారు అని చూడకుండా అక్రమం ఉంటున్నవారందరినీ బలవంతంగా విమానాలు ఎక్కించి మరీ అమెరికా నుంచి పంపేస్తున్నారు. ఎవరు జోక్యం చేసుకున్నా ఆగేది లేదంటూ సైనిక విమానాల్లో సంకెళ్లు వేసి వారి స్వదేశాల్లో దింపేస్తున్నారు. అమెరికా నుంచి 104 మంది అక్రమ వలసదారులతో కూడిన విమానం ఈ నెల 5న ఒకటి వచ్చిన సంగతి తెలిసిందే. 116 మందితో ఈ నెల 15న రెండో విమానం, 112 మందితో మూడో



విమానం అమృత్ సర్ లో ఆదివారం రాత్రి ల్యాండ్ అయింది. అమెరికా నుంచి ఇప్పటివరకు 332 మంది అక్రమ వలసదారులు స్వదేశానికి చేరారు.

వీరిలో పంజాబీలే 126 మంది ఉన్నారు. దీనికి పొరుగు రాష్ట్రమైన హరియాణకు చెందినవారు 110, గుజరాత్ వారు 74, యూపీ 6, మహారాష్ట్ర 5, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, గోవా, చండీగఢ్ కు చెందినవారు ఇద్దరు చొప్పున, జమ్మూకశ్మీర్, ఉత్తరాఖండ్ కు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

**తెలుగువారున్నారా?...** అమెరికా తరిమేసిన అక్రమ వలసదారుల్లో ఇప్పటివరకు ఇక్కరు తెలుగువారు లేరు. అంటే.. మనవారంతా సక్రమ పద్ధతుల్లో, సరైన పత్రాలతో అమెరికా గడ్డపై కాలుమోపుతున్నారని భావించవచ్చు. అంతేకాదు.. ఇప్పటివరకు వచ్చినవారంతా ఉత్తర భారత దేశం వారే కావడం గమనార్హం. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, ఏపీలవారు ఒక్కరూ లేకపోవడం విశేషం. అయితే, ఇప్పటివరకు లేనందున ఇకపై కూడా ఉండరని భావించడం సరైనది కాదు.

ట్రంప్ ప్రభుత్వం చేపట్టిన మాస్ డిపోర్టేషన్ లో తెలుగోళ్లు ఒకరిద్దరైనా దొరికితే అది ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. బహుశా అలా జరగదనే అభిప్రాయం వినిపిస్తోంది.

# పార్లమెంటులో అబద్ధాలు.. ఆ ఎంపీకి రూ.9లక్షల జరిమానా

సింగపూర్‌లోని భారత సంతతి నేత ప్రీతమ్ సింగ్‌కు ఓ కేసులో చుక్కెదురైంది. ప్రతిపక్ష నేతగా ఉన్న ఆయనపై.. పార్లమెంటులో అబద్ధాలు చెప్పారనే అభియోగాలు రుజువయ్యాయి. దీంతో 14వేల డాలర్ల (సింగపూర్ కరెన్సీ) జరిమానా విధిస్తూ స్థానిక న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అయితే, ఈ శిక్షతో పార్లమెంటు సభ్యుడిగా అనర్హత వేటు పడే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. భారత సంతతికి చెందిన ప్రీతమ్ సింగ్.. సింగపూర్ వర్కర్స్ పార్టీ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. అయితే, ఆ పార్టీకి చెందిన మాజీ సభ్యురాలు రయీసా ఖాన్‌పై 2021లో పార్లమెంటులో అబద్ధం చెప్పారనే ఆరోపణలు రావడంతో ప్రివిలేజె స్ కమిటీ విచారణ చేపట్టింది. కమిటీ ముందు విచారణకు హాజరైన ప్రీతమ్ సింగ్, రెండు సందర్భాల్లో తప్పుడు వాంగ్మూలం ఇచ్చార నే అభియోగాలు వచ్చాయి. దీనిపై నాలుగు నెలల క్రితం విచారణ మొదలైంది. రెండు అభియోగాల్లో ప్రీతమ్‌పై నేరం రుజువు కావ డంతో ఒక్కో కేసులో గరిష్ఠంగా 7వేల సింగపూర్ డాలర్ల




జరిమానా విధిస్తూ స్థానిక న్యాయస్థానం తీర్పు చెప్పింది. అయితే, సింగపూర్ రాజ్యాంగం ప్రకారం.. ఏదైనా కేసులో ఎంపీకి కనీసం ఏడాది జైలుశిక్ష లేదా 10వేల సింగపూర్ డాలర్లు జరిమానా పడితే పార్లమెంటు సభ్యత్వం కోల్పోతారు. కానీ, ప్రీతమ్‌కు గరిష్ఠంగా 7వేల డాలర్లు పడటం, జరిమానా గరిష్ఠ పరిమితి తక్కువగా ఉండటంతో ఆయన ఎంపీ సభ్యత్వానికి ఎటువంటి ప్రమాదం లేదని ఎన్నికల విభాగం వెల్లడించింది. ఒక కేసులో పడిన గరిష్ఠ జరిమానాను మాత్రమే పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేసింది. తీర్పు వెలువడిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రీతమ్ సింగ్.. ఈ ఏడాది నవంబర్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తప్పకుండా పోటీ చేస్తానని స్పష్టం చేశారు.

చురకలు

## సంపాదకీయం

# విదేశీ ఇన్వెస్టర్ల అమ్మకాలపై నిర్మలమ్మ కవరింగ్ ఓకే.. లాజిక్ మిస్?

ఇటీవల కాలంలో స్టాక్ మార్కెట్ లో చోటు చేసుకున్న పరిణామాలు తెలిసిందే. గడిచిన కొద్ది రోజులుగా నేలచూపులు చూస్తున్న స్టాక్ మార్కెట్.. గత వారమైతే నష్టాల మోత మోగించటమే కాదు.. దారుణ నష్టాల్ని తీసుకొచ్చేలా చేసింది. మార్కెట్ బులీష్ ట్రెండ్ కు ప్రధాన కారణం విదేశీ సంస్థాగత మదుపర్లు ఎడాపెడా అమ్మకాల్ని చేపట్టటంతో మార్కెట్లు డౌన్ అవుతున్నాయి. ఈ తీరుపై ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలాంటి వేళ.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పరిస్థితిని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. స్టాక్ మార్కెట్ తిరోగమనం వెనుక ప్రత్యేక కారణం లేదన్నట్లుగా మాట్లాడిన ఆమె.. మన దగ్గర పెట్టుబడులు పెడితే మరింత చక్కటి రిటర్న్ లు వస్తున్నాయని.. అందుకే అమ్మకాలకు దిగుతున్నట్లుగా చెబుతున్నారు. నిర్మలమ్మ మాటలు వినేందుకు బాగానే ఉన్నట్లు కనిపించినా.. అందులో లాజిక్ మిస్ అయిన కోణం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఒకవేళ.. నిజంగానే భారత మార్కెట్ బాగుండి.. లాభాల స్వీకరణ నేపథ్యంలో విదేశీ మదుపర్లు అమ్మకాలకు తెగబడుతున్నారని అనుకుందాం. కానీ.. ఇప్పుడు పలు స్టాక్‌లు కనిష్ఠాన్ని నమోదు చేసుకుంటున్నాయి. ఇలాంటి వేళలో అమ్మకాలు చేపడితే నష్టమే తప్పించి లాభం కాదు కదా? లాభాలు వస్తాయన్న నమ్మకం ఉన్నప్పుడు చూస్తూ.. చూస్తూ నష్టాలకు ఎందుకు అమ్మకాలు చేపడతారన్నది ఒక లాజిక్. ఈ విషయంపై కేంద్ర మంత్రి వివరణ ఇచ్చి ఉంటే బాగుండేది. భారత ఎకానమీలో పెట్టుబడులపై మంచి రాబడులు వచ్చే పరిస్థితులు ఉన్నట్లుగా చెప్పిన నిర్మలమ్మ మాటలే నిజమైతే..మరింత భారీగా కొనుగోళ్లు జరుగుతాయే తప్పించి అమ్మకాలకు తెగబడరు కదా? అంతేకాదు.. గత ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.1.56 లక్షలకోట్ల మేర స్టాక్స్ అమ్మినట్లుగా చెబుతున్నారు. ఇక్కడ గుర్తించాల్సిన చేదు నిజం ఏమంటే.. ఈ ఏడాది ఇప్పటివరకు రూ.లక్ష కోట్ల మేర స్టాక్స్ అమ్మకాలు సాగటమే. నష్టాల జోరు నడుస్తున్న వేళ.. విదేశీ మదుపరులు అమ్మకాలకు తెగ బడటం వెనుక అసలు కారణం ఇంకేదో ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఆంధ్రప్రదేశ్ ఏర్పాటులో పెద్దమనుషుల ఒప్పందం - ఫిబ్రవరి... 20 పెద్దమనుషుల ఒప్పందం దినం





ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బ్రిటిష పరిపాలనా కాలంలో, మద్రాసు ప్రెసిడెన్సీలో భాగంగా ఉండేది. తెలుగు మాట్లాడే ప్రాంతాలన్నిటినీ ప్రెసిడెన్సీ నుండి విడదీసి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని కోరుతూ తెలుగు వారు ఉద్యమించారు. పొట్టి శ్రీరాములు ఆమరణ దీక్షతో తారా స్థాయికి చేరిన ఈ ఉద్యమం ఆయన మరణం తర్వాతనే సఫలీకృతమై, ఫలితంగా 1953 అక్టోబరు 1 న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. మద్రాసు ప్రెసిడెన్సీ లోని తెలుగు భాష మాట్లాడే ప్రజలున్న భూభాగాన్ని వేరుచేసి దీన్ని ఏర్పరచారు. 1953 డిసెంబరులో సయ్యద్ ఫజల్ ఆలీ నేతృత్వంలో రాష్ట్రాల పునర్విభజన కమిషను ఏర్పాటయింది. 1955 సెప్టెంబర్ 30 న తన నివేదిక సమర్పించింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అది సమర్ధించింది. మరాఠీ మాట్లాడే ప్రాంతాలను మహారాష్ట్రలోను, కన్నడం మాట్లాడే ప్రాంతాలను కర్ణాటకలోను కలిపి తెలుగు మాట్లాడే ప్రాంతాలను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చెయ్యాలని సూచించింది. అయితే ఐదు సంవత్సరాల తరువాత రాష్ట్ర శాసనసభలో మూడింట రెండు వంతులు సభ్యులు ఒప్పుకుంటే, ఆంధ్రతో విలీనం చెయ్యవచ్చని కూడా సూచించింది. కమిషను సూచనలను ఆహ్వానించి, ప్రత్యేక రాష్ట్ర వాదనను సమర్ధించిన వారిలో కె.వి.రంగారెడ్డి, మర్రి చెన్నారెడ్డి ప్రముఖులు. హైదరాబాదు శాసనసభలో అధిక శాతం సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్ధించారు. శాసనసభలో ఈ విషయంపై చర్చ జరిగినపుడు, 103 మంది సభ్యులు ఆంధ్ర ప్రదేశ్‌కు మద్దతు తెలుపగా, 29 మంది మాత్రమే వ్యతిరేకించారు. 15 మంది తటస్థంగా ఉండి పోయారు. ఆంధ్ర ప్రదేశ్‌ను సమర్ధించిన ప్రముఖ నాయకులలో అప్పటి ముఖ్యమంత్రి బూరుగుల రామకృష్ణా రావు, మాడపాటి హనుమంతరావు, స్వామి రామానంద తీర్థ మొదలైనవారు ఉన్నారు. దీని నివేదికపై తెలంగాణ, విశాలాంధ్ర వాదులు తమతమ వాదనలను తీవ్రతరం చేసారు. కమ్యూనిస్టులు తీవ్రంగా ప్రతిస్పందిస్తూ, హైదరాబాదు శాసనసభకు రాజీనామా చేసి, ఈ విషయంపై ఎన్నికలకు వెళ్తామని ప్రకటించారు. కాంగ్రెసు అధిష్ఠానం కూడా ఆంధ్ర ప్రదేశ్‌నే సమర్ధించి, ఆంధ్ర, తెలంగాణ నాయకులను తమ విభేదాలను పరిష్కరించు కొమ్మని ఒత్తిడి చేసింది. అయితే తెలంగాణ నాయకులకు తమ ప్రాంత అభివృద్ధిపై కొన్ని సందేహాలు ఉన్నాయి. అధిక రెవిన్యూ ఆదాయం గల తమ ప్రాంతం, అదే నిష్పత్తిలో అభివృద్ధికి నోచుకోదేమోనన్న భయం వారికి కలిగింది. ఇటువంటి ఇతర సందేహాల నివృత్తికై అన్ని ప్రాంతాల కాంగ్రెసు నాయకులు కలిసి 1956 ఫిబ్రవరి 20 న ఢిల్లీలో రెండు ప్రాంతాల నాయకులు సమావేశ మయ్యారు. తెలంగాణ పక్షాన బూరుగుల రామకృష్ణా రావు, కె.వి.రంగారెడ్డి మర్రి చెన్నారెడ్డి, జె.వి.నర్సింగ రావు పాల్గొనగా, ఆంధ్ర తరపున బెజవాడ గోపాలరెడ్డి, నీలం సంజీవరెడ్డి, గౌతు లచ్చన్న, అల్లూరి సత్యనారాయణ రాజు సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ విధంగా అనేక చర్చలు, సంప్రదింపుల అనంతరం 1956 జూలై 19 న వారి మధ్య పెద్ద మనుషుల ఒప్పందం కుదిరింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటుకు మార్గం సుగమమైంది. 1956 నవంబర్ 1న అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేతుల మీదుగా ఆంధ్ర ప్రదేశ్ ఆవిర్భవించింది. నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి కాగలిగాడు. పెద్దమనుషుల ఒప్పందంలోని ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి... కనీసం ఐదేళ్ళపాటు, ప్రాంతాల వారీ రెవిన్యూ వసూళ్ళకు అనుగుణంగా ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై ఖర్చు పెట్టాలి. తెలంగాణ ప్రాంతం నుండి వచ్చే మిగులు ఆదాయాన్ని ఆ ప్రాంతపు అభివృద్ధికే కేటాయించాలి. తెలంగాణలో విద్యా సంస్థలను అభివృద్ధి చెయ్యాలి. స్థానిక విద్యార్థులకు ప్రత్యేక రిజర్వేషనులు ఇవ్వాలి. సివిల్ సర్వీసులకు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలకు నియామకాలు జనాభా నిష్పత్తి ప్రకారం జరగాలి. ఐదేళ్ళ పాటు పాలనా వ్యవస్థ లోను, న్యాయ విభాగం లోను ఉర్దూ వినియోగం కొనసాగాలి. రాష్ట్ర మంత్రివర్గంలో నిష్పత్తి ప్రకారం సభ్యులు ఉండాలి. ముఖ్యమంత్రి కోస్తా, రాయలసీమ నుండి ఉంటే ఉపముఖ్యమంత్రి తెలంగాణా నుండి, ముఖ్యమంత్రి తెలంగాణ వ్యక్తి అయితే ఉపముఖ్యమంత్రి ఇతర ప్రాంతాల నుండి ఉండాలి. ఈ ప్రాంత అభివృద్ధి బాధ్యత తెలంగాణ అభివృద్ధి మండలికి ఉండాలి. మండలి సభ్యులు తెలంగాణ ప్రాంతం నుండి ఎన్నికైన శాసన సభ్యులు ఉండాలి. తెలంగాణాలో మద్యపాన నిషేధాన్ని తెలంగాణ శాసన సభ్యులు కోరిన విధంగా అమలు చెయ్యాలి. తెలంగాణ ప్రాంతంలోని ఉద్యోగాల్లో చేరేందుకు ఆ ప్రాంతంలో కనీసం 12 ఏళ్ళపాటు నివసించి ఉండాలని నిబంధన రూపొందించాలి. కాబినెట్ మంత్రులలో 40 శాతం తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే ఉండాలి. ఈ ఒప్పందం తరువాత తెలంగాణా నాయకులలో ఉన్న సందేహాలు తొలగి, ఆంధ్ర ప్రదేశ్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఆ ఒప్పందాన్ని అనుసరించి 1956 నవంబర్ 1 న ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినాక, ఆంధ్ర ప్రాంతానికి చెందిన నీలం సంజీవరెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టాడు. పెద్ద మనుషుల ఒప్పందం అమలులో ఆంధ్రనాయకులు చిత్తశుద్ధి ప్రదర్శించ లేదు. విలీనానికి మార్గం కనిపించక ఒప్పందం చేసుకున్నారే గాని, అమలు చర్యలు చేపట్టనే లేదు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం తెలంగాణకు విస్తృతమైన అధికారాలుగల ప్రాంతీయ మండలి ఏర్పాటు చేయాల్సి ఉండగా, కేవలం సలహాలు మాత్రమే ఇవ్వగల, అధికారాలు ఏ మాత్రం లేని కమిటీని వేశారు. తెలంగాణకు సంబంధించిన హక్కుల ఉల్లంఘన మొదటిదిగా ఇలా మొదలైంది. ఒప్పందం ప్రకారం ముఖ్యమంత్రి ఆంధ్రకు చెందిన వ్యక్తి ముఖ్య మంత్రి అయిన నీలం సంజీవరెడ్డి తెలంగాణ వారికి ఉపముఖ్యమంత్రి పదవి ఇవ్వటానికి సుతరామూ అంగీకరించ లేదు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం 1962 వరకు తెలంగాణ ప్రాంతానికి విడిగా కాంగ్రెస్ కమిటీ ఉండాలి. కానీ 1957లోనే తెలంగాణకు ఉన్న కాంగ్రెస్ కమిటీనికి రద్దుచేసి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో విలీనం చేశారు. తెలంగాణ నాయకత్వం ముందుకు వెళ్ళకుండా చేశారు. సాగునీటి విషయంలో రెండో పంచవర్ష ప్రణాళిక (1961-66) కాలంలో ఆంధ్రప్రాంతంలో సాగునీటి సౌకర్యాలకు రూ.93.67 కోట్లు ఖర్చుచేయగా తెలంగాణలో కేవలం రూ.56.76 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. హైదరాబాద్ రాష్ట్రంలో ప్రతిపాదించిన ప్రాజెక్టుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేవునూరు, ఇచ్చంపల్లి ప్రాజెక్టులను పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. పోచంపాడు, నాగార్జున సాగర్ ప్రాజెక్టులలో తెలంగాణకు తీరని అన్యాయం చేసింది. ముల్కీ నియమాలకు విరుద్ధంగా ఆంధ్రలో అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారని వారిని తెలంగాణకు కేటాయించారు. స్థానికత నిబంధనలను మార్చి స్థానికేతరులను వందలాదిగా నియమించారు. పెద్దమనుషుల ఒప్పందం ప్రకారం రాష్ట్ర, కేంద్ర, సాధారణ పరిపాలనా వ్యయానికి అయ్యే ఖర్చును ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు నిష్పత్తి ప్రకారం భరించాలి. ఈ ఖర్చుపోగా తెలంగాణ ఆదాయంలో మిగులును ఈ ప్రాంత అభివృద్ధి కోసమే ఖర్చు చేయాల్సి ఉండగా ఆంధ్ర పాలకులు తెలంగాణ మిగులు నిధులను పక్షపాతం తో దుర్వినియోగం చేశారు. ఇలా ఈవిధంగా తెలంగాణ రక్షణల ఉల్లంఘన కారణంగా తెలంగాణ మనుగడ, అస్తిత్వం సంక్షోభంలో పడి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా 1969 తెలంగాణ ఉద్యమానికి దారితీసింది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# వివక్షత నిర్మూలన ద్వారానే సామాజిక న్యాయం - ఫిబ్రవరి 20...ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం




ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 20న నిర్వహించ బడుతుంది. చట్టపరంగా ఎలాంటి వివక్షత, తారతమ్యం లేకుండా ప్రజలందరికి సమన్యాయం జరగాలని ఐక్యరాజ్య సమితి పిలుపునిచ్చిన రోజుకు గుర్తుగా ఈ దినోత్సవం జరుపుకుంటారు. పేద రికం, నిరుద్యోగం వంటి సమస్యల ను అధిగమించడానికి చేయవల సిన కృషికోసం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుపు కోవాలన్న ప్రతిపాదనను 2007, నవంబరు 26న జరిగిన ఐక్యరాజ్య సమితి ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశం, ఎ/ఆర్‌ఈఎస్/62/10 ద్వారా తీర్మానించగా 2009, ఫిబ్రవరి 20న తొలిసారిగా ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం జరుప బడింది. ఐక్య రాజ్య సమితి, 2007 నవంబర్ 26నాటి సర్వ సభ్య సమావేశంలో ప్రధానంగా పేదరిక నిర్మూలన, అందరికీ పని, ప్రజలం దరి పూర్తి సమానత్వం, సంక్షేమ స్థాపన ప్రధానాంశాలుగా సమావేశం చర్చించింది. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించ వలసిన అవసరాన్ని గుర్తించి పేదరికం, లింగ సమాన త్వం, నిరుద్యోగం, మానవ హక్కు లు, సామాజిక రక్షణ వంటి అనేక సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించడం, అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య స్నేహ బాంధ వ్యాలు ఏర్పాటుచేయడం, సామర స్య వాతావరణం సాధించడం, వివిధ దేశాలమధ్య సమాన ప్రాతిపదికపై సంబంధాలు నెలకొల్ప డంబీ విలువలు, స్వేచ్ఛ, వ్యక్తి గౌరవం, భద్రత, ఆర్థిక సామాజిక పురోభివృద్ధి వంటి ప్రాథమిక అంశాల విషయంలో ఎటువంటి వివక్షత పాటించకుండా సామాజిక న్యాయం అమలయ్యేలా చూడడం తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చించారు. ఫలితంగా ఆ సమావేశంలో మొదటిసారిగా సామాజిక న్యాయంకు సంబంధించి సూత్రాలను రూపొందించింది. అన్ని సభ్య దేశాలు ఖచ్చితంగా వాటిని అమలు చేస్తామని ప్రతిజ్ఞ చేశాయి. సామాజిక న్యాయం అనేది కేవలం నైతిక ఆవశ్యకత మాత్రమే కాదు, అది జాతీయ స్థిరత్వం, ప్రపంచ శ్రేయస్సుకు ఆధారం. మానవుడు నాగరికతకు అలవాటు పడే అవకాశాలు కలిగిన నాటి నుండి సామాజిక న్యాయ పాలన గురించి కలలు కంటున్నాడు. ప్రజలంతా సమాన అవకాశాలు కలిగి ఉండడం వారి జన్మ హక్కు. అయితే అలాంటి హక్కును అధిక శాతం పొందలేక పోతున్నారు. ప్రపంచ జనాభాలో 80 శాతం మందికి సామాజిక భద్రత వర్తింపు లేదు. ముఖ్యంగా మహిళలను తమ శక్తి యుక్తులను వినియోగించుకుని, ఆర్థిక అభివృద్ధికి సమాన స్థాయిలో దోహద పడేం దుకు అనేక రూపాల్లో వున్న వివక్షత అవరోధంగా మారుతు న్నది. పర్యవసానంగా అధిక సంఖ్యలో స్త్రీ పురుషులు నిరుద్యో గులుగా ఉంటున్నారు. శ్రామిక జనాభాలో ఆశించిన స్థాయిలో శ్రమిస్తున్నప్పటికీ చాలీ చాలని ఆదాయం ద్వారా దారిద్ర్య రేఖకు ఎగువకు తమ కుటుంబాలను తీసుకెళ్ళలేక పోతున్నారు. అత్య ధిక సంఖ్యాకులైన యువ జన, స్త్రీ, పురుషులకు ఎలాంటి ఉపాధులు లేవు. నిరుద్యోగ వ్యవస్థ అసాధారణ స్థాయికి పెరిగి పోతు న్నది. యువత పని లేకుండా ఉంటూ అవాంఛిత అలవాట్లకు లోనై తమ బంగారు జీవితాలను బలి పెడుతున్నారు. సామాజిక న్యాయం మానవ హక్కులు మరియు సమానత్వం అనే భావనలపై ఆధారపడింది. సామాజిక న్యాయం సాధించాలంటే మానవ హక్కులను పరిరక్షించి, వాటికి విలువను ఇచ్చి, ప్రతి మనిషి గౌరవాన్ని గుర్తించి, సమాన త్వం మరియు ఐకమత్యం అనే సూత్రాల ఆధారంగా సాంఘిక సమానత్వ సమాజ స్థాపన జరగాలి. అన్ని రకాల మానవ దోపిడీ వ్యక్తీకరణలను అణచి వేయాలి. యువజన స్త్రీ పురుషుల ఉపాధి లేమితో పాటు నానాటికీ పెరిగిపోతున్న బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించే చర్యలు గై కొనాలి. అలాగే బలవంతపు చాకిరీ, ఉపాధి లేమి, స్త్రీ పురుషులు మానవ అక్రమ రవాణా, దారి ద్ర్యం, ఉచ్చులనుండి విముక్తి కలిగించాలి. ప్రతి పౌరునికి జీవనాధారం అంటే సముచిత ఉపాధి కల్పించాలి. ఉపాధి అవకాశాలు కల్పించాలి. పని ప్రదేశాల్లో మౌలిక హక్కులను పరిరక్షించాలి..సామాజిక న్యాయం సాకారం కావాలంటే... పేదరిక నిర్మూలనకు, ప్రజలకు పూర్తి ఉపాధి మరియు మంచి పనిని అందించడానికి, స్త్రీ పురుషులకు సమాన హక్కులను సాధించడానికి, అలాగే అందరికీ సామాజిక సంక్షేమం మరియు సామాజిక న్యాయాన్ని అందించ డానికి పాలక వర్గాలు కృషి సల్పాలి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# పరమ పవిత్రం... మాఘమాస అరుణోదయ స్నానం



హైందవ సాంప్రదాయంను అనుసరించి ప్రతి మాసానికి ఒక విశిష్టత ఉంది. మాఘ ఫాల్గుణాలు శిశిర రుతువులో ఉంటాయి. సంవ త్సరంలో పదవ మాసమూ, హేమంత రుతువులోని రెండో మాసమూ అయిన పుష్యం తెలుగు వారికి శూన్యమాసం. సంవత్సరంలోని నాలుగవ మాసమూ, గ్రీష్మ రుతువులోని రెండవ మాసమూ అయిన ఆషాఢం కూడా తెలుగు వారికి శూన్య మాసమే. శూన్య మాసాలు శుభ శోభనాలకు పనికిరానివి. ఒక సంవత్సరం చివరి పాదంలో వచ్చే పుష్య మాసానికి, మరు సంవత్సరం రెండవ పాదంలో వచ్చే ఆషాఢానికీ మధ్య ఆయిదు మాసాల తేడా ఉంటుంది. మాఘం, ఫాల్గుణం, చైత్రం, వైశాఖం, జ్యేష్టం లకు “మాఘాది పంచకం” అని పేరు. ఇవి శుభకార్యాలకు అనుకూల కాలం. వాన, చలి అంతగా ఉండక, వస్త్ర గృహ సమస్య ఇబ్బంది కలిగించక, ధాన్యలక్ష్మి ఆరు బయట విరివిగా మసలే కాలమిది. శాక పాకాలు సమృద్ధిగా, అనుకూలంగా ఉండే మాస పంచకానికి తొలిమాసం మాఘం. ‘మఘం’ అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు మాఘ మాసాన్ని శ్రేష్ఠమైనదిగా భావించే వారు. మాఘమాసం మహిమ అఘము అనే పదానికి సంస్కృతంలో పాపము అని అర్థం. మాఘము అంటే పాపాలను నశింప చేసేది అనే అర్థం. ఈ మఘాధి పత్యాన క్రతువులు జరిగే మాసం గనుక మాఘ మాసమైంది. సంవత్సరంలో పదకొండవ మాసమైన మాఘంలో గృహ నిర్మాణాలు ఆరంభిస్తే సంపత్తి కలుగగలదని మత్స్య పురాణం స్పష్ట పరుస్తున్నది. మాఘ మాసపు ఆదివారాలు మహిమాన్వితాలు. ఈ రోజులలో సూర్యపూజ చేసిన వారికి ఆరోగ్య, భోగ భాగ్యాలు కలుగుతాయని పద్మ పురాణాధారం. కార్తీకంలో “దీపానికి” ఎంత ప్రాధాన్యత ఉందో, మాఘ మాసంలో “స్నానానికి” అంత ప్రాముఖ్య ఉంది. మకర లగ్నంలో సూర్య భగవానుడు ఉండే సమయాన స్నానం ఫలితం కోటి జన్మాల పుణ్య కార్యాలతో లభ్యం కానిదని చెపుతారు. మాఘస్నాన మహాత్యాన్ని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. సూర్యుడు ఉదయించే సమయంలో స్నానం చేస్తే మహాపాతకాలు నశిస్తాయని నిర్ణయ సింధులో పేర్కొన బడింది. మాఘమాసంలో ఉషఃకాల స్నానం పుణ్యప్రదం. సూర్యుడు ఉన్న మకర రాశిని బట్టి ప్రత్యూష కాలంలో సూర్యకిరణాలు ఒక ప్రత్యేక కోణంలో భూమిని చేరుతాయి. ఆ సమయంలో సూర్య కిరణాల్లో ఉండే అతినీల లోహిత, పరారుణ కిరణాల సాంద్రతల్లో మార్పులొస్తాయి. సూర్యుడు మకర రాశిగతుడు అయినప్పటి నుండి ప్రాతఃకాల స్నానాలు తప్పక చేయాలి. మాఘ మాసంలో ఉషఃకాల సమయాన నదులలో, చెరువులలో, మడుగులలో, కొలను లలో, తుదకు బావులలో స్నానం చేస్తే ప్రయాగ స్నాన ఫలితం దక్కుతుంది. మాఘమాసంలో సూర్యుడు మకరరాశిలో ఉండే సమయంలో సూర్యోదయానికి ముందు వేడి నీటిలోనైనా ఇంట్లో స్నానం చేసిన స్నానంతో నైనా ఆరు సంవత్సరాల అఘమర్షణ స్నాన ఫలం లభిస్తుందని చెబుతుంటారు. బావి నీటి స్నానం పన్నెండేళ్ల పుణ్య ఫలాన్ని, తటాక స్నానం ద్విగుణం, నదీ స్నానం చాతుర్గుణం, మహానదీ స్నానం శత గుణం, గంగా స్నానం సహస్ర గుణం, త్రివేణీ సంగమ స్నానం నదీ శత గుణ ఫలాన్ని ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. హిందూ సంప్రదాయం ప్రకారం మామ మానములో నదీస్నానము చేసి, శ్రీమన్నారాయణుని పూజిం చి, శక్తికొలది దానం చేస్తే కోటి క్రతువులు చేసినంత ఫలితం కలుగుతుంది. మాఘమాసంలో నది నీరైననూ గంగానదితో సమానం. “గంగేచ యమునే గోదావరి సరస్వతీ - నర్మదా సింధు కావేరీ జలేస్మిన్ సన్నిధిం కురు”. గంగ, గోదావరి, కావేరి లాంటి పవిత్ర నదులను తలుచు కుని, పుణ్య స్నానం ఆచరించాలి. సూర్యుడికి అర్ఘ్యం ప్రదానం చేయాలి. అశక్తత చేత నిర్ణీత సమయ మందు స్నానం చేయ జాలని వారు పొద్దు పొడిచిన జాములోగా చేయాలి. చలికి వెరవ కయే మం,చు ఆవరించి ఉన్న నదీ జలాలలో, స్నానం శ్రేష్ఠమని పురా ణాలు ఘోషిస్తున్నాయి. స్నానానంతరం శివాలయాలకు వెళ్ళి, నువ్వుల నూనెతో దీపాలు వెలిగిస్తే సకల దోష పరిహారం కాలదనే విశ్వాసం. మాఘమాన అరుణోదయ స్నానం,అరుణోదయ దీపారాధనం, తిల దానం, తిల భక్షణం ఉత్కృష్ట మైనవి. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

## త్వరలో కోకాపేట ట్రంపెట్ ప్రారంభం


హైదరాబాద్: బాహ్యవలయ రహదారిపై కోకాపేట వద్ద నిర్మించిన ట్రంపెట్ జంక్షన్‌ను త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.60 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ దీన్ని నిర్మించింది. ఇది అందుబాటులోకి వస్తే ఓఆర్ఆర్ నుంచి నేరుగా నియో పోలిస్ లేఅవుట్‌లోకి వాహనాలు వెళ్లొచ్చు. కోకాపేటలో 500 ఎకరాల్లో నియో పోలిస్ పేరుతో హెచ్ఎండీఏ భారీ లేఅవుట్ వేసిన సంగతి తెలిసిందే. గరిష్ఠంగా ఎకరం వందకోట్లు పలికింది. అందుకు తగ్గట్టుగా మౌలిక వసతుల కల్పన కోసం



హెచ్ఎండీఏ భారీగా వ్యయం చేస్తోంది. నిర్మాణ సంస్థలు సైతం గృహ, కార్యాలయాల ప్రాజెక్టులను 50 నుంచి 60 అంతస్తుల వరకు నిర్మిస్తున్నాయి. ఇవన్నీ పూర్తైతే 5 లక్షల మంది ఈ ప్రాంతం నుంచి పనిచేసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న ఓఆర్ఆర్‌కు అనుసంధానం లేకపోతే ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉండటంతో ట్రంపెట్‌ను చేపట్టారు.

## పక్కా గూడు.. పరిస్థితి చూడు!

కరీంనగర్: జగిత్యాల పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదల కోసం మల్యాల మండలం నూకపల్లి వద్ద అర్బన్‌కాలనీ ఏర్పాటు చేసి 4500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని 2008లో నాటి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్ని నిర్మాణాలు పూర్తికాగా కొన్ని బేస్‌మెంట్, గోడల వరకు నిర్మించి వదిలేశారు. 2014లో భారాస(తెరాస) ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పాత వాటిని వదిలేసి పక్కనే కొత్తగా 4250 రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందించారు. ఇంకా 600 ఇళ్లు పంపిణీ చేయాల్సి ఉంది. జగిత్యాల పట్టణానికి



దూరంగా ఉండడంతో బస్సు సౌకర్యం, మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో పంపిణీ చేసిన ఇళ్లలో లబ్ధిదారులు నివాసం ఉండడం లేదు. 2008లో చేపట్టిన ఇళ్లు అసంపూర్తిగా వదిలేయడంతో పిచ్చిమొక్కలు పెరిగాయి. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణాలు పూర్తిచేయడంతో పాటు కొత్తగా నిర్మించిన గృహసముదాయంలో మౌలిక వసతులు కల్పించి నిరుపేదలకు అందించాల్సి ఉంది.

## వేటగాళ్ల ఆట కట్టిస్తాం

ఖమ్మం : పచ్చని అడవులు జీవ వైవిధ్యానికి నిలయం.. అటవీ జంతువులు స్వేచ్ఛగా జీవించేందుకు అటవీశాఖ నిధులు ఖర్చు చేస్తోంది. వన్యప్రాణుల రక్షణకు చర్యలు చేపడుతోంది. వేసవిలో జంతువుల కోసం నీటి వనరులు ఏర్పాటు చేస్తోంది. జంతువుల కదలికలు నమోదు చేసేందుకు కెమెరాలను ఏర్పాటు చేస్తోంది. కానీ కొంతమంది వేటగాళ్లు విచ్చలవిడిగా వన్యప్రాణులను వేటాడుతున్నారు. జంతువులను చంపి మాంసం, చర్మం విక్రయిస్తున్నారు. వీరి ఆగడాలను నిలువరించేందుకు అటవీశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. రఘునాథపాలెం, కొణిజర్ల, కామేపల్లి, కారేపల్లి, ఏన్కూరు మండలాల్లో వన్యప్రాణుల వేట జరుగుతున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. అభయారణ్యంలో నీరు దొరక్క జంతువులు మైదాన ప్రాంతాల్లోని జల వనరుల వద్దకు చేరుతున్నాయి. ఈ సమయంలో వేటగాళ్లు మాటువేసి వాటిని మట్టుబెడుతున్నారు. ఉచ్చులు బిగించి, విద్యుత్తు వైర్లు అమర్చి హతమారుస్తున్నారు. అడవి పందులు, దుప్పులు, జింకలు, ఏదుల వంటి వాటిని చంపి మాంసం విక్రయిస్తున్నారు. అటవీ జంతువుల రక్షణకు అటవీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. నిత్యం తనిఖీలు చేసి వేటకు ఉపయోగించే తీగలను స్వాధీనం చేసుకుంటున్నారు. విద్యుత్తుశాఖ అధికారులు, పోలీసుశాఖ సహకారం తీసుకుంటున్నారు. కారేపల్లి అటవీ రేంజి పరిధిలో ఇటీవల అటవీశాఖ అధికారులు.. పోలీసులు, విద్యుత్తుశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

**కెమెరా ట్రాప్‌లను ధ్వంసం చేస్తూ..**

వన్యప్రాణుల రక్షణ కోసం పలు ప్రాంతాల్లో అధికారులు కెమెరా ట్రాప్‌లను ఏర్పాటు చేశారు. కనకగిరి అడవుల్లోని పులిగుండాల, సత్తుపల్లి, తల్లాడ, మధిర ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఒక్కో కెమెరా ఖరీదు రూ.25 వేలు. వీటితో అడవిలోని ప్రతి కదలిక జిల్లా అటవీశాఖ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంకు చేరుతుంది. డీఎఫ్ఓ కార్యాలయంలో సైతం సమాచారం తెలుస్తోంది. వేటగాళ్లు కెమెరాలను సైతం ధ్వంసం చేస్తున్నారు. బేస్‌క్యాంపు సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది కళ్లుగప్పి అడవుల్లోకి ప్రవేశిస్తున్నారు. గత ఏడాది హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి కొంతమంది కనకగిరి అడవుల్లో వన్యప్రాణులను వేటాడేందుకు రాగా అటవీశాఖ సిబ్బంది పట్టుకుని కేసు నమోదు చేశారు. మధిర రేంజి పరిధిలోని రిజర్వు ఫారెస్టులో సైతం వన్యప్రాణులను గతంలో వేటాడిన సందర్భాలున్నాయి.

**వేటాడితే కఠిన చర్యలు తప్పవు...**

వన్య ప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తప్పవు. గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది చట్టం గురించి తెలియదు. అడవుల సరిహద్దు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలను చైతన్యం చేస్తున్నాం. వేటగాళ్ల ఉచ్చులు, విద్యుత్తు తీగలతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారు. వేటగాళ్ల ఆచూకీ గుర్తిస్తే సమీపంలోని అటవీశాఖ అధికారులకు తెలియజేయాలి. అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రత్యేకంగా నిర్మించిన కుంటల్లో నింపుతాం.సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి, ఖమ్మం

# సైబర్ భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం



హైదరాబాద్ : నిమిషాల్లో ఖాళీ అవుతున్న బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేస్తూ.. కొత్త పద్ధతుల్లో మోసాలు చేస్తున్న సైబర్ నేరస్థుల ఆగడాలను నియంత్రించేందుకు విశ్వవిద్యాలయాలు సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాయి. వీటిని నియంత్రించేందుకు అవసరమైన నిపుణుల కొరతను అధిగమించేందుకు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎంటెక్ సైబర్ సెక్యూరిటీ కోర్సును.. జేఎన్‌టీయూ హైదరాబాద్ సైబర్ భద్రతపై ఇంజినీరింగ్‌లో నాలుగు సెమిస్టర్లను బోధిస్తున్నాయి.
ఒకటి, రెండేళ్లలో ఏకంగా 200శాతం సైబర్ నేరాలు పెరగడంతో ఇంజినీరింగ్ కోర్సులో సైబర్ భద్రత అంశాల్లో సిలబస్‌ను సమూలంగా మార్చాల్సిన పరిస్థితి. భవిష్యత్తులో ఇంజినీరింగ్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సు ప్రారంభించేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీల్లో సైబర్ భద్రతపై పాఠ్యాంశాలను బోధించాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు అనుగుణంగా విశ్వవిద్యాలయాలు, విద్యాశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధంచేస్తున్నారు.

**విస్తృతంగా ఉపాధి అవకాశాలు..**

విశ్వవ్యాప్తంగా ఐటీ సంస్థలు, పరిశ్రమలు, మార్కెట్ అవసరాలకు సైబర్ భద్రత అనివార్యం. నగదు లావాదేవీలు, సామాజిక మాధ్యమాల ఖాతాలకు రక్షణ లేక సైబర్ నేరస్థులు ఏటా రూ.వేల కోట్లను దోచుకుంటున్నారు. డెస్క్‌టాప్‌లు, ల్యాప్‌టాప్‌లలో ఈ-మెయిళ్లతో మాల్‌వేర్ ప్రవేశపెట్టి పరిశ్రమలు, కార్పొరేట్ ఆసుపత్రులు, ప్రభుత్వ రంగసంస్థలను బెదిరిస్తున్నారు. బ్యాంకుల సర్వర్లలోకి ప్రవేశించి రూ.కోట్లు కొల్లగొడుతున్నారు. ÿ సైబర్ నిపుణులుంటే ఈ నష్టాలను అరికట్టే అవకాశాలుంటాయి. ఓ సంస్థ సర్వే నిర్వహించగా.. దేశంలో 40లక్షల మంది నిపుణులకుగాను 3 లక్షలమందే ఉన్నట్లు గుర్తించింది. ఇంజినీరింగ్, ఎంటెక్ స్థాయిలో సైబర్ సెక్యూరిటీ డిగ్రీ, సమాచార నైపుణ్యాలుంటే వేలమందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

**మైనర్ డిగ్రీకి అవకాశం..**

ఇంజినీరింగ్ డిగ్రీ చదువుకుంటున్న విద్యార్థులకు సైబర్ భద్రతపై నాలుగు సెమిస్టర్లను జేఎన్‌టీయూ హైదరాబాద్ సిలబస్‌లో పొందుపరిచింది. క్యాంపస్‌తోపాటు విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో బీటెక్ విద్యార్థులు మూడు, నాలుగో సంవత్సరాల్లో సైబర్‌సెక్యూరిటీ సెమిస్టర్లు చదవాలి. వీటిలో ఉత్తీర్ణులైనవారికి 20 క్రెడిట్ పాయింట్లు ఇస్తున్నారు. ఇంజినీరింగ్ డిగ్రీతోపాటు వీరికి బీటెక్ కంప్యూటర్ సైన్స్ విత్ సైబర్ సెక్యూరిటీ అన్న మైనర్ డిగ్రీని ఇవ్వనున్నారు. ఇక ఇతర రాష్ట్రాల్లో బెంగళూరు ఐఐటీ ఆన్‌లైన్ కోర్సును ప్రవేశపెట్టింది. ఇప్పుడిప్పుడే ప్రైవేటు వర్సిటీలు కూడా సైబర్ భద్రతపై ప్రత్యేక కోర్సులు అందిస్తున్నాయి.

**డిగ్రీ స్థాయిలో అవగాహన కల్పించేందుకే**

బీఏ, బీకాం, బీఎస్సీ స్థాయిలో సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నాం. ప్రొటోకాల్ పేరుతో కొన్ని పాఠ్యాంశాలను ఇప్పటికే కొన్ని ఇంజినీరింగ్ కళాశాలల్లో విద్యార్థులకు బోధిస్తున్నారు. పాఠ్యాంశాల్లో ప్రాథమిక అంశాలు, సైబర్ నేరాలను ఎలా కట్టడి చేయాలన్న వాటిపై ఆచార్యులు బోధిస్తున్నారు. సైబర్ నేరాల నియంత్రణకు అవసరమైన ఆల్గారిథమ్స్, ప్రొటోకాల్స్, సాఫ్ట్‌వేర్ తయారీని విద్యార్థులకు నేర్పించనున్నారు. ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, ఇన్‌ఛార్జి వీసీ, జేఎన్‌టీయూ హైదరాబాద్

# ఆధునికత వైపు అడుగులు



సిరిసిల్ల: మహారాష్ట్రలోని ఇచ్చల్‌కరంజీ, తమిళనాడులోని తిరుపూరు, ఈరోడ్. గుజరాత్‌లోని సూరత్ టెక్స్‌టైల్ పరిశ్రమల నుంచి ఎగుమతి రకాలే ఉత్పత్తి అవుతాయి. ఏటా రూ.40 వేల కోట్ల విలువైన అంతర్జాతీయ వస్త్ర వ్యాపారం జరుగుతోంది. కాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఏటా 15 కోట్ల మీటర్లతో వ్యాపారం రూ.2 వేల కోట్లకు మించడం లేదు. అవికూడా జాతీయ మార్కెట్లకే పరిమితం. ఇందుకు గల కారణాలను పరిశీలిస్తే పురాతన కాలంనాటి మగ్గాలు.. వాటిపై పనిచేసే కార్మికుల్లో నైపుణ్యాల కొరతేనని తేటతెల్లమవుతోంది. టెక్స్‌టైల్ రంగంలో ఆధునికీకరణను ప్రోత్సహించేందుకు ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ)తో పాటు నాబార్డు నుంచి రుణాలకు అవకాశం ఉన్నా అవి ఇక్కడికి చేరడంలేదు. తాజాగా జిల్లా పరిశ్రమలో పురాతన వైపని, మగ్గాలు, ప్రాసెసింగ్ యూనిట్లలో ఆధునికతవైపు అడుగులు పడుతున్నాయి.

**పురాతన మరమగ్గాల స్థానంలో కొత్తవి...**

జిల్లా వస్త్రోత్పత్తులు సాధారణ.. ర్యాపియర్ మరమగ్గాలకే పరిమితం. వీటిలో జియోట్యాగ్ చేసినవి 20,302 మగ్గాలు. ఆరు నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఉత్పత్తులు కలిపి 1.50 కోట్ల మీటర్ల ఉత్పత్తి మాత్రమే జరిగింది. 2018లో బతుకమ్మ చీరల్లో జరీ అంచులు, డిజైన్లు రావడంతో కార్మికుల్లో నైపుణ్యాలు పెరిగాయి. దీంతో కొత్తరకం ఉత్పత్తుల వైపు మెగ్గుచూపుతున్నారు. 2023 బతుకమ్మ చీరల తర్వాత ప్రభుత్వ ఆర్డర్లు తగ్గాయి. పరిశ్రమ వర్గాలు ప్రైవేటు ఆర్డర్లవైపు దృష్టిసారించారు. మార్కెటింగ్ ఉన్న వస్త్రాలను సొంతంగా నేయడం ప్రారంభించారు. ఇందుకోసం తమిళనాడు, మహారాష్ట్ర ప్రాంతాల్లో పర్యటించి పరిశ్రమలపై అధ్యయనం చేశారు. జిల్లాలో ఒకటి, రెండు ఎలక్ట్రానిక్ జకార్డుల స్థానంలో ఇప్పుడు 20కి పైగా పెరిగాయి. వీటితోపాటు ప్రింటింగ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నారు.

**నాణ్యతే ముఖ్యం**

ఎలక్ట్రానిక్ జకార్డులపై సెమీపట్టు, సిల్కు వస్త్రాలను ఉత్పత్తి చేయవచ్చు. ఇప్పటికే కొన్ని యూనిట్లు ఉత్పత్తిని ప్రారంభించాయి. వీటిపై వస్త్రోత్పత్తుల్లో నాణ్యత రావాలంటే ఇప్పుడున్న వార్పిన్ యూనిట్లు పనిచేయవు. కర్ణాటకలోని బెల్గాం నుంచి టీఎఫ్ఓ (టూఫర్‌వన్) రెండు వార్పిన్ యూనిట్లను తెప్పించారు. రెండు అంతకన్నా ఎక్కువ నూలు పోగులను మెలితిప్పే పద్ధతిని డబ్లింగ్, ఫోల్డింగ్ ట్విస్టింగ్ అంటారు. సిరిసిల్ల పట్టణంతోపాటు టెక్స్‌టైల్ పార్కులో వీటిని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం ఎస్‌హెచ్‌జీ బృందాలకు పంపిణీచేసే చీరల ఆర్డర్లు జిల్లా వస్త్ర పరిశ్రమకు కేటాయించారు. మరమగ్గాలపై వస్త్రోత్పత్తుల వరకు ఫరవాలేదు. కానీ ఈ చీరలకు ఉపయోగించే నూలు, ప్రాసెసింగ్, ప్రింటింగ్ ఇక్కడి పరిశ్రమకు కొత్త. వీటిని పరిశ్రమవర్గాలు పూర్తిస్థాయిలో అందిపుచ్చుకుంటేనే ప్రభుత్వ ఆర్డర్లతోపాటు ప్రైవేటు ఉత్పత్తుల్లో మనుగడ సాధ్యం.

**ప్రోత్సాహం అందించాలి** జిల్లాలో 2018 నుంచి వస్త్రోత్పత్తుల్లో మార్పు ప్రారంభమైంది. అందుకు అనుగుణంగా మరమగ్గాలు అనుబంధరంగాల్లోనూ మార్పులు వస్తున్నాయి. నేను కొత్తగా పది జకార్డు మగ్గాలు, టీఎఫ్ఓ యూనిట్‌ను ఏర్పాటు చేశా. వీటిపై మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా వస్త్రోత్పత్తుల్లో మార్పులు తీసుకురావచ్చు. వీటిపై కార్మికులకు రోజుకు సగటున రూ.వెయ్యి కూలీ గిట్టుబాటు అవుతుంది. ఆధునికీకరణకు ముందుకొచ్చే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీలు అందించి ప్రోత్సహించాలి. వేముల దామోదర్, ఆసామి

# బోగీలు తగ్గించడమా? హాల్టింగులు పెంచడమా?

పెద్దపల్లి: సికింద్రాబాద్ - నాగ్‌పూర్‌ల మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఆక్యుపెన్సీ తక్కువగా ఉండడంతో బోగీల సంఖ్య తగ్గించాలా.. లేదా హాల్టింగ్‌లను పెంచాలా అనే అంశంపై రైల్వే అధికారులు సమాలోచనలు చేస్తున్నారు. ప్రస్తుతం ఈ రైలుకు కాజీపేట, రామగుండం, బల్హార్షా, చంద్రాపూర్‌లలో హాల్టింగ్‌లు కల్పించారు. భారీ ఆక్యుపెన్సీని ఊహించి అత్యధికంగా 20 బోగీలతో నడిపించారు కానీ.. పరిస్థితులు ప్రతికూలంగా మారిపోవడంతో సగానికి పైగా సీట్లు ఖాళీగానే ఉంటున్నాయి. గడిచిన అయిదు నెలల్లో కేవలం అక్టోబరులోనే అత్యధికంగా 49.82 శాతం ఆక్యుపెన్సీ సికింద్రాబాద్ నుంచి నాగ్‌పూర్ వైపు కలిగి ఉంది. అదే నాగ్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు గరిష్ఠంగా 40.69 శాతానికి మించలేదు. దీంతో రైల్వే అధికారులు సగం బోగీలను తగ్గించాలని భావిస్తున్నారు. అదే సమయంలో ప్రయాణికుల నుంచి హాల్టింగ్‌ల కోసం ఒత్తిళ్లు కూడా పెరగడంతో అధికారులు తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. నాగ్‌పూర్ డివిజన్ ఆధ్వర్యంలో నడిచే వందేభారత్ గతేడాది సెప్టెంబర్ 16న ప్రారంభమైంది. మహారాష్ట్రలోని సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్హార్షాల్లో హాల్టింగ్‌లిచ్చారు. వీటిలో చంద్రాపూర్, బల్హార్షాల మధ్య



దూరం కేవలం 14 కిలోమీటర్లే. మన రాష్ట్రంలో కాజీపేట, రామగుండంలలో హాల్టింగ్‌లిచ్చి నాగ్‌పూర్‌తో వ్యాపార సంబంధాలు కలిగిన పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లను విస్మరించడంతో ఆక్యుపెన్సీ గణనీయంగా తగ్గిపోయిందని పలువురు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ పరిస్థితుల్లో వందేభారత్ బోగీలను తగ్గించడమో.. రైలును రద్దు చేయడమో కాకుండా పెద్దపల్లి, మంచిర్యాల, కాగజ్‌నగర్‌లలోనూ హాల్టింగ్‌లు కల్పించాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యులు తదితరులు కోరుతున్నారు.

# అన్నివేళల్లో.. ఆన్‌లైన్ బుకింగ్

కొత్తగూడెం : రాష్ట్రంలో ఇసుక కొరతను తీర్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. '24 గంటలు ఆన్‌లైన్ ఇసుక బుకింగ్' సౌకర్యం అందుబాటులో ఉంచాలని నిర్ణయించింది. అక్రమ రవాణా అడ్డుకట్టకు బృందాలను నియమించాలని మైనింగ్, టీజీఎండీసీ (తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలోని చర్ల మండలంలో మూడు (మొగళ్లపల్లి, చింతకుంట, వీరాపురం) ఇసుక రీచ్‌లను టీజీఎండీసీ నిర్వహిస్తోంది.వివిధ ప్రాంతాలకు ఇక్కడి ఇసుకే సరఫరా అవుతోంది.

**గతంలో అలా.. ఇప్పుడిలా..**

గతంలో ప్రభుత్వ రీచ్‌లు, డంపింగ్‌యార్డుల్లోని ఇసుక నిల్వల వివరాలను రోజూ మధ్యాహ్నం 12 గంటలకు ఆన్‌లైన్‌లో ఉంచేవారు. 12 తర్వాతే ఇసుక బుకింగ్‌కు అవకాశమిచ్చేవారు. ఈ విధానాన్ని మార్చుతూ.. 24 గంటల ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఒక లారీ నంబర్‌పై ఒకసారి ఆన్‌లైన్ బుకింగ్ చేసుకుంటే.. ఆ వాహనం అన్‌లోడ్ అయ్యాకే మళ్లీ డీడీ చెల్లించే సదుపాయం ఉండేది. ప్రస్తుతం లారీ నంబర్‌పై మూడు డీడీలు చెల్లించే అవకాశమిస్తున్నారు. 15 రోజుల్లోపే ఇసుక తీసుకెళ్లాలనే నిబంధన ఉంది.




**అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తేనే..**

ఇసుక అక్రమ రవాణాకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్డాగా మారుతోంది. గోదావరి నదితో పాటు కిన్నెరసాని, ముర్రేడు వంటి నదుల నుంచి ఇసుక యథేచ్ఛగా తరలుతోంది. స్థానిక ట్రాక్టర్ యజమానులు మాఫియాగా ఏర్పడి.. నదుల్లోని ఇసుకను డంప్‌లకు చేరవేస్తున్నారు. అక్కడ్నుంచి టిప్పర్ల ద్వారా వివిధ ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు కిమ్మనకుండా ఉండటంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ప్రస్తుతం గిరిజన సంఘాల ద్వారా కేవలం మూడు రీచ్‌లే నిర్వహిస్తున్నారు. మరోవైపు వేసవి కాలంలో భవన నిర్మాణాలు ఊపందుకోవడంతో ఇసుకకు స్థానికంగా డిమాండ్ పెరుగుతోంది. ఇదే అదునుగా అక్రమ రవాణాకు పలువురు తెరలేపుతున్నారు. దీనివల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. జిల్లాలో కొత్తగా పది రీచ్‌లు ఏర్పాటు చేస్తామన్న నిర్ణయం కార్యరూపం దాల్చితేనే ప్రయోజనం ఉంటుంది.
ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇసుక తగినంత అందుబాటులోకి వస్తుంది. సర్కారుకూ ఆదాయం పెరుగుతుంది. రీచ్‌ల్లో అక్రమ దందాకు ఆస్కారం లేకుండా రెవెన్యూ, పోలీసు, టీజీఎండీసీ అధికారులతో ప్రత్యేక బృందాలను నియమించాం. శంకర్‌నాయక్, టీజీఎండీసీ పీఓ, భద్రాద్రి కొత్తగూడెం

# ప్రాజెక్టుల భద్రతకు ప్రత్యేక కమిటీలు

ఆదిలాబాద్ : సాగునీటి ప్రాజెక్టుల పర్యవేక్షణ, భద్రత, నిర్వహణ తదితర వాటితో పాటు ఆనకట్టలకు సంబంధించిన పూర్తి బాధ్యతలు నిర్వహించేందుకు ప్రాజెక్టుల వారీగా డ్యామ్ మేనేజర్లను నియమిస్తున్నారు. జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షక సంస్థ(ఎన్డీఎస్ఎ) గుర్తించిన ప్రాజెక్టులకు సంబంధించిన అధికారులే డ్యామ్ మేనేజరుగా వ్యవహరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ప్రాజెక్టుల వారీగా ఆయా విభాగాల ఇంజినీరింగ్ సిబ్బందితో ఆనకట్టల భద్రత కమిటీల ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.
జిల్లాల వారీగా అనేక ప్రాజెక్టులున్నా.. వాటి నిర్వహణకు నిధులు రాకపోవడం, అధికారులు పట్టించుకోకపోవడంతో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆనకట్టలను పర్యవేక్షించడంతో పాటు వాటి భద్రతకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేసుకోవాలని ఇందుకు సంబంధిత అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, ప్రాజెక్టు ఆయకట్టు, నీటి నిల్వ, ఆనకట్ట ఎత్తును బట్టి అధికారులను డ్యామ్ మేనేజర్లను నియమించాలని కేంద్రం ఆదేశించింది. గేట్లు ఉండి ఎక్కువ ఆయకట్టు ఉండే ప్రాజెక్టులకు సీఈలు, తర్వాత ప్రాజెక్టుల స్థాయిని బట్టి ఎస్ఈ, ఈఈలను డ్యామ్ మేనేజర్‌గా నియమించి కమిటీలో ఇతర అధికారులను చేర్చాల్సి ఉంటుంది. ఆయకట్టు ఎక్కువగా ఉండే కడెం ప్రాజెక్టుకు సీఈ స్థాయి అధికారితో పాటు ఎలక్ట్రికల్,



మెకానికల్, సివిల్ ఇంజినీర్లు, సహాయకులు, కమిటీలో ఉంటారు.

**వీరికే బాధ్యత..**

ఉమ్మడి ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలో తొమ్మిది ఆనకట్టలకు, మంచిర్యాల కుమురం భీం జిల్లాల్లో ఎనిమిది ప్రాజెక్టులకు డ్యామ్ మేనేజర్లుగా అధికారులను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గేట్లు ఉండే ప్రాజెక్టుల్లో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీర్లు ఉండేలా చూడాలని ఆదేశాలు ఉన్నాయి. గతంలో కడెం ప్రాజెక్టుతో పాటు ఇతర ప్రాజెక్టుల్లో గేట్ల సమస్య ఏర్పడింది. కొన్ని ప్రాజెక్టుల్లో ఎలక్ట్రికల్ సమస్య ఏర్పడటంతో ఇటీవల సంబంధిత ఇంజినీర్లను నియమించారు. తాజాగా డ్యామ్ మేనేజర్ల పేరిట కమిటీలు వేసి ప్రాజెక్టుల బాధ్యతను సంబంధించిన కమిటీలకే అప్పజెప్పనున్నారు. జిల్లాలో ఉన్న ప్రాజెక్టులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రస్తుతం వేసిన కమిటీలు వాటిని పరిశీలించి అవసరమైన మరమ్మతులకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది.

# పాతవని పడేయకండి.. అమ్మేద్దాం

హైదరాబాద్: ప్రస్తుత డిజిటల్ కాలంలో చరవాణి మనిషికి మరో అవయవంగా మారింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దానితోనే కాలక్షేపం. ఆఫీస్ అవసరాలు, పాఠశాల, కళాశాలకు సంబంధించిన నోట్స్ కూడా అందులోనే లభ్యమవుతున్నాయి. దీంతో ఇంట్లో ఎంతమంది ఉంటే అందరికీ చరవాణి తప్పనిసరి అయింది. వాటితో పాటు ల్యాప్‌టాప్‌లు, టీవీలు, కెమెరాలు, ప్రింటర్లు ఇలా ఎన్నో రకాల ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లను నిత్య జీవితంలో వినియోగిస్తున్నాం. ఏ పని కావాలన్నా ఎలక్ట్రానిక్ వస్తువులపైన ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. కొన్ని రోజులు ఎలక్ట్రానిక్ వస్తువులు పాడవడం, కొత్త వర్షన్ అందుబాటులోకి రావడంతో వాటిని ఇంట్లో ఓ మూలన పడేస్తున్నారు.

**పనిచేయని గ్యాడ్జెట్లని అమ్మేయవచ్చు**

పనిచేయని పాత సెల్‌ఫోన్లు, టీవీలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులతోనూ



డబ్బు సంపాదించొచ్చు. ప్రస్తుతం ఈ-వేస్ట్‌ని కొనుగోలు చేసే పలు సంస్థలున్నాయి. వస్తువుకు సంబంధించిన పూర్తి సమాచారం, ఇంటి చిరునామా ఇస్తే వాళ్లే ఇంటికి వచ్చి మరీ కొనుగోలు చేస్తారు. ఆ వస్తువు స్థితిని బట్టి డబ్బు చెల్లిస్తారు.

**వాటితో వాళ్లేం చేస్తారంటే..**

ఆయా ఎలక్ట్రానిక్ వస్తువులు పనిచేయకపోయినా అందులోని భాగాలను రీసైకిల్ చేసుకోవచ్చు. అవి కొత్త వస్తువుల తయారీకి ఉపయోగిస్తారు. ఇతర ప్లాస్టిక్, మెటల్ పరికరాలను రీసైకిల్ చేస్తారు.

**సేకరించని ఈ-వేస్ట్ 57 శాతం..**

దేశంలో 2023-24లో సుమారు 57 శాతం ఈ-వేస్ట్ సేకరించలేదని ఓ సర్వేలో తేలింది. ఇది 9.9 లక్షలమెట్రిక్ టన్నులతో సమానం. వాటిని సేకరించని కారణంగా రీసైక్లింగ్‌కి అవకాశం లేకుండా పోయింది. దీంతో కొత్త ఎలక్ట్రానిక్ వస్తువుల కొరత ఏర్పడుతోంది.

**మచ్చుకు కొన్ని వెబ్‌సైట్లు..**

ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్ సంస్థలు అనేకం ఉన్నాయి. అందులో ఎన్విరోకేర్, క్యాషిఫై, జోలోపిక్, ఐటీపికప్, రీసెల్‌ఫోన్. వెబ్‌సైట్‌లోకి వెళ్లి అమ్మేయాలనుకుంటున్న వస్తువు వివరాలను, చిరునామాని ఎంటర్ చేయాలి. వాళ్లకు రిక్వెస్ట్ వెళ్లగానే మనల్ని సంప్రదిస్తారు.

# బెట్టింగ్ వల.. యువత విలవిల

కరీంనగర్ : కష్టపడకుండా సులభంగా సంపాదించాలనే తాపత్రయంతో యువత ఆన్‌లైన్ రమ్మీ.. క్యాసినో.. రౌలట్ ఆటలకు అలవాటవుతున్నారు. నిర్వాహకులు మొదట చిన్న మొత్తంలో డబ్బుల ఆశ చూపి నెమ్మదిగా పెట్టుబడులు పెట్టేలా ఆకర్షిస్తున్నారు. ఉన్నదంతా కోల్పోవడంతో.. అప్పులు చేసి మరీ పెట్టుబడి పెడుతున్నారు. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్ముతుండగా మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 20 నుంచి 35 ఏళ్లలోపు వారే ఉండటం కలవరపెడుతోంది.

**సరదాగా ఆడి.. వ్యసనంగా మారి..**

ఉమ్మడి జిల్లాలోని టీనేజర్లలో సుమారు 70 శాతం మంది స్మార్ట్‌ఫోన్లు వినియోగిస్తున్నారు. వీరిలో 40 శాతానికి పైగా ఆన్‌లైన్ లావాదేవీలు నిర్వహిస్తున్నారు. మొదట సరదా ఆటలు.. వ్యసనంగా మారుతున్నాయి. స్నేహితులు, బంధువులు, సహోద్యోగుల నుంచి ఇలా అందినకాడికి డబ్బులు తెచ్చుకొని జూదంలో నష్టపోతున్నారు. మరికొందరు రుణ యాప్‌ల్లో అప్పులు తీసుకొని ఆన్‌లైన్ మోసాల్లో చిక్కుకుంటున్నారు.

**ఎక్కడిదో లింకు.. ఇక్కడ ఆటలు..**

ఆన్‌లైన్ జూదంపై తెలంగాణ ప్రభుత్వం నిషేధం విధించింది. పేకాట, జూదం బయట కాదు.. ఆన్‌లైన్‌లో ఆడినా నేరమే.. అయినా ఆన్‌లైన్ జూదం నడిపించేందుకు ఐపీ (ఇంటర్నెట్ ప్రొటోకాల్) అడ్రస్‌ను తారుమారు చేస్తూ ఎక్కడో ఉన్న లింకుతో ఇక్కడా ఆడేస్తున్నారు. ఐపీ అడ్రస్ వేరే రాష్ట్రంలో ఉన్నట్లు కనిపించేలా చేస్తారు.

**అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు..**

రాష్ట్రంలో ఆన్‌లైన్ జూదం నిర్వహించినా, ఆడినా తెలిసేలా ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ రూపొందిస్తోంది. నీ బెట్టింగ్ యాప్స్, వెబ్‌సైట్లను ప్రమోట్ చేసే సామాజిక మాధ్యమాలపై నిఘా పెడుతోంది. నీ ఆన్‌లైన్ బెట్టింగ్ నియంత్రణకు ప్రకటనలు, హెచ్చరికలు జారీ చేస్తోంది.



శంకరపట్నం మండలం ఇప్పలపల్లికి చెందిన మధు(35) అనే యువకుడు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడి రూ.లక్షలు పోగొట్టుకొని వారం రోజుల కిందట పురుగుల మందు తాగాడు. ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలం గద్దపాకకు చెందిన కార్తిక్ (25) ఆన్‌లైన్ రమ్మీ ఆడి సుమారు రూ.5 లక్షలకు పైగా నష్టపోయి మనస్తాపంతో పురుగుల మందు తాగి జనవరి 30న చికిత్స పొందుతూ మృతి చెందాడు. కరీంనగర్‌కు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆన్‌లైన్ జూదానికి బానిసయ్యాడు. అప్పులు తెచ్చి, క్రెడిట్ కార్డు డబ్బులతో ఆన్‌లైన్‌లో ఆటలు ఆడి సుమారు రూ.70 లక్షలు నష్టపోయాడు. విషయం కుటుంబ సభ్యులకు తెలిసి ధైర్యం చెప్పారు. అప్పులు కట్టేందుకు ఆస్తులను అమ్మాల్సి వచ్చింది.

గుర్తించండి.. రక్షించండి.. ఆన్‌లైన్ జూదానికి అలవాటుపడిన వారు ఒంటరిగా ఫోన్‌లోనే గడుపుతుంటారు. పిల్లల బ్యాంకు ఖాతాలను తల్లిదండ్రులు తరచూ తనిఖీ చేయాలి. అనుమానాస్పదంగా డబ్బులు వచ్చినా, పోయినా బ్యాంకుకు వెళ్లి ఖాతాను బ్లాక్ చేయించాలి.

స్నేహితులు, సహోద్యోగులను ఎక్కువసార్లు డబ్బులు అడిగితే సమాచారం ఇవ్వాలని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కోరాలి.

నష్టపోయిన వారిని కోపగించడం, సూటిపోటి మాటలు అనకుండా భవిష్యత్తు గురించి ధైర్యం చెప్పాలి.

# కొలువుల వేట.. నైపుణ్యాలకే పెద్దపీట



హైదరాబాద్ : నైపుణ్యాలు కలిగిన మానవ వనరుల కేంద్రంగా హైదరాబాద్ నగరానికి ఎంతోకాలంగా గుర్తింపు ఉంది. రెండు దశాబ్దాలుగా ఐటీని అందిపుచ్చుకుని పది లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు. ఒకప్పుడు దశాబ్దాలపాటు నిలకడగా ఉన్న సాంకేతికతలు.. ఇప్పుడు వేగంగా మారుతున్నాయి. అందుకు తగ్గట్టుగా నైపుణ్యాలు పెంచుకోవడంలో యువత కొంత వెనకబడుతోంది. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్(హైసియా), కేపీఎంజీతో కలిసి ఇటీవల విడుదల చేసిన నివేదిక ఇదే స్పష్టం చేస్తోంది. నూతన నైపుణ్యాల అవసరం పెరుగుతోందని సంస్థలు చెబుతున్నాయి. క్లౌడ్ కంప్యూటింగ్, ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్ పరంగా మెరుగ్గా ఉన్నారు. ఏఐ/ఎంఎల్, అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్ నైపుణ్యాలు ఉన్నవారికి డిమాండ్ పెరుగుతోంది. వీరికి మధ్య, సీనియర్ లెవెల్స్‌లో అవకాశాలు వేగంగా లభిస్తున్నాయి. తక్కువ, ఒక మోస్తరు నైపుణ్యాలకే పరిమితమైన వారు 74 శాతం ఉన్నారు. ప్రాబ్లం సాల్వింగ్, అడ్వాన్స్‌డ్ అనలిటికల్‌పరంగా మెరుగుపడాల్సి ఉంది. అధిక నైపుణ్యాలు కలిగినవారు 50 శాతం కంటే తక్కువే. బిజినెస్ లీడర్లు వెల్లడించిన అభిప్రాయాల ప్రకారం.. క్లౌడ్ కంప్యూటింగ్, మిషన్ లెర్నింగ్ నైపుణ్యాలకు డిమాండ్ ఎక్కువ. అత్యధికంగా 62 శాతంతో రెగ్యులర్ టెక్ స్కిల్స్‌కు గిరాకీ ఉంది. విద్యాసంస్థలు, కార్పొరేట్ సంస్థలు, ప్రభుత్వం సంయుక్తంగా ఉద్యోగార్థుల్లో నైపుణ్యాల పెంపునకు శిక్షణ ఇస్తున్నాయి. ప్రత్యేకించి ఏఐ, ఎంఎల్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీపై దృష్టిపెట్టాయి. అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే కొత్తగా సాంకేతికతలపై పట్టు అవసరమని సూచిస్తున్నారు.

మొదటి ఉత్తమ 10 నైపుణ్యాలు ఏవంటే?

డేటా సైన్స్
ప్రొడక్ట్ డెవలప్‌మెంట్
క్లౌడ్ డెవలప్‌మెంట్
అప్లికేషన్ డెవలప్‌మెంట్
ఆటోమేషన్ ఆర్కిటెక్చర్
ఏఐ/ఎంఎల్ లెర్నింగ్
డేటా అనలిటిక్స్ అండ్ రిపోర్టింగ్
బిజినెస్ ఇంటలిజెన్స్
సొల్యూషన్ ఆర్కిటెక్చర్

కొత్తగా ఉద్భవిస్తున్న రంగాలు

కృత్రిమమేధ(ఏఐ)/ మిషన్ లెర్నింగ్ (ఎంఎల్)
సొల్యూషన్ ఆర్కిటెక్చర్
క్లౌడ్ డెవలప్‌మెంట్
బిజినెస్ ఇంటలిజెన్స్ (బీఐ)
డేటా సైన్స్
జెనరేటివ్ ఏఐ

# ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్.. సోలార్ స్మార్ట్ బిన్



హైదరాబాద్: ఇంజినీరింగ్ విద్యార్థులంటే కంప్యూటర్లు.. ల్యాప్‌టాప్‌లతో కసరత్తులు... కృత్రిమమేధ సాయంతో ప్రణాళికలు మాత్రమే కాదు.. దైనందిన జీవితాల్లో ఉపయోగపడే పరికరాలు.. వస్తువులను కొత్తగా రూపొందించడమని నిరూపిస్తున్నారు. ఇంజినీరింగ్ కళాశాలల్లో వారి ప్రతిభను ప్రదర్శిస్తున్నారు. తేజస్-2025 పేరుతో అనురాగ్ యూనివర్సిటీలో జరిగిన ఇంజినీరింగ్ కళాశాలల సదస్సులో వివిధ కళాశాలలకు చెందిన 600 మంది మంది విద్యార్థులు, 30 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పార్కింగ్ సమస్యకు పరిష్కారానికి 'స్మార్ట్ పార్కింగ్ సిస్టమ్', రిఫ్రిజిరేటర్‌లో పండ్లు, కూరగాయల వివరాలను ఫోన్‌లో తెలిపే స్మార్ట్ ఫ్రిజ్ యాప్.. స్మార్ట్ డస్ట్‌బిన్.. ప్లాస్టిక్ వ్యర్థాలతో టైల్స్ వంటివి ఆకట్టుకున్నాయి. వీటితోపాటు 7 ఆవిష్కరణలకు పేటెంట్‌కు దరఖాస్తు చేసుకున్నారు.


**సోలార్ స్మార్ట్‌బిన్ పనిచేస్తుందిలా..**

పాతబస్తీ నుంచి హైటెక్ సిటీ వరకూ ఏర్పాటు చేసిన చెత్తకుండీలు (స్మార్ట్ బిన్‌లు) నిండిపోతుంటే వాటిని సకాలంలో ఖాళీ చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటికి పరిష్కారంగా అనురాగ్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాస రావు నేతృత్వంలో ఎనిమిదిమంది పరిశోధక విద్యార్థులు సోలార్ స్మార్ట్‌బిన్‌ను తయారు చేశారు. సౌరవిద్యుత్తుతో పనిచేసే ఈ చెత్తకుండీలో 80 శాతం చెత్త నిండితే అధికారులు, సిబ్బంది చరవాణులకు సంక్షిప్త సందేశాలు పంపుతుంది. ఇంతేకాదు.. ఒక ప్రాంతంలోని స్మార్ట్‌బిన్లలో ఎన్ని నిండుతున్నాయో చెప్పడంతో పాటు చెత్తను తీసుకెళ్లే వాహనాలు ఎలా తీసుకెళ్లాలో గూగుల్ మ్యాప్ ద్వారా వివరిస్తుంది. ప్రయోగాత్మకంగా ఉప్పల్-హబ్సిగూడ ప్రాంతాల్లో ఈ స్మార్ట్‌బిన్‌ల పనితీరును పరిశీలించామని అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. తయారీకి రూ.8 వేలు ఖర్చయిందని వివరించారు. వర్షాలు కురిసి ఎండ కాయకపోయినా స్మార్ట్‌బిన్ పనిచేస్తుందన్నారు. తమ క్యాంపస్, ఐటీ కారిడార్‌లో కొన్ని సాఫ్ట్‌వేర్ సంస్థల్లో తాము తయారు చేసిన స్మార్ట్‌బిన్‌లను ఉపయోగిస్తున్నామని వివరించారు.

**ప్లాస్టిక్ సీసాలు..కొబ్బరిపీచుతో టైల్స్..**

వాడిన ప్లాస్టిక్ వస్తువులు, సీసాలను ఎక్కడ పడితే అక్కడ పారేస్తే పర్యావరణానికి ప్రమాదం. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను టైల్స్, ప్యానల్స్‌గా మార్చితే.. ఇలా మెకానికల్ విభాగంలోని 8 మంది విద్యార్థులు ఆలోచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతిభ ఆధ్వర్యంలో పరిశోధనలు ప్రారంభించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, కొబ్బరిపీచు, లౌజును కొనుగోలు చేశారు. వాటిసాయంతో 3 రకాల టైల్స్‌ను తయారు చేశారు. పార్కులు, రహదారులకు అటూఇటూ ఉన్న ఫుట్‌పాత్‌లు, ఇళ్లు, బాత్‌రూమ్‌ల్లో టైల్స్, కార్యాలయాల్లో డోర్ ప్యానళ్లను రూపొందించారు. పార్కులు, ఫుట్‌పాత్‌లకు వినియోగించే టైల్స్‌ను తయారు చేసి కొన్నిచోట్ల వాటిని ఏర్పాటు చేశారు. నడిచినా, ద్విచక్రవాహనాలు వెళ్లినా తట్టుకున్నాయని ప్రొఫెసర్ ప్రతిభ తెలిపారు.

# రయ్ రయ్.. హాయ్ హాయ్




హైదరాబాద్: వాహన రద్దీని కట్టడి చేసే పైవంతెనలు.. ఆటపాటలకూ నెలవు కాబోతున్నాయి. అందుకు ఎక్కువ వెడల్పు ఉన్న పైవంతెనలను జీహెచ్ఎంసీ ఎంపిక చేస్తోంది. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఇప్పటికే షేక్‌పేట పైవంతెనను క్రీడా మైదానంలా మార్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామంటున్నారు. అదే మాదిరి.. మిగిలిన ప్రాంతాల్లోని పైవంతెనలను కూడా ఉభయతారకంగా తీర్చిదిద్దాలని జీహెచ్ఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది.

**సీఎం రేవంత్‌రెడ్డి సూచనతో..**

పేద, మధ్య తరగతి ప్రజలు నివాసముండే కాలనీలకు పార్కులు, ఆట స్థలాల కొరత ఉంది. ఈ లోటును కొంత వరకైనా భర్తీ చేసేందుకు.. పైవంతెనల కింద ఉండే స్థలాన్ని ఉపయోగించుకోవాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జీహెచ్ఎంసీకి సూచించారు. ఆ మేరకు కమిషనర్ ఇలంబర్తి గ్రేటర్‌లోని ఆరుగురు జోనల్ కమిషనర్లకు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టాలని ఆదేశాలిచ్చారు.

షేక్‌పేట పైవంతెన 2.5కి.మీ పొడవు, 24మీటర్ల వెడల్పుతో నిర్మాణమైంది. 24 మీటర్ల వెడల్పుతో పైవంతెన కిందనున్న రోడ్డు మార్గాన్ని అనేక రకాలు సద్వినియోగం చేసుకోవచ్చని క్షేత్రస్థాయి పరిశీలనలో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి ఓ నిర్ణయానికి వచ్చారు. అయితే.. అప్పటికే ఆ ప్రాంతంలో పిల్లలు ఆడుకుంటున్నారని, వారిని పలకరించగా.. ఇక్కడికి రోజూ వచ్చి ఆడుకుని వెళుతుంటామని ఆయనకు బదులిచ్చారు. సీఎం ఆదేశాల ప్రకారం.. ఇంజినీరింగ్ విభాగానికి డిజైన్లు రూపొందించాలని ఆదేశాలిచ్చారు.

**త్వరలో ఇతర ఫ్లైఓవర్ల కింద..**

ఆరాంఘర్-జూపార్కు పైవంతెన, జేఎన్‌టీయూ నుంచి మలేషియన్ టౌన్‌షిప్ పైవంతెన, కొత్తగూడ కూడలి పైవంతెన, లాలాపేట, నాగోల్, కామినేని కూడళ్ల పైవంతెనలు ఎక్కువ వెడల్పుతో ఉన్నాయి. వాటి కింద క్రీడా వసతులు కల్పించేందుకు పరిశీలిస్తున్నామని జీహెచ్ఎంసీ చెబుతోంది.

**ఒకటో పిల్లర్ల మధ్య సౌకర్యాలు ఇలా..**

ఒకటో పిల్లరు నుంచి రెండో పిల్లరు మధ్య మొక్కలు, వాటి చుట్టూ కుర్చీలు, నడక మార్గం

రెండు, మూడో పిల్లర్ల మధ్య కార్లు, ద్విచక్ర వాహనాలకు పార్కింగ్ వసతి. మూడు, నాలుగో పిల్లర్ల మధ్య యోగా కేంద్రం, పిల్లల పార్కు, ఓపెన్ జిమ్.

నాలుగు, ఐదో పిల్లర్ల మధ్య స్కేటింగ్ రింగ్.

ఐదు, ఆరో పిల్లర్ల మధ్య బ్యాడ్మింటన్ కోర్టు, సీటింగ్ ఏరియా

ఆరు, ఏడో పిల్లర్ల మధ్య బాక్స్ క్రికెట్.

ఏడు, ఎనిమిదో పిల్లర్ల మధ్య మొక్కలు, కుర్చీలు.

ఒకటో పిల్లరు నుంచి ఎనిమిదో పిల్లరును కలుపుతూ అంచుల్లో నడక దారి, సైకిల్ ట్రాక్ .

మొత్తం ఏర్పాటుకు రోడ్డుపై ప్రయాణించే వాహనాలతో ఇబ్బంది కలగకుండా దళసరి జాలితో రక్షణ.

# పాతవి అపరిష్కృతం.. కొత్త దరఖాస్తులెలా!

హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన ఒకరు నాలుగేళ్ల క్రితం తన కుమారుడి పేరు రేషన్‌కార్డులో చేర్చాలని మీ-సేవలో దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం తన రెండో కుమారుడి వివరాల నమోదుకు మీ-సేవ కేంద్రానికి వెళ్లగా.. పాతది పెండింగ్‌లో ఉన్నందున దరఖాస్తు తీసుకోవడంలేదు. తాజాగా ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులతోపాటు పాతవాటిలో కుటుంబసభ్యుల పేర్ల నమోదుకు మీ-సేవలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. కానీ ఈ దరఖాస్తులను ఆమోదించేందుకు ఇటు తహసీల్దార్, అటు జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో)కి లాగిన్ అవకాశం కల్పించకపోవడంతో సభ్యుల నమోదుకు అవకాశం లేకుండా పోయింది.

**9,663 మందికి మాత్రమే..**

పాత దరఖాస్తులను పరిశీలించకుండానే కొత్తవాటిని స్వీకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో 2016 తర్వాత కుటుంబ సభ్యుల వివరాల నమోదుకు చేసుకున్న దరఖాస్తులే పెండింగ్‌లో ఉండటంతో.. తాజాగా అదనపు సభ్యులకు సంబంధించి మీ-సేవ కేంద్రాలకు వెళితే దరఖాస్తు తీసుకోవడం లేదు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో



వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ప్రతి మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసి రేషన్‌కార్డులు జారీ చేసిన విషయం తెలిసిందే. వీటిని ఆమోదించేందుకు ఈ నెల మొదటివారంలో తహసీల్దార్‌లు, డీఎస్‌వోలకు లాగిన్ అవకాశమివ్వడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,608 మందికి కొత్త రేషన్‌కార్డులు జారీచేసి.. వాటిలో 9,663 మంది పేర్లను నమోదు చేశారు. ఆ తర్వాత లాగిన్‌కు అవకాశమివ్వలేదు.

**ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే..**

ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం 9,78,921 రేషన్‌కార్డులుండగా.. 28,16,436 మంది సభ్యులున్నారు. తమ పిల్లల పేర్లను రేషన్‌కార్డులో నమోదుకు మీ-సేవ కేంద్రాల్లో 1.78 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉంటున్నాయి. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా రేషన్‌కార్డులు జారీ చేసింది. పాత కార్డుల్లో అదనంగా కుటుంబ సభ్యుల పేర్లను చివరిసారిగా 2016లో చేర్చారు. ఆ తర్వాత మీ-సేవ ద్వారా దరఖాస్తుల్ని స్వీకరించినప్పటికీ.. గత ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో చేరని కుటుంబ సభ్యులకు రేషన్, ఆరోగ్యశ్రీ వర్తించడం లేదు.

**1,01,103 దరఖాస్తులు**

ఉమ్మడి జిల్లాలో 704 మీ-సేవ కేంద్రాలున్నాయి. గత నెలలో నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో కొత్త రేషన్‌కార్డుల కోసం 1,01,103 దరఖాస్తులు వచ్చాయి. వీటిని ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో పరిశీలించకపోగా.. ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన నేటికి జారీ కాలేదు. దీనిపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింగరావును సంప్రదించగా.. పాత రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చేందుకు ప్రభుత్వం ఇంకా తమకు లాగిన్ అవకాశం కల్పించలేదన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే నూతన సభ్యుల పేర్లను చేర్చుతామన్నారు.

# సాగు లెక్క.. ఇక పక్కా

కరీంనగర్ మంకమ్మతోట: పంటల సాగు నమోదును మరింత కచ్చితంగా లెక్కించేందుకు జిల్లా వ్యాప్తంగా డిజిటల్ పంటల సర్వే ప్రారంభమైంది. ముందుగా జిల్లాలోని 76 వ్యవసాయ క్లస్టర్లలోని 98 గ్రామాల్లో రెండు వేల ఎకరాల సాగు వివరాల నమోదుకు వ్యవసాయాధికారులు కృషి చేస్తున్నారు. ఈ నెల మొదటి వారంలో డిజిటల్ సర్వేను ప్రారంభించారు. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యతో వివరాల నమోదు నత్తనడకన సాగుతోంది.

**ప్రయోజనాలు..**

సర్వే వివరాలు అన్నింటికీ ప్రయోజనకరంగా మారనున్నాయి. ఒకసారి సాగైన పంట ఆధారంగా తదుపరి సీజన్‌లో విత్తనాలు, ఎరువులు, పంట రుణాల విషయంలో ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశముంది. ఏ పంట ఎంత సాగైంది, దిగుబడులు, కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండి, అవసరమైన ముందస్తు చర్యలకు మార్గం సుగమం అవుతుంది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయినప్పుడు పరిహారం అందించేందుకు వివరాలు దోహదపడతాయి. కేంద్ర ప్రభుత్వం తప్పనిసరిగా డిజిటల్ క్రాప్ సర్వేను అమలు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఇంతకు ముందు వరకు మన రాష్ట్రంలో ఉన్న యాప్‌నకు, కొత్తగా చేపడుతున్న డిజిటల్ సర్వేకు పెద్దగా మార్పులు లేవు. డిజిటల్ సర్వేలో క్షేత్రస్థాయికి వెళ్లి పంటల నమోదుతోపాటు కొత్తగా పంట రకం, రైతు ఫొటో సైతం తీసి సబ్మిట్ కొట్టాల్సి ఉంటుంది. యాసంగిలో సుమారు 2.7 లక్షల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా. సుమారు రెండు లక్షల ఎకరాల్లో డిజిటల్ సర్వే చేయాలని నిర్ణయించారు. 76 క్లస్టర్లకు 76 మంది ఏఈవోలకు బదులుగా 66 మంది విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 10 చోట్ల ఖాళీలున్నాయి. ఇప్పటి వరకు 7 వేల ఎకరాల్లో మాత్రమే పంటల నమోదు పూర్తయింది.

**క్షేత్రస్థాయిలో ఇబ్బందులు..**

పలు గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతోపాటు సమయానికి సంబంధిత రైతులు అందుబాటులో ఉండడం లేదంటున్నారు. ఈ సర్వే కొరకు ప్రత్యేకంగా ట్యాబ్‌లు ఇవ్వకపోడంతో ఏఈవోలు సొంత చరవాణుల్లో సర్వే పనులు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయంటున్నారు. మోకాపై ఉన్న భూమికి ఆన్‌లైన్ మ్యాపింగ్‌కు తేడాలుండటంతో వివరాలు నమోదుల్లో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

**సమగ్రతకు ప్రయత్నాలు**

నిర్దేశిత ఎకరాల్లో డిజిటల్ సర్వే పూర్తికి ఏఈవోలు కృషి చేస్తున్నారు. నాతోపాటు డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారులు సర్వే తీరును పర్యవేక్షిస్తున్నాం. సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులకు వివరించి, అధిగమించడానికి కృషి చేస్తున్నాం. డిజిటల్ సర్వే విధానంలో నమోదు కానీ పంటల వివరాలను క్రాప్ బుకింగ్ విధానంలో నమోదు చేస్తాం. భాగ్యలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారిణి

# స్థానికంగా రిజిస్ట్రేషన్లు.. తప్పిన ఇబ్బందులు

రామగుండం: రామగుండం నియోజకవర్గంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ భవన ఏర్పాటుతో ప్రజలకు ఉపశమనం లభించింది. ఇదివరకు పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఈ కార్యాలయం ఉండగా.. నియోజకవర్గంలోని ప్రజలు దూర ప్రయాణంతో ఇబ్బందులు పడేవారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలోనే నూతన రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు శ్రీకారం చుట్టడంతో.. ప్రజలకు మరింత చేరువలో సదుపాయాలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఎంపీడీవో కార్యాలయంలో రూ.10 లక్షల వ్యయంతో నూతన హంగులతో రిజిస్ట్రార్ కార్యాలయానికి సన్నాహాలు చేయగా అక్టోబరులో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రారంభించారు.



**అందుబాటులో సేవలు - బాలకిషన్, సబ్‌రిజిస్ట్రార్**

నియోజకవర్గంలో రిజిస్ట్రేషన్లపై ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నా. ఇటీవల మంచిర్యాల జిల్లా పరిధిలో పనిచేసిన అనుభవముంది. నూతనంగా బాధ్యతలు స్వీకరించినంతరం మూడు నెలల వ్యవధిలో రూ.3 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి చేకూరింది. స్థానిక ప్రజలకు మరింత సేవలు అందజేసి ఆదాయం పెంచే దిశగా ప్రయత్నిస్తా.

**కల సాకారం- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్**

దూర ప్రాంతాన్ని తగ్గించి ప్రజలకు సేవలందించే దిశగా ఏళ్ల కల సాకారం చేసినందుకు సంతోషంగా ఉంది. రామగుండంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించారు. మూడు నెలల వ్యవధిలో సుమారు 600లకు పైగా రిజిస్ట్రేషన్లు కాగా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుతుంది.

# సుందరీకరణ.. సందర్శకులకు ఆహ్లాదం

వేములవాడ: ఆధ్యాత్మిక క్షేత్రమైన వేములవాడ పట్టణ ప్రజలకు, రాజన్న భక్తులకు ఆహ్లాదం పంచేందుకు చేపడుతున్న గుడి చెరువు కట్టపై సుందరీకరణ పనులు ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. రానున్న మహా శివరాత్రి జాతరకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మేజర్ పనులు పూర్తయ్యాయి. రాజన్న ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వస్తుంటారు. వీరితోపాటు స్థానికులు ఆహ్లాదంగా గడిపేందుకు రూ.12 కోట్లతో గుడిచెరువు కట్టపై కిలో మీటరు పొడవునా బండ్ సుందరీకరణ పనులకు పర్యాటకశాఖ, వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) అధికారులు రెండేళ్ల క్రితం శ్రీకారం చుట్టారు. పనులు ఆగుతూ సాగుతూ ఎట్టకేలకు చివరి దశకు చేరుకున్నాయి. గుడి చెరువు కట్టను దాదాపు కిలో మీటరు పొడవునా సుందరీకరణ చేశారు. పార్కు మొత్తం పచ్చదనంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. సేదతీరడానికి పచ్చని గడ్డి పెంచారు. వివిధ రకాల మొక్కలు నాటారు. విద్యుత్ దీపాలు, ఫ్లోరింగ్, వాకింగ్ ట్రాక్, బెంచీలు, రంగు రంగుల విగ్రహాలు, చిన్నారులు ఆడుకునేలా నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన గేటు, భద్రత సిబ్బంది గది తదితర వాటిని పూర్తి చేయాల్సి ఉంది. లైట్లు అమర్చాల్సి ఉంది. వీటికి సంబంధించిన సామగ్రిని సిద్ధంగా ఉంచారు. పార్కు ప్రారంభం తేది నిర్ణయిస్తే దీపాల ఏర్పాటు తదితర చిన్న చిన్న పనులు పూర్తి చేయాలని భావిస్తున్నారు. భద్రత సిబ్బందిని ఏర్పాటు చేసిన తరవాత విద్యుత్ దీపాలు అమర్చనున్నారు. మహా శివరాత్రికి ముందే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. ఆకర్షణీయంగా...గుడి చెరువు బండ్ సుందరీకరణ భక్తులతో పాటు పట్టణ ప్రజలను ఆకర్షించనుంది. ఆహ్లాదం పంచనుంది. ఇప్పటికే పట్టణంలోని మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మించిన పార్కు పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. అదే మాదిరిగా రాజన్న భక్తులకు ఇది ఉపయోగపడనున్నది. ఉదయం, సాయంత్రం పట్టణవాసులు, భక్తులు సేదతీరడానికి ఎంతగానో దోహదపడనుంది.

**అందుబాటులోకి తెస్తాం**

గుడి చెరువు బండ్ సుందరీకరణ పనులు దాదాపు పూర్తయ్యాయి. మహా శివరాత్రికి ముందే పార్కును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. గేటు, చిన్న చిన్న పనులు పూర్తి చేయాల్సి ఉంది. జీవన్, ఏఈ, పర్యాటకశాఖ

# గాడి తప్పుతున్న పాలన

మల్యాల : కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి కార్యనిర్వహణ అధికారి(ఈవో)లేక పాలన గాడితప్పుతోంది. ఈవోగా పనిచేసిన రామకృష్ణారావును ఈనెల 3న సికింద్రాబాద్‌లోని గణేష్ ఆలయానికి బదిలీ చేశారు. వేములవాడ రాజన్న ఆలయ కార్యనిర్వహణ అధికారి వినోద్‌కు అదనపు ఈవోగా బాధ్యతలు అప్పగించారు. జనవరి 4న వినోద్ కొండగట్టు అదనపు ఈవోగా బాధ్యతలు చేపట్టారు. తర్వాత మళ్లీ రాలేదని ఆలయవర్గాలు తెలిపాయి. వరంగల్ దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావును ఈవోగా బదిలీ చేస్తూ ఈనెల 7న ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు శ్రీకాంతరావు బాధ్యతలు చేపట్టలేదు. ఉన్నతాధికారిలేక ఆలయంలో పాలన గాడితప్పిందని విమర్శలు వస్తున్నాయి.

**టెండర్ల ప్రక్రియకు అవరోధం**

ఏప్రిల్ 21న ఆలయంలో హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలకు ముందు ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఏర్పాట్ల కోసం టెండర్లు నిర్వహించాల్సి ఉంటుంది. మూడు నెలల ముందు ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఆలయ కార్యనిర్వహణ అధికారిలేక టెండర్ల ప్రక్రియలో జాప్యం ఏర్పడుతోంది. 40 రోజులు కాగానే ఆలయంలోని హుండీలలో భక్తులు వేసిన కానుకలు, నగదును లెక్కిస్తారు. నవంబరు 21న హుండీ లెక్కింపు జరగగా 50 రోజులు గడుస్తున్నా లెక్కింపు చేపట్టలేదు. ఆలయానికి వరంగల్ డిప్యూటీ కమిషనరును ఈవోగా నియమించినా ఇప్పటి వరకు బాధ్యతలు చేపట్టకపోవడంపై చర్యలు తీసుకోవడంలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఆలయ ఏఈవో అంజయ్యను సంప్రదించగా ఈవో నియామకం గురించి ఉన్నతాధికారులు చూసుకుంటారని పేర్కొన్నారు.

# 'అపార్' నమోదులో జాప్యం!



కరీంనగర్ : విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఒకే కార్డులో పొందుపరిచేందుకు కేంద్రం చేపట్టిన ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు ఉమ్మడి జిల్లాలో నత్తనడకన సాగుతోంది. 'వన్ నేషన్ వన్ స్టూడెంట్' నినాదంతో ఈ ప్రక్రియను చేపట్టగా.. అపార్ పేరుతో విద్యార్థులకు 12 అంకెల గుర్తింపు నంబరు భవిష్యత్తులో వారికి కీలకంగా నిలవనుంది. మొదట 2వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థుల వివరాలు గత సెప్టెంబరు నెలాఖరు నుంచి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ప్రారంభించారు. వివరాల నమోదుకు ఈ నెల 31 తుది గడువుగా కేంద్రం సూచించింది. తుది గడువు సమీపిస్తున్నా ఉమ్మడి జిల్లాలో ఇప్పటికి 19 శాతమే నమోదైంది.. అధికారులు పూర్తి చేయాలని తరచూ ఆదేశాలిస్తున్నా క్షేత్రస్థాయి సమస్యలు ప్రతిబంధకంగా మారుతున్నాయి.

**విద్యార్థి సమగ్ర సమాచారం**

కేంద్రం జారీ చేయనున్న అపార్ కార్డులో విద్యార్థులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంటుంది. ఎక్కడ చదివారు, ఏ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి, వ్యక్తిగత వివరాలు అందులో ఉంటాయి. విద్యార్థులు ఉన్నత చదువులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు వంటి వాటికి అపార్ కార్డులోని 12 అంకెల విశిష్ట నంబరును ఉపయోగించి దరఖాస్తు చేసుకునేలా దీన్ని రూపొందించారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఇది ప్రామాణికంగా నిలవనుంది.

**నమోదులో వెనుకబాటు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల విద్యా సంస్థలు 3,700 ఉండగా, వాటిల్లో మొత్తం 5,26,061 మంది విద్యార్థులున్నారు. ఇప్పటి వరకు వివరాలు నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య 1,00,030. కొన్ని పాఠశాలలు ఈ ప్రక్రియను ఇప్పటికీ ప్రారంభించలేదు. ముఖ్యంగా ప్రైవేటు పాఠశాలల్లో మెజారిటీ నమోదు పట్టించుకోవడం లేదు. కరీంనగర్ జిల్లాలో మొత్తం 326 ప్రైవేటు పాఠశాలల్లో 149 పాఠశాలలు నమోదును ప్రారంభించకపోవడం గమనార్హం. మరోవైపు విద్యా సంస్థలకు సంక్రాంతి సెలవులు రావడంతోనూ ఈ ప్రక్రియ మందగించింది.

**ప్రతిబంధకాలు అనేకం..**

పలువురు తల్లిదండ్రులు వారి పిల్లలకు సంబంధించిన వివరాలు, అంగీకార పత్రాలను ఉపాధ్యాయులకు సకాలంలో అందించడం లేదు. ఉపాధ్యాయులకు అవగాహన లేకపోవడంతో నమోదులో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి.

యూ డైస్ ప్లస్‌లో ఉన్న వివరాలతో విద్యార్థుల ఆధార్ వివరాలు సరిపోక కొంతమందివి నమోదు కావడం లేదు. ఆధార్ కార్డుల్లోని తప్పులను సవరించుకుని రావడంలో తల్లిదండ్రుల నిరాసక్తతో నమోదు పుంజుకోవడం లేదు. ఇంటర్ కళాశాలల్లో పబ్లిక్ పరీక్షలపైనే ప్రధాన దృష్టి నిలపడంతో నమోదు మందగించింది.

ఎమ్మార్సీల్లోని కంప్యూటర్ ఆపరేటర్లు చాలా రోజులు సమ్మెలో ఉండటం, ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ ఆపరేటర్లు లేకపోవడం నమోదు ఆలస్యానికి మరో కారణం.

# కట్ట తెగి.. నీరు ముంచెత్తి!



తిమ్మాపూర్: అధికారుల అలసత్వం.. గుత్తేదారుల నిర్లక్ష్యం వెరసి తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి జలగండం తప్పడం లేదు. ఇప్పటికే మూడుసార్లు డీ-4 కెనాల్ కట్ట తెగడంతో ఇళ్లు నీటమునిగి నిత్యావసర సరకులు, విలువైన సామగ్రి నీటిపాలయింది. అయినా సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.

**ఇదీ పరిస్థితి:** చిగురుమామిడి, తిమ్మాపూర్, సైదాపూర్, మానకొండూర్ మండలాలకు సాగు నీరందించేందుకు మధ్యమానేరు జలాశయం నుంచి తోటపల్లికి.. అక్కడి నుంచి ప్రధాన కాల్వ, పిల్ల కాల్వల వెంబడి నీళ్లందించేందుకు 2008లో కాల్వ పనులను ప్రారంభించారు. ఆ పనులన్నీ 2019లో పూర్తయ్యాయి. మానకొండూర్ మండలంలోని చెంజర్ల, నిజాయితీగూడెం, ఖాదరగూడెం, తిమ్మాపూర్ మండలంలోని పోరండ్ల గ్రామానికి మన్నెంపల్లి డీ-4 కెనాల్ ద్వారా ఈ సాగు నీరు వెళ్తోంది. 2019లో ఒకసారి కాల్వ తెగగా నీళ్లన్నీ మన్నెంపల్లిలోని ఇళ్లకు చేరాయి. తాత్కాలిక పనులు చేపట్టి అధికారులు, గుత్తేదారు చేతులు దులుపుకోగా రెండోసారి మరోసారి కట్ట తెగింది. అప్పుడు పంటలు నీట మునిగాయి.

నాలుగు రోజుల కింద మరోసారి కెనాల్ కట్ట తెగిపోవడంతో ఇళ్లు జలమయమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నీటి విడుదలను నిలిపేశారు. మొరం పోసి కాల్వను సరి చేశారు.

పూర్తి స్థాయిలో కెనాల్‌కు సీసీ లైనింగ్ ఏర్పాటు చేస్తే తెగిపోయే ప్రమాదం తక్కువగా ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. కెనాల్‌లను అధికారులు పర్యవేక్షిస్తూ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇళ్ల సమీపంలో ఉన్న కాల్వల వెంబడి లైనింగ్, రక్షణ గోడల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందిస్తున్నట్లు ఈఈ పెద్ది రమేశ్ తెలిపారు. చివరి ఆయకట్టు రైతులు నీళ్లు ఇంకా రావడం లేదని పీచుపల్లి క్రాస్ రెగ్యులేటర్ వద్ద పరిమితికి మించి నీరు వచ్చేలా చేయడంతో సమస్య ఉత్పన్నమైందన్నారు. సరిపడా లస్కర్లు లేనందున పర్యవేక్షించలేకపోతున్నామని.. రైతులంతా సహకరించాలని కోరారు.

ఈ కాల్వల కింద సుమారు 45 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రధాన కాల్వలు, పిల్ల కాల్వలు కలుపుకొని 150 కిలోమీటర్ల మేర వ్యాపించి ఉన్నాయి.

తోటపల్లి నుంచి సైదాపూర్ పరిధిలోని ఎలబోతారం వరకు, మానకొండూర్ మండలంలోని ఖాదరగూడెం వరకు రెండు వైపులుగా నీరు వెళ్లేందుకు కాల్వ నిర్మాణాలు చేపట్టి సాగు నీరు అందిస్తున్నారు.


# మొదట్లోనే మొగి పురుగు ఉద్ధృతి

గంగాధర: యాసంగిలో వరి పంట వేసిన రైతులకు మొదట్లోనే కష్టనష్టాలు ఎదురవుతున్నాయి. గత ఖరీఫ్‌లో సుడిదోమ, ఉల్లికోడు, ఇతర తెగుళ్ల ప్రభావంతో దిగుబడులు తగ్గిపోయి రైతులు నష్టాలపాలయ్యారు. ఈ పంటలోనైనా కష్టనష్టాలు అధిగమించి మంచి దిగుబడులు సాధించాలని ఆశించారు. కానీ మొగి పురుగు సోకి రైతులను కోలుకోకుండా చేస్తోంది. పురుగు మందులు చల్లినా పురుగు ఉద్ధృతి తగ్గడంలేదని ఆయా గ్రామాల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నాట్లు వేసిన 20 రోజుల్లోనే ఆశిస్తున్న తెగుళ్లు**

వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో వరి నారు దశలోనే మొగి పురుగు సోకుతుండగా రెండు, మూడు సార్లు క్రిమిసంహారక మందు పిచికారీ చేశారు. గతంలోనైతే వరిపంట వేశాక పొట్ట దశ నుంచి మొగి పురుగు ఆశించగా ఇప్పుడేమో పది రోజుల నుంచే సోకి వరికర్రలు కుళ్లిపోయి చనిపోతున్నాయి. దీంతో పొలమంతా పంట సాగు చేయని విధంగా ఖాళీ అవుతోంది. ఏళ్లుగా రైతులు ఒకే రకమైన పంట సాగు చేయడం, ఎప్పుడూ పొలం మడుల్లో నీరు ఉంచడంతో తెగుళ్ల ఉద్ధృతి కొనసాగుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పంట మార్పిడితోపాటు పొడి దుక్కులు దున్నడంతో తెగుళ్లు సోకకుండా నివారించగలవచ్చని అభిప్రాయపడుతున్నారు. చలికాలంలో ఉదయం పూట పొగమంచు, మధ్యాహ్నం ఎండ, రాత్రి చల్లని వాతావరణంతో వరిపై ప్రభావం చూపుతోంది. పంటలో జింకు లోపం కారణంగా ఎదుగుదల లోపించడమే కాకుండా ఎర్రబారుతోంది. పంట కాలపరిమితి 120 రోజుల నుంచి 135 రోజుల వరకు ఉండగా చేతికి అందేసరికి పెట్టుబడుల భారం పెరగనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అదనంగా పెట్టుబడి..**



మూడెకరాల్లో వరి పంట వేసి 20 రోజులు కాకముందే మొగి పురుగు సోకింది. అధికారుల సూచన మేరకు ఎకరాకు 8 కిలోల చొప్పున కార్బోఫ్యూరిడాన్ గుళికలు చల్లాను. పురుగు మందు కూడా పిచికారీ చేశా. తెగుళ్ల ధాటికి పెట్టుబడులు ఎక్కువ అవుతుండగా పంట దిగుబడి తగ్గి నష్టాలే మిగలనున్నాయి. గతేడాది వర్షాకాలం పంట కూడా ఆశాజనకంగా రాలేదు. మల్లేశం, లక్ష్మీదేవిపల్లి రైతు

**నారు దశలోనే తెగుళ్లు నివారించాలి**


వాతావరణంలో మార్పులతో వరి పంటకు ఆదిలోనే మొగి పురుగు సోకుతుంది. ఎకరాకు 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరిడాన్ 3జీ గుళికలు లేదా 8 కిలోల కార్పస్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు పంటకు చల్లాలి. క్లోరిఫైరిఫాస్ రసాయన మందు పిచికారీ చేయాలి. వరి పైరులో జింకు లోపం ఉంటే జింకు సల్ఫేట్ చల్లాలి. దీనికంటే ముందు రైతులు పంటల మార్పిడిపై దృష్టి సారించాలి. శ్రీనివాస్, ఏవో

# వైద్యానికి తప్పని ఎదురుచూపులు

మెదక్ : పల్లెల్లో వైద్యం దయనీయంగా మారింది. వైద్యులు, సిబ్బంది సకాలంలో హాజరుకాక.. రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు మెరుగుపడేలా కలెక్టర్ దృష్టి సారించినా ప్రయోజనం ఉండడం లేదు. సమయపాలన పాటించకపోవడం, గైర్హాజరు కావడంతో గ్రామీణ ప్రాంతవాసులకు ఇక్కట్లు తప్పడం లేదు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సీసీ కెమెరాలు బిగించినా... ఆకస్మిక పర్యటనలో గైర్హాజరైన సిబ్బందిపై కలెక్టర్ వేటు వేసినా వారిలో మార్పు రావడం లేదు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను 'న్యూస్‌టుడే' బృందం పరిశీలించింది.

**సమయానికి రాక..** శివ్వంపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు సమయపాలన పాటించడం లేదు. ఇద్దరు వైద్యాధికారుల్లో ఒకరు సెలవులో ఉండగా... మరొకరు ఆలస్యంగా వచ్చారు. మిగతా సిబ్బందిలో కొందరు సమయానికి రాలేదు.

**ఒకరి తర్వాత మరొకరు** నార్సింగి పీహెచ్‌సీ 24 గంటలు పనిచేయాల్సి ఉంటుంది. ఆస్పత్రిలో మొత్తం ముగ్గురు వైద్యులు ఉన్నారు. ఓ వైద్యురాలు సెలవులో ఉన్నారు. ఓ వైద్యురాలు ఉదయం 9:30 గంటలకు, మరో వైద్యుడు ఉదయం 10 గంటలకు చేరుకున్నారు.



అనంతరం 10:15 గంటలకు ఆస్పత్రిలోనే అల్పాహారం చేసేందుకు నిమగ్నమయ్యారు. వైద్య సిబ్బంది కూడా సమయపాలన పాటించలేదు. ఉదయం ఒక నర్సు, మరో ఉద్యోగి మాత్రమే విధుల్లో ఉన్నారు.

**ఒకరు హాజరు.. ఇద్దరు సెలవు** అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు వైద్యులు ఉండగా ఇద్దరు సెలవులో ఉన్నారు. ఒక్కరు మాత్రమే వైద్య సేవలు అందించారు. ఇద్దరు పర్యవేక్షకులు ఉండగా ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు.

**ప్రత్యామ్నాయ సేవలు** పేట పీహెచ్‌సీలో వైద్యుడు 11 గంటల తర్వాత రావడంతో అప్పటి వరకు ఆరోగ్య ఉపకేంద్రంలో పనిచేసే ఎంఎల్‌హెచ్‌పీ ద్వారా రోగులకు వైద్య పరీక్షలు జరిపించారు. దీంతో పాటు సిబ్బంది కూడా ఆలస్యంగా వచ్చారు.

**డిప్యుటేషన్‌లో ఏడుగురు..** నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఏడుగురు వైద్యులు ఓపీ సేవలందించారు. ఆసుపత్రిలో 12మంది వైద్యులుండగా, నలుగురు మెదక్, ఇద్దరు తూప్రాన్‌కు, ఒకరు కౌడిపల్లికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఉన్న వారితో మెరుగైన సేవలందించడానికి కృషి చేస్తున్నామని ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ పావని తెలిపారు. ఇద్దరు గైనకాలజిస్టులు, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, రేడియాలజిస్టు అవసరం ఉంది.

**20 మందికి మిగిలింది ఆరుగురు** కౌడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనే సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్వహిస్తున్నారు. సీహెచ్‌సీలోని 20 మంది రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి ఇక్కడ కేవలం ఆరుగురు మాత్రమే పనిచేస్తుండగా.. మిగతా 14 మంది వేరేచోట విధులను నిర్వర్తిస్తున్నారు. సమయం దాటిన తర్వాతనే వైద్యులు విధులకు హాజరయ్యారు. డిప్యుటేషన్ రద్దుచేస్తే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవకాశం ఉంటుంది.

**పర్యవేక్షణ చేస్తున్నాం...శ్రీరాం, జిల్లా వైద్యాధికారి**


జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది హాజరుపై నేరుగా కలెక్టర్, తాను పర్యవేక్షిస్తున్నాం. ఇద్దరు లేదా ముగ్గురు ఉన్న చోట సెలవుపై వెళ్తున్నా వారి స్థానంలో మరొకరు విధులు నిర్వహిస్తున్నారు. నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. పీహెచ్‌సీల్లో ఓపీ సేవలు నిర్వహిస్తున్నాం. ఏఎన్ఎం, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది.

# అడుగంటిన హల్దీ

వెల్దుర్తి : హల్దీవాగు ఎండిపోయింది. ఇసుక దిబ్బలు తప్ప నీళ్లు కనిపించడం లేదు. వర్షాకాలంలో చెక్‌డ్యాంలపై మత్తడి పారింది. ఖరీఫ్ వరి నూర్పిళ్లు జరిగే వరకు పుష్కలంగా నీరుంది. యాసంగి వరి పంటలో కలుపు తొలగించే వరకు నీరుంటే సాగునీటికి ఇబ్బంది ఉండదని ఉమ్మడి వెల్దుర్తి మండల రైతులు భావించారు. కానీ ప్రస్తుతం వరి నాట్లు పూర్తి కాకముందే అడుగంటడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చెక్‌డ్యాంలకు లీకేజీలు ఉండటమే ఇందుకు కారణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఎనిమిది చెక్‌డ్యాముల్లో నీరు లేక**

ఉమ్మడి వెల్దుర్తి మండలంలో హల్దీవాగుపై మొత్తం పది చెక్‌డ్యాంలు ఉండగా ప్రస్తుతం ఎనిమిది అడుగంటాయి. మాసాయిపేట మండలంలోని బొమ్మారం,



మాసాయిపేట చెక్‌డ్యాంలోనే కొద్దిగా నీరుంది. మాసాయిపేట మండలం కొప్పులపల్లి, వెల్దుర్తి-1, వెల్దుర్తి-2, ఉప్పులింగాపూర్, కుకునూర్, దామరంచ-1, దామరంచ-2, శెట్టిపల్లికలాన్ గ్రామాల పరిధిలోని చెక్‌డ్యాంలు ఎండిపోయాయి. ఈ ఎనిమిది చెక్‌డ్యాంలు భూమిలో గట్టి మొరం వచ్చే వరకు తవ్వి నిర్మించలేదని.. దీంతో సిమెంట్ బెడ్ కింది నుంచి నీళ్లు లీకేజీ అవుతున్నాయని రైతులు అంటున్నారు. బొమ్మారం, మాసాయిపేట చెక్‌డ్యాంలు గట్టి భూమిని తవ్వి చెక్‌డ్యాంలు నిర్మించారని, అందువల్లే వీటిలో చాలా రోజుల వరకు నీళ్లు నిల్వ ఉన్నాయని చెబుతున్నారు.

**వేల ఎకరాలకు ఇక్కట్లు**

హల్దీవాగుపై ఉన్న పది చెక్‌డ్యాంల ద్వారా వెల్దుర్తి, మాసాయిపేట, తూప్రాన్, చిన్నశంకరంపేట, కొల్చారం, మెదక్ మండలాల పరిధిలో సుమారు పది వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. చెక్‌డ్యాంలు అడుగంటడంతో సుమారు ఆరు వేల ఎకరాలకు సాగునీటి ఇబ్బందులు తప్పవని రైతులు అంటున్నారు. హల్దీవాగులో కాళేశ్వరం నీళ్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం వరి నాట్లు పూర్తయ్యే దశలో ఉన్నాయి. అందువల్ల ప్రభుత్వం వెంటనే స్పందించి నీటిని విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

చురకలు



# అడ్డదారి హాజరుకు కళ్లెం!

అనంతపురం : సంక్షేమ వసతి గృహాల్లో బోగస్ హాజరుకు కళ్లెం వేసే దిశగా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీసీ వసతి గృహాల్లో వేలిముద్ర, ఆధార్ ద్వారా హాజరు తప్పనిసరి లేదు. ఎవరైనా విద్యార్థులకు సాంకేతిక సమస్య ఎదురైతే మ్యానువల్‌గా హాజరు వేసుకొనే అవకాశం ఉండేది. మ్యానువల్‌గా హాజరు ఉండటంతో డైట్ బిల్లులు పొందే సమయంలో ఎక్కువ హాజరు చూపి అక్రమాలకు తెరలేపేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమాలకు కళ్లెం వేసే దిశగా ఒక్కో అడుగు పడుతోంది. రాష్ట్రంలో అనంతపురం జిల్లాను పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నారు. ఎఫ్ఆర్ఎస్(ఫేస్ రికగ్రేషన్ సిస్టమ్) తీసుకుంటున్నారు. మార్చి నుంచి వంద శాతం అమలు చేయబోతున్నారు.

**ఒక్కరోజులోనే 1812 మంది తేడా..**

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేశారు. 7,379 మంది విద్యార్థులకు కేవలం 5,567 మంది మాత్రమే హాజరు నమోదైంది. ఈ లెక్కన ఒక్క రోజులోనే 1,812 మంది విద్యార్థుల హాజరు నమోదు లేకపోవడంతో సరాసరిగా రోజుకు రూ.90 వేలు వారికి డైట్ బిల్లులు అక్రమంగా పొందడానికి వీలుకాదు. ఎఫ్ఆర్ఎస్ లేని సమయంలో హాజరు కాని విద్యార్థులను కూడా ఏదో ఒక లెక్క



వేసి డైట్ బిల్లులు పొందే వెసులుబాటు ఉండేది.

**వేగం.. పారదర్శకం**

గతంలో విద్యార్థులు హాజరు వేయడానికి గంటల తరబడి వరుసలో ఉండాల్సి ఉండేది. 200 మంది విద్యార్థులు ఉండే వసతి గృహంలో కనిష్ఠంగా 2 గంటలు గరిష్ఠంగా 3 గంటలు హాజరు వేయడానికి సమయం పట్టేది. తాజాగా చరవాణితో ముఖ ఆధారిత హాజరు ఉండటంతో అందరూ ఒకేచోటకు వస్తే కేవలం అరగంటలోపే ప్రక్రియ పూర్తి అవుతోంది. ఒక్కోసారి అంతర్జాలం లేకున్నా సేవ్ చేసుకొని మళ్లీ అంతర్జాలం రాగానే అది ఆన్‌లైన్‌లో అనుసంధానం అవుతోంది. ఈప్రక్రియ వల్ల హాజరు పారదర్శకంగా ఉండటంతో పాటు వేగంగా పూర్తి అవుతుంది. వైకాపా హయాంలో 2023 సెప్టెంబరు 1 నుంచి సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

**మార్చి నుంచి అమలు చేస్తాం- ఖుష్బు కొఠారి, బీసీ సంక్షేమ సంచాలకులు**

బీసీ వసతి గృహాల్లో ప్రయోగాత్మకంగా హాజరు వేస్తున్నాం. ఇప్పటికే 7,290 మంది విద్యార్థులను నమోదు చేశాం. ప్రతి విద్యార్థి నుంచి ఎఫ్ఆర్ఎస్ ద్వారానే హాజరు తీసుకుంటాం.

# కరవుసీమలో జలకళ

డోన్ : జీవకోటికి నీరు ప్రాణాధారం. ఒక్కనీటి చుక్క ఎంతో విలువైంది. నీటి కోసం ఎన్నో యుద్ధాలు జరిగాయని విన్నాం. కరవు స్మీమలో నీటి జాడలు లేక రైతుల కళ్లల్లో కన్నీటి ధారలు చూశారు. వేసిన పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నా చుక్కనీరు పంటలకు అందించలేని పరిస్థితులను చూసి ఆ రైతుల ఆశలు నింపేందుకు ఆర్డీటీ ముందుకొచ్చింది. సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను ఎంపిక చేసుకుని చెక్‌డ్యాం నిర్మాణాలకు నడుం బిగించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రూ.3.27 కోట్లతో 38 చెక్‌డ్యాంలు నిర్మించింది.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరవు పరిస్థితులు ఎదుర్కొనే గ్రామాలను ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ ఎంపిక చేసుకుంది. ఇలా మొదటగా 2015లో తుగ్గలి, వెల్దుర్తి మండలాల్లోని పలు గ్రామాలను ఎంపిక చేసుకుంది. తుగ్గలి మండలంలో 12, వెల్దుర్తి మండలంలో 2 చెక్‌డ్యాంలను నిర్మించింది. డోన్ మండలంలో 15, ప్యాపిలి మండలంలో 9 చెక్‌డ్యాంలను నిర్మించినట్లు ఆర్డీటీ అధికారులు తెలిపారు. డోన్, పత్తికొండ ప్రాంతాలు కరవు ప్రాంతాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.




ఇలాంటి పరిస్థితుల్లో ఆర్డీటీ సంస్థ ముందుకు వచ్చి నీటి నిల్వచేస్తేనే రైతులకు ఉపయోగం ఉంటుందనే భావనతో చెక్‌డ్యాంల నిర్మాణం పలు చెక్‌డ్యాంలకు హంద్రీనీవా నీరు నింపటంతో జళకళలు సంతరించుకుంది.

**రూ.3.27 కోట్ల ఖర్చు**

నాలుగు మండలాల్లో మొత్తం 38 చెక్‌డ్యాంలను నిర్మించేందుకు ఆర్డీటీ సంస్థ ద్వారా రూ.3.27 కోట్లు ఖర్చుచేశారు. వీటిలో పలు చెక్‌డ్యాంలకు పత్తికొండ, డోన్ మీదుగా వెళ్లే హంద్రీ నీవా కాల్వ నుంచి నీటిని ఎత్తిపోసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. మొత్తం చెక్‌డ్యాంలలో 1023.17 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యం ఉంది. చెక్‌డ్యాంల పరిధిలో 457 బోర్లలో, 19 బావుల్లో నీటి నిల్వలు పెరిగినట్లు గుర్తించారు. వీటి పరిధిలో 2,569 ఎకరాల్లో పంటల సాగు చేపడుతున్నారు.

**సాగుకు ఉపయోగం - పరమేష్, కొత్రాయి**

మా పొలం పక్కనే ఆర్డీటీ సంస్థ చెక్‌డ్యాం నిర్మించింది. ఈ కట్టడంతో వర్షాలకు నీరు నిలిచి నిండుగా ఉంది. చెక్‌డ్యాంలో నీటితో కళకళలాడుతుండటంతో నీటి కష్టాలు తీరేందుకు అవకాశం ఏర్పడింది. సమీప ప్రాంతాల ప్రజలకు ఉపయోగకరంగా ఉన్నాయి.

**భూగర్భజలాలు పెరిగాయి లక్ష్మణమూర్తి, కొత్రాయి**

మా పొలం పక్కనే చెక్‌డ్యాంను నిర్మించారు. దీంతో నీరు నిలిచి మా పొలంలో ఉన్న బోర్లలోనూ నీరు పుష్కలంగా ఉంది. వేసవి వస్తే బోర్లు అడుగంటిపోతాయనే ఆందోళన ఉండేది. కానీ ఈ ఏడాది ఆ ఆందోళన లేదు. చెక్‌డ్యాంలు నిర్మిస్తే భూగర్భజలాలు పెరుగుతాయి.

అన్నదాత సంక్షేమానికి సంస్థ కృషి

ఆంథోనిరెడ్డి, ఆర్డీటీ ఏటీఎల్, డోన్.

రైతుల బాగుకోసం విశేష ఆర్డీటీ కృషి చేస్తోంది. కరవు పరిస్థితులు ఎదుర్కోవాలంటే వర్షం నీటిని ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకోవాలి. నీటిని నిల్వచేసుకునే సామర్థ్యం ఉంటే భూగర్భజలాలు పెరిగేందుకు అవకాశం ఉంటుంది. చెక్‌డ్యాం నిర్మాణంతో వేలాది ఎకరాలు సాగవుతున్నాయి.

# పౌష్టికాహారం.. ఆరోగ్యం



అనంతపురం : అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్నంగా అమలు చేస్తున్న 'పోషణ వాటిక' (పెరటి తోట) ఆలోచన సత్ఫలితాన్ని ఇస్తోంది. కేంద్రాల ఆవరణాల్లోనే తాజా ఆకుకూరలు.. కూరగాయలు పండిస్తుండటంతో నిరుపేద బాలింత/గర్భిణులు, పిల్లల ఆరోగ్యానికి దోహదం చేస్తోంది. ఈ పోషణ వాటికల ఫలితంగా అంగన్‌వాడీ కేంద్రాలన్నీ తల్లీబిడ్డల ఆరోగ్య కేంద్రాలుగా రూపాంతరం చెందుతుండటం ప్రస్తావనార్హం. రాష్ట్రంలో తెదేపా కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేతపట్టిన తర్వాత గతేడాది అక్టోబరులో ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ పెరటి తోటల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం 'సక్షం' పథకం ద్వారా నిధులు సమకూరుస్తోంది.

**ఒక్కో వాటికకు రూ.10 వేలు**

అనంత జిల్లాలో మొత్తం 2,302 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,73,579 మంది లబ్ధిదారులు ఉన్నారు. పక్కా భవన సదుపాయం, తగిన స్థలం కలిగిన 185 కేంద్రాలకు 'సక్షం' కింద పోషణ వాటికలను మంజూరు చేశారు. ఒక్కో కేంద్రానికి రూ.10 వేలు చొప్పున నేరుగా సంబంధిత అంగన్‌వాడీ కార్యకర్త బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇలా 185 కేంద్రాలకు మొత్తం రూ.18.50 లక్షలు గతేడాది అక్టోబరులోనే మంజూరు చేశారు. అలాగే నీటి సంరక్షణ కేంద్ర నిర్మాణానికి రూ.16 వేలు, ఆట బొమ్మలకు రూ.19,800 ప్రకారం కూడా మంజూరయ్యాయి. ఇప్పటికే నీటి సంరక్షణ కేంద్రాల నిర్మాణం కొనసాగుతోంది. త్వరలోనే ఆటవస్తువులు సరఫరా అవుతాయి.

**ఏమేం పండిస్తున్నారంటే..!**

అంగన్‌వాడీ సిబ్బంది ప్రత్యేక శ్రద్ధతో పెరటి తోటలు పెంచుతున్నారు. ఎక్కువగా తోటకూర, గోంగూర, చుక్కకూర, పాలకూర, మెంతికూర, కొత్తిమేర, బెండకాయ, వంకాయ, గోరుచిక్కుడు, బీరకాయ, సోరకాయ.. వంటి వాటిని పండిస్తున్నారు. వీటిని క్రమంగా తీసుకుంటే రక్తహీనత, పోషణ లోపం.. వంటి రుగ్మతలు దరిచేరవు. ఆసక్తి కలిగిన అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక అడుగు ముందుకేసి.. అదే పెరటి తోటల్లోనే నిమ్మ, తులసి, అరటి, దానిమ్మ, వంటి పండ్ల మొక్కలు కూడా పెంచుతున్నారు.

**ప్రతిష్టాత్మకంగా పెంచుతున్నాం**

– వనజా అక్కమ్మ, పీడీ, ఐసీడీఎస్

సక్షం పథకం ద్వారా ఒక్కో కేంద్రానికి రూ.45,800 ప్రకారం నిధులు వచ్చాయి. ఇవన్నీ గతేడాది అక్టోబరులోనే క్షేత్రస్థాయికి వెళ్లాయి. తొలి విడతగా పోషణ వాటికలు పెంచుతున్నాం. తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం ఇవ్వాలన్నదే సంకల్పం. ఇప్పటికే కోడిగుడ్లు, పాలు, కిట్లు, బాలామృతం.. వంటి పౌష్టికాహారంతోపాటు ఈ కూరగాయలు, ఆకుకూరలను ఇస్తున్నాం.

# జీతం దూరం.. జీవనం భారం



కళ్యాణదుర్గం : శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు వేతనాలు సక్రమంగా అందడం లేదు. దాంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు వాపోతున్నారు. కనీసం అప్పులు కూడా పుట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ఈ నెల 18 నుంచి సమ్మె బాట పట్టనున్నారు. దీంతో పథకం పరిధిలోని గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోనుంది. ఈ పథకం ద్వారా కళ్యాణదుర్గం, మడకశిర, హిందూపురం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాలకు నీరు సరఫరా అవుతోంది. పథకంలో ప్రస్తుతం 630 మంది కార్మికులు, 20 మంది సూపర్‌వైజర్లు పని చేస్తున్నారు.

**అందాల్సిన జీతాలు, పీఎఫ్ వివరాలు**

పేస్-1, 4 పరిధిలోని కళ్యాణదుర్గం, రాయదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈ పథకం కింద 292 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నెలకు జీతం రూ.16,200 ప్రకారం ఆరు నెలలకు సంబంధించి రూ.2,83,82,400, 30 నెలల పీఎఫ్ రూ.2,400 ప్రకారం రూ.2,10,24,000 రావాల్సి ఉంది.

ఫేస్-2 పరిధిలో హిందూపురం నియోజకవర్గంలో 52 మంది కార్మికులకు నెలకు రూ.14 వేల ప్రకారం 10 నెలల జీతం రూ.72.80 లక్షలు, రూ.1,230 ప్రకారం 10 నెలల పీఎఫ్ రూ.6.39 లక్షలు. పరిగి పరిధిలో 14 మందికి 30 నెలల పీఎఫ్ రూ.5,16,600 రావాల్సి ఉంది.

ఫేస్-3 పరిధిలో మడకశిర నియోజకవర్గంలో 172 మంది కార్మికులు పని చేస్తున్నారు. నెలకు రూ.14 వేలు ప్రకారం ఐదు నెలలకు రూ.12.40 కోట్లు, రూ.2,400 ప్రకారం పీఎఫ్ 10 నెలలకు రూ.41.28 లక్షలు రావాల్సి ఉంది.

**అప్పులు పుట్టడం లేదు**

– నరసింహులు, లైన్‌మెన్, కరిగానిపల్లి, కుందుర్పి మండలం

శ్రీరామిరెడ్డి నీటి పథకంలో పని చేస్తున్న కార్మికులంటే అప్పులు పుట్టడం లేదు. నేను 14 ఏళ్లుగా లైన్‌మెన్‌గా పని చేస్తున్నా. నా భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా నెలకు రూ.5 వేలు ఖర్చు అవుతోంది. పిల్లల చదువులు, కుటుంబ పోషణకు మరో రూ.8 వేలు అవసరం. రూ.1.10 లక్షల వరకు అప్పు చేశాను. అవసరానికి ఇతరులతో అప్పు అడిగితే ఇవ్వడం లేదు. కుటుంబాన్ని నెట్టుకు రావడం భారమవుతోంది. ప్రతి నెలా జీతం వచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదు.

**కుటుంబ పోషణ కష్టంగా ఉంది**

– సోమశేఖర్, ఫిట్టర్, పరిగి మండలం

శ్రీరామిరెడ్డి నీటి పథకంలో పదేళ్లుగాపని చేస్తున్నా. జీతంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాం. వయస్సు మీదపడ్డ తల్లిదండ్రులు, పిల్లల చదువులు, కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నా. ఇప్పటి వరకు రూ.1.20 లక్షలు అప్పు చేశా. 11 నెలల నుంచి జీతం రాలేదు. మా బాధలు ఎవరితో చెప్పుకోవాలో తెలియడం లేదు. సమ్మె చేస్తే తప్పా వేతనం వచ్చే పరిస్థితి లేదు.

**నెలాఖరు వరకు జమ అవుతాయి**

– సురేశ్, ఎస్ఈ, నీరుపారుదలశాఖ

ఈ నెలలో బిల్లులకు సంబంధించి ప్రతిపాదనలు వచ్చాయి. గుత్తేదారుల వివరాలు సేకరించాం. కార్మికులకు ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పాం. ఈ నెలాఖరు వరకు జీతాలు కార్మికుల ఖాతాల్లో జమ అవుతాయి.

# పెద్దాసుపత్రికి అనారోగ్యం



హిందూపురం : హిందూపురం జిల్లా ఆసుపత్రిలో సౌకర్యాలు, సిబ్బంది ఉన్నప్పటికీ ఆ మేరకు బాధితులకు వైద్యసేవలు అందటం లేదు. ఈ ఆసుపత్రికి వెళితే వైద్యం అందుతుందన్న విశ్వాసం సన్నగిల్లింది. ప్రధానంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటం, స్థానిక ప్రజాప్రతినిధులు ఆసుపత్రి బాగోగుల గురించి ఆలోచించక, స్థానిక అధికారి పర్యవేక్షణ సమర్థంగా లేక సామాన్యులకు వైద్యం దూరం అయిందనే ఆరోపణలున్నాయి. గతంలో సేవల్లో ఎంతో ఘనత సొంతం చేసుకొన్న ఈ ఆసుపత్రి నేడు ఈ దుస్థితికి చేరడంపై పట్టణ, సమీప ప్రాంతాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రతి మాసం ఆసుపత్రిని సందర్శించి వైద్యసేవలు పరిశీలించేందుకు నియమించిన ఉన్నతాధికారి కనీసం ఇక్కడికి రాకపోవడం గమనార్హం.

**ఏడేళ్లుగా పనిచేయని సిటీ స్కాన్‌యంత్రం**

ఆసుపత్రిలో సిటీ స్కానింగ్ యంత్రం ఏడేళ్లుగా మూలన పడింది. రోజూ 100 మందికి పైగా స్కానింగ్ అవసరం ఉంటుంది. దీంతో వైద్యులు ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతుండటంతో సామాన్య ప్రజలు రూ.800 నుంచి రూ.6 వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. పాడైన ఈ యంత్రం మరమ్మతులకు పెద్ద మొత్తం వ్యయం అవుతుండటంతో కొత్తయంత్రానికి అధికారులు ప్రతిపాదనలు చేసినా ఇప్పటి వరకు మంజూరుకు నోచుకోలేదు.

సిఫార్సుల్లో రికార్డు: కేంద్రంలో నలుగురు గైనకాలజిస్టులున్నప్పటికీ ఇద్దరు సెలవుల్లో ఉన్నందున ప్రస్తుతం ఇద్దరితో నెట్టుకొస్తున్నారు. సాధారణంగా ప్రసవాలు అయ్యే పరిస్థితి ఉన్నా రెఫర్ పేరుతో అనంతపురం, బెంగళూరుకు పంపుతున్నారు. ఇక్కడ విధులు నిర్వహించడం కన్నా వారి సొంత ఆసుపత్రిలో పనిచేయడానికే ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే ఆరోపణలున్నాయి. గత సంవత్సరం 4,902 మంది ప్రసవాల కోసం ఆసుపత్రిలో చేరగా సిజేరియన్, సాధారణ ప్రసవాలు 2,691 జరుగగా మిగిలిన 2,211 కేసులు వివిధ ప్రాంతాలకు రెఫర్ చేసినవే.

**సమయపాలన పాటించని వైద్యులు**

వైద్యుల్లో ఒకరిద్దరు మినహా అందరికీ సొంత క్లినిక్‌లు ఉన్నాయి. దీనివల్ల వీరు వాటిపై చూపుతున్న శ్రద్ధ ఇక్కడి సేవలపై చూపడం లేదనే ఆరోపణలున్నాయి. వీరు సమయపాలన పాటించకపోవడంతో ఆసుపత్రికి వచ్చిన బాధితులు గంటలకొద్దీ నిరీక్షిస్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. **మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు** – లింగన్న, సూపరింటెండెంట్, ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రికి వచ్చే వారందరికీ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్నివిధాలా చర్యలు తీసుకొంటున్నాం. సిటీ స్కానింగ్ యంత్రం, వైద్యుల ఖాళీలు భర్తీ చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో ఈ సమస్యలు పరిష్కారమయ్యే అవకాశాలున్నాయి.

# పేదల విద్యావికాసానికి ఆర్డీటీ ఆసరా

అనంతపురం : స్పందించు.. సాయం అందించు అనే నినాదంతో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) సంస్థ నిరుపేద విద్యార్థుల విద్యావికాసంతో పాటు, గూడు లేని పేదలకు పక్కా గృహాలు నిర్మించి వారికి ఆసరగా నిలుస్తోంది. స్పెయిన్, జర్మనీ దేశాలకు చెందిన దాతల నుంచి సేకరించిన నిధులతో పరిగి మండలంలోని ఎస్.బీరేపల్లి, పైడేటి, కొడిగెనహళ్లి తదితర గ్రామాల్లో విద్యామందిరాలు నిర్మించింది. అంతేగాక పక్కాగృహాలు నిర్మించి విద్యార్థులు, పేదలకు అండగా నిలుస్తోంది. సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని పైడేటీ ఎస్సీ కాలనీలో ఆర్డీటీ వ్యవస్థాపకులు డా.విన్సెంట్ పెర్రర్ పేరుతో



రూ.12.95 లక్షల వ్యయంతో విద్యామందిరాన్ని నిర్మించారు. ఇటీవలే ఈ విద్యామందిరం నిర్మాణానికి ఆర్థికంగా సహాయ సహకారాలు అందించిన స్పెయిన్, జర్మనీ దేశాలకు చెందిన దాతలు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. గతంలో ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో పి.నరసాపురం పంచాయతీ పరిధిలోని ఎస్.బీరేపల్లిలో నిర్మించిన పాఠశాల తరగతి గదుల సముదాయంలో విద్యార్థుల విద్యాభ్యాసం కొనసాగుతోంది. పాఠశాలల భవన నిర్మాణాలతో ఎటువంటి ఆసరా లేని పేదలకు పక్కాగృహాలు నిర్మించింది. మండల పరిధిలోని యర్రగుంట, శాసనకోట, ఎస్.బీరేపల్లి గ్రామాల్లో ఇళ్లులేని నిరుపేదలకు పక్కాగృహాలను కట్టించి ఇచ్చింది.

**సామాజిక సేవా కార్యక్రమాలివి..**

కొడిగెనహళ్లిలో ఏఎం.లింగన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆడిటోరియం నిర్మాణం.

కొడిగెనహళ్లిలోని ఎస్సీ కాలనీలో పాఠశాల భవన సముదాయాలు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

ఎస్.బీరేపల్లిలో నూతనంగా 20 పక్కాగృహాల నిర్మాణ పనులు చేపడుతున్నారు.

**భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు**

– రఘురాం, ఏటీఎల్ మడకశిర. ఆర్డీటీ

పరిగి మండలంలో సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్తులో విద్యార్థుల విద్యావికాసంతోపాటు, సామాజిక సేవా కార్యక్రమాలను ముమ్మరంగా చేపడుతున్నాం. గూడు లేని పేదలను గుర్తించి వారికి సంస్థ ఆధ్వర్యంలో పక్కాగృహాలను నిర్మించి ఇస్తాం. పదోతరగతి పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి చేయూత నందిస్తోంది.

# మగ్గానికి మంచి రోజులు

ఎమ్మిగనూరు : గద్వాల పట్టుచీరలకు ప్రసిద్ధిగాంచిన చేనేతపురి ఎమ్మిగనూరులో ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి.. పక్క రాష్ట్రం కర్ణాటకకు చెందిన పెట్టుబడిదారులు ఆసక్తి కనబరుస్తున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి చేనేత, జౌళి శాఖ అధికారులు సంప్రదింపులు చేస్తున్నారు. పార్కు వస్తే సుమారు 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మరికొందరికి ఉపాధి లభించనుంది. ఎమ్మిగనూరులో చేనేత పార్కు ఏర్పాటుకు గతంలోనే పునాది వేశాం.. వైకాపా రద్దు చేసింది.. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి రాగానే టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పలుమార్లు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే అమలుకు అడుగులు పడ్డాయి.

**2014లో తెదేపా పునాది**

చేనేతలకు చేయూతనివ్వాలన్న ఉద్దేశంతో టెక్స్‌టైల్ పార్కు నిర్మాణానికి 2014లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి శంకుస్థాపన చేశారు.బనవాసి ఫారంలో సర్వే నంబర్లు 343, 244లో 91.31 ఎకరాలు కేటాయించారు.

రూ.44 కోట్లతో అభివృద్ధి చేయాలని, తుంగభద్ర దిగువ కాల్వ నుంచి



నీటిని మళ్లించాలని నిర్ణయించారు.

డిజైన్లు, ప్రముఖ వస్త్ర పరిశ్రమ, గార్మెంట్స్ వస్త్ర ఉత్పత్తి పరిశ్రమల యజమానులతో చర్చించారు.

2019లో వైకాపా రద్దు

2019లో వైకాపా అధికారంలోకి రావడంతో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. పార్కు ప్రతిపాదనను రద్దు చేస్తున్నట్లు అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించారు. పార్కుకు కేటాయించిన స్థలంలోని 9 ఎకరాల్లో 550 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. ఆ స్థలాన్ని ప్లాట్లుగా మార్చారు. తెదేపా నాయకులు కోర్టుకు వెళ్లడంతో ఇది నిలిచిపోయింది.

**ప్రస్తుతం రూ.700 కోట్ల వ్యాపారం**

ఎమ్మిగనూరు, కోడుమూరు, గూడూరు, ఆదోని, నాగలదిన్నె, నందవరం గ్రామాల్లో చేనేత కార్మికులు ఉన్నారు.

గతంలో 23 వేల మగ్గాలు ఉండగా.. సరైన ఉపాధి లేకపోవడంతో మగ్గాలు నేసేవారు తగ్గిపోయారు.

ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 11 వేల పట్టు మగ్గాల ద్వారా 17 వేల మంది కూలీలు, చేనేత సొసైటీ 44 ఉండగా, వాటి పరిధిలో 1,200 మంది ఉపాధి పొందుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా మాస్టర్ వీవర్స్ సుమారు 800 మంది ఉండగా, వీరి పరిధిలో సుమారు రూ.700 కోట్ల (ఏడాదికి) విలువ చేసే పట్టు వస్త్రాలు తయారు చేస్తున్నారు.

# తుడా.. మనుగడెలా?

తిరుపతి : తుడాలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో అధికారులు సమగ్ర వివరాల సేకరణలో నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలో అధికారులు కంగుతినే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. అందులో ముఖ్యమైనదే తుడా మనుగడ. స్వయం సమృద్ధితో నడిచే సంస్థకు ప్రస్తుతం అప్పులు తప్ప ఆస్తులు కనిపించడం లేదని, ఉన్న ఆస్తులన్నీ గత పాలనలోనే తెగనమ్మడంతో భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**రెండున్నరేళ్లలో 113 పర్యాయాలు వేలం**

2021 ఆగస్టులో ప్రారంభమైన తుడా ఆస్తుల విక్రయాలు 2024 ఫిబ్రవరి వరకు నిరంతరాయంగా కొనసాగాయి. మొత్తం 113 పర్యాయాలు తుడా ప్లాట్ల విక్రయాలు చేపట్టగా.. ప్రతి వేలంలో సగటున 10-30 ప్లాట్లు విక్రయానికి ఉంచారు. మధ్యతరగతి, ఉన్నత వర్గాలు, వ్యాపారవేత్తలను దృష్టిలో ఉంచుకుని మంగళం, వేదాంతపురం,



చెన్నాయగుంట పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఎంఐజీ, ఎల్ఐజీ, హెచ్ఐజీ, ప్రీమియం లేఅవుట్లలో ఖాళీగా ఉన్న వందలాది పాట్లను విక్రయించేశారు. భవిష్యత్ అవసరాల కోసం రిజర్వు చేసుకున్న రేణిగుంట మండలంలోని సూరప్పకశం వద్ద గల 145 ఎకరాల స్థలాన్ని లేఅవుట్లుగా మార్చి విక్రయాలు ప్రారంభించి రూ.345 కోట్ల ఆదాయ అంచనాలతో విక్రయాలు చేపట్టారు. చివరకు రూ.400 కోట్ల నిధులను ఎన్నికల ప్రయోజనాలే లక్ష్యంగా గత పాలకులు ఇష్టానుసారం ఖర్చు చేయడంతో చివరకు తుడా దివాలా తీయాల్సి వచ్చింది.

**సంపాదన వేటలో..**

తుడాకు సాధారణంగా అద్దెలు, భవన నిర్మాణ అనుమతులు, లేఅవుట్ల అనుమతుల రూపేణ వచ్చే ఆదాయం రూ.15 కోట్ల వరకు ఉండగా వాటితో చేపట్టే అభివృద్ధి పనుల్లో మిగిలేది శూన్యమని భావించారు గత పాలకులు. అందుకే తుడా ఆస్తులపై పడ్డారు. ప్రజల్లో ఉన్న నమ్మకం, సౌలభ్యం కారణంగా వాటికి గిరాకీ కనిపించడంతో సులువుగా సంపాదించేందుకు వాటి విక్రయాలే శరణ్యమని భావించి ఆచరణలోకి పెట్టారు.

**ల్యాండ్ బ్యాంక్ ప్రతిపాదనలు**

తుడా మనుగడ సాగించేందుకు స్థలాలు కొనుగోలు చేసి వాటిని లేఅవుట్లుగా మార్చి మధ్య, ఎగువ తరగతి ప్రజలకు విక్రయించడం తప్పనిసరి. ఈ క్రమంలో ల్యాండ్ బ్యాంకు సిద్ధం చేయాలన్న ప్రతిపాదనలున్నాయి. గత ప్రభుత్వంలో వడమాలపేట సమీపంలోని ఎస్వీనగర్ వద్ద ప్రభుత్వ భూమిని తుడా స్వాధీనం చేసుకోగా.. మిగిలిన నియోజకవర్గాల్లో అడుగు ముందుకు పడలేదు. వీటిని లేఅవుట్లుగా మార్చి ప్రజలకు విక్రయిస్తే తప్ప తుడా మనుగడ సాగించే పరిస్థితి కనిపించడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# సాంకేతిక బలం.. కొలువుల నెలవు

ఏర్పేడు : ఐఐటీలో విద్యనభ్యసించాలన్నది ప్రతి విద్యార్థి కల. అయితే ప్రస్తుత పోటీ ప్రపంచంలో కష్టాలను అధిగమించి ఐఐటీలో గుర్తింపు పొంది సాంకేతిక నిపుణులుగా స్థిరపడి ఆదర్శంగా నిలుస్తున్నారు. తిరుపతి ఐఐటీ నుంచి పట్టా పొందిన పూర్వ విద్యార్థులు దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో కొలువులు సంపాదించారు.

**అక్షరాల అరకోటి సంపాదన**

మాది హైదరాబాద్ నాన్న రైల్వే ఉద్యోగి, అమ్మ గృహిణి. చిన్నప్పటి నుంచి ఐఐటీ చదవాలన్నదే తమ కల. ఈ క్రమంలోనే తిరుపతి ఐఐటీ నుంచి రెండేళ్ల కిందట పట్టా పొం దాను. విద్యనభ్యసిస్తున్న సమయంలోనే ప్రాంగణ ఎంపికల్లో బెంగళూరుకు చెందిన ప్రముఖ సంస్థ లో ఉద్యోగం లభించింది. ప్రస్తుతం ఏడాదికి రూ.50లక్షలు సంపాదిస్తుండటంతో ఆనందానికి హద్దుల్లేవు.

**వ్యవసాయ కుటుంబం నుంచి**

విజయనగరంలోని కొర్లాం గ్రామంలో వ్యవసాయ కుటుంబం మాది. అమ్మ, నాన్నలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నప్పటికీ ఐఐటీ చదివించాలన్నదే వారి కల. ఆశయాలకు తగ్గట్లుగానే నేను కష్ట పడటంతో తిరుపతి ఐఐటీలో గత ఏడాది విద్యను పూర్తి చేశాను. ప్రాంగణ ఎంపికల్లో గురుగ్రామ్‌లోని సంస్థలో ఉద్యోగం లభించడంతో అమ్మ, నాన్నల కష్టానికి ప్రతి ఫలం దక్కింది.




**హైదరాబాదీగా గుర్తింపు**

మాది రాజస్థాన్ అయినప్పటికీ తిరుపతి ఐఐటీలో సీటు రావడంతో ఇక్కడే చదువు పూర్తిచేశా. రెండేళ్ల కిందట బీటెక్ చదువుతున్న సమయంలోనే ప్రాంగణ ఎంపికల్లో హైదరాబాద్‌కి చెందిన ప్రముఖ సంస్థలో ఉద్యోగం వచ్చింది. దీంతో ఏడాదికి రూ.35లక్షలకు పైగా సంపాదిస్తున్నా. నేను హైదరాబాద్ కుర్రాడిగా గుర్తింపు పొందా.

**రాష్ట్రాలు వేరైనా స్నేహం ఒక్కటే**

మాది ప్రయాగ్‌రాజ్ ఐఐటీలో చదువు పూర్తికాగానే గురుగ్రామ్‌లోని సంస్థలో ఉద్యోగం వచ్చింది. మా స్నేహితులంతా ప్రాంగణ ఎంపికల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడి నప్పటికీ నిత్యం ఆన్‌లైన్ వేదికగా విద్యార్థి దశలోని తీపి గుర్తులను స్మరించుకుంటూ ఉంటాం. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థు లైనప్పటికీ ఐఐటీలో ఏర్పడిన స్నేహబంధం మరువలేనిది.

# 'భూ'దస్త్రం.. కాసుల అస్త్రం



కర్నూలు : రెవెన్యూ అధికారులు భూ యజమానుల అవసరాలను బట్టి ఒక్కో పాసు పుస్తకానికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. నగర పరిధిలో, జిల్లా కేంద్రం సమీపంలో, పట్టణ ప్రాంతాల్లో విలువైన భూములైతే పట్టాదారు పాసు పుస్తకాలకు భారీగా వసూలు చేస్తున్నారు. ఇవ్వకపోతే తిరస్కరిస్తున్నారు. ఇదంతా తహసీల్దార్ల కనుసన్నల్లోనే జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

**ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో డిజిటల్ కీ**

తహసీల్దారు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు. అయితే వారిని కాదని కొందరు తహసీల్దార్లు తమ వ్యక్తిగత సహాయకులుగా కొందరు ప్రైవేటు కంప్యూటరు ఆపరేటర్లను పెట్టుకున్నారు. వారి చేతుల్లోనే తహసీల్దారు డిజిటల్ కీ ఉంటుంది. బేరం కుదిరి పైకం చేతికందితే ఆయన ఫోన్లు సమాచారం చేరవేస్తుంటారు. ఆపరేటర్ పనిచేసి పెడుతుంటారు. ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి డిజిటల్ కీ ఉంటుండటంతో ఆన్‌లైన్‌లో భూ రికార్డులను మార్చేస్తున్నారు.

**మ్యుటేషన్లకు ముడుపులు**

మ్యుటేషన్లకు దరఖాస్తు చేసుకున్న తర్వాత 24 గంటల్లోనే ఫారం-8 జనరేట్ చేయాలి. ఆ వెంటనే వీఆర్వో అమ్మకందారులు, కొనుగోలు దారులతోపాటు గ్రామ సచివాలయం, పంచాయతీ కార్యాలయం బోర్డులో నోటీసులు ప్రదర్శించాలి. నోటీసులు ఇవ్వడం లేదు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించడం లేదు ముడుపులిస్తే చాలు ఒక్కరోజులోనే పని చేసిపెడుతున్నారు. పూర్వీకుల పేర్లపై ఉన్న భూములను తమ పేరిట మ్యుటేషన్ చేయాల ంటూ పలువురు రైతులు దరఖాస్తు చేసుకుంటున్నారు.

ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతు న్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో పేర్లు ఎక్కించడం లేదు. తన తండ్రి పేరుతో ఉన్న రెండెకరాలను ఓ రైతు తన పేరుపై మార్చుకున్నారు. పాసు పుస్తకం కోసం వీఆర్వోను కలిశారు. దరఖాస్తు చేసి పాసు పుస్తకం ఇప్పిస్తానని.. దరఖాస్తు చేశాక రూ.10 వేలు, పని పూర్తైన వెంటనే మరో రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చివరికి రాజకీయ నాయకుడితో చెప్పిస్తే రూ.10 వేలు తగ్గించారు. ఇలా రెవెన్యూ శాఖలో అక్రమాలు వెళ్లూనుకుపోయింది. పాసు పుస్తకాలు, భూ కొలతలకు సంబంధించి ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదు దారుడికి ప్రభుత్వం ఫోన్ చేయించి సమస్యలు తెలుసుకుంటోంది. ఈ క్రమంలో రెవెన్యూ అధికారుల తీరు వెలుగులోకి వచ్చింది.

# పార్కింగ్ సిద్ధం.. భద్రత కట్టుదిట్టం




శ్రీశైలం : జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. వేడుకలకు లక్షలాదిమంది భక్తులు కార్లు, జీపులు, బస్సులు, ఇతర వాహనాల్లో శ్రీగిరికి చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో వేల సంఖ్యలో వచ్చే వాహనాలను ప్రణాళికాబద్ధంగా పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించేందుకు దేవస్థానం అధికారులు చర్యలు చేపట్టారు. బస్సులకు, కార్లకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశారు.

**3,640 బస్సులకు చోటు**

బస్సుల పార్కింగ్ కోసం మొత్తం 13.80 ఎకరాల స్థలాన్ని సిద్ధం చేశారు. ఇందులో 3,640 బస్సులను నిలిపేందుకు అవకాశం ఉంది. గణేశ్ సదన్ ఎదురుగా ఏపీఎస్ ఆర్టీసీ, టీఎస్ ఆర్టీసీ, కర్ణాటక ఆర్టీసీ బస్టాపులను ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో భక్తులకు అన్ని వసతులు కల్పించారు. శ్రీశైలం వచ్చే వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లోకి మళ్లించడంతో పాటు ట్రాఫిక్‌జామ్ కాకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి క్రేన్లు, మూవింగ్ వాహనాలను సిద్ధం చేశారు. శ్రీశైల క్షేత్రంలో 6 కి.మీ మేర రెండు వరుసలున్న వలయ మార్గంలో ఒక వరుసలో కార్లు నిలిపేందుకు అవకాశం కల్పించనున్నారు. వాహనాలు క్రమపద్ధతిలో రాకపోకలు సాగించేందుకు వీలుగా ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ప్రీకాస్ట్ డివైడర్లను ఏర్పాటు చేశారు.

**కార్లు.. జీపులకు**

కార్లు, జీపుల పార్కింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 25.20 ఎకరాల స్థలాలు గుర్తించారు. ఇందులో 5,050 వాహనాలు నిలిపే అవకాశం ఉంది. గణేశ్ సదన్ పశ్చిమం వైపు, సెంట్రల్ పార్కింగ్ కేంద్రం, ఫిల్టర్‌బెడ్ వద్ద, హెలిప్యాడ్, విభూతి మఠం, మల్లమ్మ కన్నీరు, గురు సదన్ సమీపంలో, ఆగమ పాఠశాల ఎదురుగా, ఆర్టీసీ బస్టాండు వెనుక, వాసవీ విహార్ పక్కన పార్కింగ్ ప్రదేశాలను సిద్ధం చేశారు. పార్కింగ్ ప్రదేశాల వద్ద హైమాస్ట్ విద్యుద్దీపాలు, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు కల్పించారు.

**అన్నివైపులా నిఘా**క్షేత్రంలో బందోబస్తు పర్యవేక్షణకు 581 సీసీ కెమెరాలను అమర్చారు. అన్నపూర్ణ భవన్ వద్ద ఉన్న దేవస్థానం సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్ రూంను ఆధునికీకరించారు. 21 ఎల్ఈడీ తెరల ద్వారా అన్ని సీసీ కెమెరాల దృశ్యాలను వీక్షించే ఏర్పాట్లు చేశారు. పీటీజెడ్ కెమెరాలు 20, భక్తుల సంఖ్య (ఆలయం లోపల)ను లెక్కించే కెమెరాలు 5, స్టాటిక్ టైప్ సీసీ కెమెరాలు 553, వాహనాల నంబర్లను గుర్తించే సీసీ కెమెరాలు 3 ఏర్పాటు చేశారు. శిఖరేశ్వరం, ముఖద్వారం, కైలాస ద్వారం, హఠకేశ్వరం, సాక్షి గణపతితో పాటు పాతాళగంగ స్నానఘాట్ల వరకు అన్ని ప్రదేశాలను సీసీ కెమెరాలు బిగించారు.

# సొంత ఆదాయ వనరులేవీ?

విజయనగరం : జిల్లా పరిషత్తుకు సాధారణ నిధులే ప్రధాన ఆదాయ వనరు. ప్రభుత్వం నుంచి వచ్చే తలసరి గ్రాంటు, సీనరేజీ, స్టాంప్‌డ్యూటీ వీటిలో ప్రధానమైనవి. పెరిగిన జనాభాకు అనుగుణంగా వీటి కేటాయింపు లేక ఆదాయంలో ఏటా హెచ్చుతగ్గులు వస్తున్నాయి. ఉన్న వనరుల్లో స్టాంప్‌డ్యూటీ సర్‌ఛార్జి స్థిరాస్తి వ్యాపారంపై ఆధారపడుతోంది. గడిచిన రెండేళ్లుగా ఆశించిన స్థాయిలో రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తంలో గ్రామ పంచాయతీలకు 50 శాతం, మండల, జడ్పీలకు 25 శాతం చొప్పున సమకూరే అవకాశముంది. గత ప్రభుత్వ విధానాలు నిధులపై తీవ్ర ప్రభావం చూపాయి. 2011 జనాభా ప్రాతిపదికగా నిధుల కేటాయిస్తున్నారు. అప్పటి గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 28.56 లక్షలు కాగా ఇప్పుడు 33 లక్షలకు చేరుకుందని అంచనా. పెరిగిన జనాభా బట్టి కేటాయిస్తే గానీ ఆదాయం పెరిగే పరిస్థితి లేదు. అయిదేళ్లలో సగటు ఆదాయం రూ.7.83 కోట్లు మాత్రమే. ప్రభుత్వ పరంగా వచ్చే గ్రాంట్లు మినహాయిస్తే స్థానికంగా ఉన్న అతిథి గృహం, సమావేశమందిరం, కొత్తవలస దుకాణ సముదాయం, వారపు సంత వేలం ద్వారా వచ్చిన ఆదాయమే దిక్కవుతోంది. జడ్పీ ప్రవేశద్వారం ముందు గత ప్రభుత్వంలో రెండు దుకాణాల నిర్మాణ ఆదాయం తప్ప సొంత ఆదాయ వనరులు పెంచేందుకు ఎలాంటి తీసుకోలేదు. దీంతో అభివృద్ధి కుంటుపడుతోంది.

**ఆదాయమొస్తేనే కేటాయింపులు..**

ఎస్సీ, ఎస్టీ, మహిళా శిశు సంక్షేమం, రహదారులు, తాగునీరు, ప్రోత్సాహకాలు, నిర్వహణ ఖర్చులు, విరాళాలకు మొత్తం తొమ్మిది రకాల పద్దుల కింద బడ్జెట్‌ను ఖర్చుచేసేలా ప్రతిపాదిస్తారు. ఆదాయంపైనే వీటికి కేటాయింపులు ఆధారపడి ఉన్నాయి.



కరోనాతో రెండేళ్లు రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో ఆదాయం కోల్పోవాల్సి వచ్చింది. తర్వాత స్థిరాస్తి వ్యాపారం ఊపందుకోవడంతో 2022-23లో రికార్డుస్థాయిలో రూ.17,27,07,740 ఆదాయం లభించింది. ఈ మొత్తంలో రూ.14.55 కోట్లు స్టాంప్‌డ్యూటీ రూపంలో వచ్చింది. తర్వాత మళ్లీ తగ్గుముఖం పట్టింది. 2024-25లో రూ.2.41 కోట్లు మాత్రమే వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

గత ప్రభుత్వం ఇసుక అమ్మకాలు చేపట్టింది. సీనరేజీ రూపంలో స్థానిక సంస్థలకు ఆదాయం రావాలి. ఇవి నేరుగా రాష్ట్ర ప్రభుత్వానికి వెళ్లిపోవడంతో ఎంత అమ్మకాలు జరిగాయి? సీనరేజీ ఎంత అన్నదానిపై స్పష్టత లేకుండా పోయింది. **కూటమి సర్కారులో..**కూటమి ప్రభుత్వం వచ్చాక 2024-25లో ఇప్పటివరకు రూ.7.75కోట్లు ఆదాయం వచ్చింది. స్టాంపు డ్యూటీ రూ.2.41కోట్లు, సీనరేజీల రూపంలో రూ.4.39 కోట్లు, తలసరి గ్రాంటు రూ.89.77 లక్షలు విడుదల చేసింది. మిగిలినది కొత్తవలస దుకాణ సముదాయం, సంత, జడ్పీ అతిథిగృహం, సమావేశమందిరం అద్దె రూపేణా వచ్చినట్లు జడ్పీ ఉప సీఈవో వెంకటరామన్ తెలిపారు. మార్చి నెలాఖరుకు మరో రూ.కోటి వచ్చే అవకాశముందని భావి స్తున్నారు.

# కూడలిలో కుంపటి

కర్నూలు : ఫిబ్రవరిలోనే సూర్యుడు మండిపోతున్నాడు.. ఆదివారం గరిష్ఠ ఉష్ణోగ్రత 38 డిగ్రీలు దాటింది.. ఎండ తీవ్రతకు జనం ఉక్కిరిబిక్కిరయ్యారు. ఉదయం పది గంటలకే బయట కాలు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఈ వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశముందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో విపత్తుల నిర్వహణ సంస్థ ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగానికి సూచనలు జారీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఒక్క సమీక్ష నిర్వహించలేదు.. కార్యాచరణ ప్రణాళిక రూపొందించలేదు. గతేడాది రికార్డు స్థాయిలో 48 డిగ్రీల ఉష్ణోగ్రతలు



నమోదయ్యాయి. ఏటా వడదెబ్బతో పదుల సంఖ్యలో జనం మృతి చెందుతున్నారు. ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో వైద్య, ఆరోగ్య శాఖ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా షేడ్ నెట్‌లు, ప్రథమ చికిత్స కిట్లు సరఫరా చేయాల్సి ఉంది. గనులు తవ్వే ప్రాంతంలో కార్మికులకు అవగాహన కల్పించాలి. ఇప్పటి వరకు చేపట్టలేదు. కర్నూలు, నంద్యాల జిల్లా కేంద్రాల్లో ట్రాఫిక్ సిగ్నళ్ల వద్ద చలువ పందిళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మున్సిపాలిటీలు చొరవ తీసుకోవాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రణాళిక రూపొందించలేదు. రోడ్లపై ఉంటున్న అవగాహన కల్పించి వసతి కల్పించాలి.

# జొన్న రైతుల వెలవెల

నంద్యాల : జొన్న ధరలు పతనం కావడం.. ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది కేసీ, ఎస్సార్బీసీ, తెలుగు గంగ కాల్వలు నిండుగా ప్రవహిస్తున్నాయి. రైతులు వరితోపాటు జొన్న సాగు చేశారు. సాధారణ సాగు విస్తీర్ణం 30,230 హెక్టార్లు కాగా ప్రస్తుతం 23,207 హెక్టార్లలో సాగైంది. ఈ ఏడాది క్వింటాకు మద్దతు ధర రూ.3,370 ప్రకటించారు. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. ఎకరాకు 25- 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. గతేడాది ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున ప్రభుత్వం కొనుగోలు చేసింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2,400 ధర పలుకుతోంది. ప్రభుత్వం కొనుగోళ్లు చేస్తే క్వింటాకు రూ.1000 ధర అధికంగా వస్తుంది. ఎకరాకు రూ.20 వేల చొప్పున



ఐదు ఎకరాలకు రూ.1 లక్ష అదనంగా ఆదాయం వస్తుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు విన్నవిస్తున్నారు. " జిల్లాలో 50 వేల క్వింటాళ్ల జొన్న దిగుబడులు కొనుగోళ్లు చేయాలని జేసీ విష్ణుచరణ్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే కొనుగోళ్లు చేపడతామని" మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ కె.హరినాథరెడ్డి పేర్కొన్నారు.

**ప్రభుత్వం ఆదుకోవాలి : బాలన్న, కోవెలకుంట్ల**

తుపాను కారణంగా మూడుసార్లు విత్తనం వేయడంతో పెట్టుబడి పెరిగింది. దిగుబడి తగ్గింది. సరైన ధర లేదు. బయటి మార్కెట్‌లో కొనుగోలు చేయట్లేదు. ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలి.

# రండి.. గురుకులాలు పిలుస్తున్నాయ్!

నెల్లిమర్ల : ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 10 మహాత్మా జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల్లో 2025- 26 విద్యా సంవత్సరానికి అయిదో తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 5 బాలికలు, 5 బాలుర పాఠశాలల్లో 680 మంది ప్రవేశాలకు అవకాశాలు కల్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులు. ప్రత్యేక ప్రవేశ పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నారు.

అర్హతలు..: బీసీ, ఈబీసీ ఇతర విద్యార్థులు 11 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీలు 12 ఏళ్ల లోపు వయసు కలిగి ఉండాలి. అభ్యర్థుల తల్లిదండ్రులు, సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.లక్షకు మించకూడదు. పాత జిల్లాల ప్రకారం గురుకుల పాఠశాలలో ప్రవేశానికి ఆ జిల్లాలోనే చదువుతూ ఉండాలి.

**దరఖాస్తు విధానం..:** అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రూ.100 పరీక్ష రుసుం చెల్లించాలి. %https://mjpapbcwreis.apcfss.in% వెబ్‌సైట్‌లో 2025 ఫిబ్రవరి 15 నుంచి మార్చి 15 లోగా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

**సదుపాయాలు..:** ఉచిత వసతి, గురుకుల విధానంలో చదువుకునే అవకాశం. పౌష్టిక విలువలతో కూడిన భోజనం. మూడు జతల ఏకరూప దుస్తులు. దుప్పటి లేక జంకాన. బూట్లు, సాక్స్‌లు, టై, బెల్టు, నోట్, పాఠ్య పుస్తకాలు. కాస్మోటిక్ ఛార్జీలు. సమీకృత పౌష్టికాహారంలో భాగంగా రోజూ వేరుసెనగ చిక్కీ. వారానికి ఆరు రోజులు గుడ్లు. రెండు రోజుల పాటు భోజనంలో చికెన్ ఉంటుంది.

**ఆంగ్ల మాధ్యమంలో విద్య..**

జ్యోతిబాపులే గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలో ఉన్నతమైన బోధనాభ్యాసాలు ఉంటాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంచి పౌష్టికాహారం అందజేస్తాం. క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్య అందించేందుకు ఉత్తమమైన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఉన్నారు. విద్యార్థులు అవకాశాన్ని వినియోగించుకోవాలి. బీబీ.రావు, మహాత్మా జ్యోతిబాపులే జిల్లా కన్వీనర్

# అభివృద్ధి చేస్తే.. ఆధ్యాత్మిక పర్యాటకం సాకారం

సింహాచలం : శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామి కొలువుదీరిన సింహాచలం క్షేత్రం ఆధ్యాత్మిక వైభవంతో భక్తులను.. చారిత్రక ప్రాంతాలతో పర్యాటకులను అలరిస్తోంది. ప్రధాన ఆలయంతో పాటు ఉత్తర దిక్కున ఉన్న శతాబ్దాల నాటి వైకుంఠవాసుల మెట్ట, శ్రీకృష్ణ దేవరాయలవిజయ స్తూపం చారిత్రక ఆనవాళ్లుగా శోభిల్లుతున్నాయి. ఇటీవల వైకుంఠవాసుల మెట్ట దరి కొండ శిఖరంపై నూతనంగా ఏర్పాటు చేసిన శంఖు చక్రాలు, తిరునామాల విద్యుద్దీపాలంకరణ భక్తులకు ప్రధాన సందర్శన ప్రాంతంగా మారిపోయింది.

సుమారు 800 అడుగుల ఎత్తైన కొండపై నుంచి దిగువన ఉన్న ప్రాంతాల విహంగ వీక్షణకు ఆదరణ లభిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రాంతాల గురించి విస్తృతంగా ప్రచారం జరగడంతో సందర్శకుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది.

ఇటీవల పలువురు యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్ కంటెంట్ క్రియేటర్లు డ్రోన్ కెమెరాలతో ఈ ప్రాంతాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కల్పించారు. దీంతో ఈ వ్యూపాయింటుకు సందర్శకుల



తాకిడి విపరీతంగా పెరిగింది.

**వసతులు మెరుగు పరిస్తే అద్భుతమే..**

ఒకే మార్గంలో ఉన్న ఈ ప్రాంతాల్లో వసతులు మెరుగుపరిస్తే ఆధ్యాత్మిక పర్యాటకం సాకారమవుతుందని పలువురు సందర్శకులు పేర్కొన్నారు. సింహగిరి ఘాట్రోడ్డులో కొండపైన లోవతోట సమీపం నుంచి ఈ ప్రాంతాలకు వెళ్లే మార్గం ఉంది. సుమారు 35ఏళ్ల క్రితం మైక్రోవేవ్ స్టేషన్ కోసం ఈ రోడ్డు నిర్మించారు. అప్పటి నుంచి ఎలాంటి నిర్వహణ లేకపోవడంతో రోడ్డు మొత్తం ధ్వంసమైపోయింది. ప్రధానంగా కేశఖండనశాల వెనుక ప్రాంతంలో కొండ మలుపు వద్ద రోడ్డు సందర్శకులను కట్టిపడేస్తుందంటే అతిశయోక్తి కాదు. కొండ గుహను తలపించేలా ఉండే రోడ్డులో ప్రయాణం సందర్శకులకు మరపురాని అనుభూతిని కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతాల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేసి చరిత్రను తెలియజేసే విధంగా వివరాలు పేర్కొంటే బాగుంటుందన్నారు. వ్యూపాయింట్లు నిర్మించి భద్రతా ఏర్పాట్లు చేస్తే అప్పన్న స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత అద్భుత మధురస్మృతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆలయ అధికా రులు, ప్రభుత్వం దిశగా ఆలోచనలు చేయాలని కోరుతున్నారు.


# అక్రమార్కులకు బన'వాసి'

ఎమ్మిగనూరు: సారవంతమైన నేల.. వందల ఎకరాలు ఖాళీగా ఉంది.. ఎకరా రూ.30 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు పలుకుతోంది.. పక్కనే తుంగభద్ర దిగువ కాల్వ ప్రవహిస్తోంది.. ఇంకేముంది అక్రమార్కులు కన్నేశారు.. రెండు వందల ఎకరాలకు వరకు ఆక్రమించి ఎంచక్కా పంటలు సాగు చేసుకొంటున్నారు.. పరిరక్షించాల్సిన పశు సంవర్ధకశాఖ అధికారులు తాఖీదులతో సరి పెట్టారు. సర్వే చేయాల్సిన రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.. కలెక్టర్ స్పందిస్తే తప్ప విలువైన భూములకు రక్షణ కంచె పడే పరిస్థితి కనిపించడం లేదు.

**స్పందించని రెవెన్యూ శాఖ**

ఇటీవల మరికొందరు ఆక్రమించే ప్రయత్నం చేశారు.. భూముల్లో ముళ్ల పొదలు తొలగించి చదును చేశారు. స్థానికులు కొందరు ఫిర్యాదు చేయడంతో పశు సంవర్ధకశాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 115 మందికి తాఖీదులు ఇచ్చి సరి పుచ్చారు.

సర్వే చేయాల్సిందిగా పశు సంవర్ధకశాఖ రెవెన్యూ అధికారులకు రెండు నెలల కిందట విన్నవించారు.. వారంలో పూర్తి చేస్తామని చెప్పారు.. ఇప్పటి వరకు కొలతలు వేయలేదు..



రూ.కోట్ల విలువైన భూములకు కంచె వేయకుంటే మరింత ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉంది... ఉన్నతాధికారులు స్పందించి సర్వే చేసి రక్షణ కంచె బిగించాలని స్థానికులు కోరుతున్నారు.

**ఖాళీ స్థలంపై కన్నేశారు**

ఎమ్మిగనూరు మండలం బనవాసిఫారానికి సంబంధించి రెండువేల ఎకరాల పొలం ఉంది. ఇక్కడ గతంలో పశుక్షేత్రం ఏర్పాటు చేశారు. దేశంలో పేరుగాంచిన గేదెలు, ఆవులను పెంచేవారు. తర్వాత కనుమరుగైంది.. ఆ భూములన్నీ బీడుగా మారాయి.

ఐదువందల ఎకరాల్లో కృషి విజ్ఞాన కేంద్రం, ఆబోతు కేంద్రం, పశు సంవర్ధకశాక పాలిటెక్నిక్ కళాశాల, బాలికల పాఠశాల, జూనియర్ కళాశాల, నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

మిగిలిన భూములు ఖాళీగా ఉన్నాయి. ఖాళీ స్థలంలో అటవీశాఖ రూ.2 కోట్లు వెచ్చించి మొక్కలు నాటించింది. సంరక్షణ లేకపోవడంతో వాడిపోయాయి.

**అక్రమంగా నీటి మళ్లింపు**


బీడుగా ఉన్న బనవాసిఫారం భూముల్లో పరమాన్‌దొడ్డి, నక్కలమిట్ట, వెంకటగిరి, బోడబండ, మల్కాపురం, బనవాసి, చెన్నాపురానికి చెందిన కొందరు పాగా వేశారు.

భూముల మధ్య భాగం నుంచే తుంగభద్ర దిగువ కాల్వ వెళ్తోంది.. ఆ నీటిని మళ్లించుకొని మిరప, పత్తి, మొక్కజొన్న, వేరుసెనగ వంటి పంటలు సాగు చేస్తున్నారు.

సమీపంలో ఎకర భూమి కౌలు తీసుకోవాలంటే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. బనవాసిఫారం భూములు సారవంతమైనవి కావడంతో మంచి దిగుబడులు వస్తున్నాయి.

ఈ భూముల పక్కనే జాతీయ రహదారి వెళ్తోంది.. రహదారి పక్కన అయితే ఎకరా రూ.కోటి వరకు పలుకుతోంది.. లోపల రూ.30 లక్షల వరకు పలుకుతోంది.

# నైపుణ్య కౌశలం.. కొలువుల సౌరభం



పత్తికొండ : నిరుద్యోగ యువతలో నైపుణ్యం పెంచి, వారికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో శిక్షణ నైపుణ్య కేంద్రం (స్కిల్ డెవలప్‌మెంట్ హబ్) ఏర్పాటు చేశారు. పేద, మధ్య తరగతి యువతకు ఉపయుక్తంగా ఉంది. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదువులు పూర్తిచేసిన గ్రామీణ ప్రాంత యువతీ యువకులు కంప్యూటర్ ఇతర నైపుణ్య శిక్షణ పొందేందుకు దూరప్రాంతాలకు వెళ్లాలంటే వారికి సవాలే. కర్నూలు జిల్లాలో మొత్తం 8 శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరవుకు నిలయమైన పత్తికొండ లాంటి వెనుకబడిన ప్రాంతంలో వందలాది మంది గ్రామీణ విద్యార్థులు చదువుకు మధ్యలోనే స్వస్తి పలుకుతున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక వ్యవసాయ కూలీలుగా మారిపోతున్నారు. మరి కొందరు పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో వారిలో ఆత్మస్థైర్యం నింపుతూ స్వయం ఉపాధితో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రధాన మంత్రి కౌశల్ యోజన ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా శిక్షణ కేంద్రాల నిర్వహణకు శ్రీకారం చుట్టాయి.

**స్థానికంగానే తర్ఫీదు**

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో రెండేళ్ల కిందట ప్రారంభమైన స్కిల్ హబ్‌లో పది, ఇంటర్, డిగ్రీ పూర్తిచేసిన 18-40 ఏళ్ల నిరుద్యోగులకు శిక్షణ కొనసాగుతోంది. కంప్యూటర్ శిక్షణలో డేటా ఎంట్రీ, ఎంఎస్ ఆఫీస్, కమ్యునికేషన్ స్కిల్స్, సీఆర్ఎం డొమెస్టిక్, ఆంగ్ల వ్యాకరణంలో పట్టు సాధించేలా తర్ఫీదు ఇస్తున్నారు. కూటమి ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి సంస్థల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటి వరకు 250 మందికి పైగా శిక్షణ పూర్తిచేశారు. శిక్షణ పూర్తిచేసిన వారు నాలుగు సార్లు నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఆయా సంస్థలు, లిమిటెడ్ కంపెనీల్లో వంద మందికి పైగా ఉద్యోగాల్లో చేరారు. దూర ప్రాంతాలకు వెళ్లకుండా కర్నూలు, అనంతపురం, గుంతకల్లు, ఆదోని లాంటి ప్రాంతాల్లోనే పలువురు కొలువులు పొందారు.

**బయట రూ.వేలు ఖర్చు చేయాలి- వీణ, విరుపాపురం, డిగ్రీ తృతీయ సంవత్సరం**

కళాశాలలో డిగ్రీ చదువుతూనే మధ్యాహ్నం వేళలో కంప్యూటర్ శిక్షణ తీసుకుంటున్నా. మా నాన్న కృష్ణ రైతు. రోజూ విరుపాపురం నుంచి వచ్చి శిక్షణ పొందుతున్నా. బయట కంప్యూటర్ కోర్సు నేర్చుకోవాలంటే.. వేలకు వేలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి. కళాశాలలోనే స్కిల్‌హబ్ కేంద్రంలోనే అవకాశం సద్వినియోగం చేసుకుంటున్నా. ప్రస్తుతం ఏ చిన్న ఉద్యోగానికి వెళ్లాలన్నా కంప్యూటర్‌పై అవగాహన తప్పనిసరి. నేర్చుకున్న మెలకువలు ఎంతో ప్రయోజనకరంగా ఉంటున్నాయి.

**ఆంగ్లంపై పట్టుతో..- పవిత్ర, డిగ్రీ తృతీయ సంవత్సరం, పత్తికొండ**

పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతూనే.. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నా. నా భర్త ప్రైవేటు ఉద్యోగి. ప్రస్తుతం ఇద్దరు సంపాదిస్తేనే కుటుంబం గడుస్తుంది. కంప్యూటర్‌తో పాటు ఆంగ్ల భాషలో కఠినంగా అనిపించే గ్రామర్ ఎంతగానో దోహదపడుతోంది. ఆంగ్లంపై పట్టు ఉంటే ఉద్యోగ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చు.

**శిక్షణతోనే కొలువుకు ఎంపిక- చిరంజీవి, హొసూరు**

అమ్మానాన్ని లక్ష్మి, మురళి వ్యవసాయ కూలీలు. కంప్యూటర్ విభాగంలో పట్టు సాధించా. గత నెలలో నిర్వహించిన ఉద్యోగ మేళాలో ఉద్యోగానికి ఎంపికయ్యా. మన చేతిలో నైపుణ్యం ఉంటే.. ఎక్కడైనా కొలువు దక్కుతుందనేది తెలిసింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇప్పటి నుంచే ఆర్థిక క్రమశిక్షణ అలవుడుతుంది. ఉపాధితో ముందుకు సాగొచ్చు.

**రెండేళ్లలో 260 మందికి శిక్షణ- అల్తాఫ్, నైపుణ్యాభివృద్ధి సంస్థ సమన్వయకర్త, పత్తికొండ**

పత్తికొండలో రెండేళ్ల కిందట ప్రారంభమైన నైపుణ్య శిక్షణలో భాగంగా 13 బ్యాచ్‌లకు సంబంధించి 250 మందికిపైగా శిక్షణ ఇచ్చాం. పత్తికొండ చుట్టు పక్కల మండలాల నుంచి శిక్షణకు వస్తున్నారు. శిక్షణ పూర్తిచేసిన వారిలో పలువురికి ఉద్యోగమేళాలో పలు కంపెనీల్లో ఉద్యోగాలు వచ్చాయి. మరి కొంత మంది త్వరలో ఉద్యోగాల్లో చేరనున్నారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతకు ఈ శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. త్వరలో మరో బ్యాచ్ ప్రారంభం కానుంది. యువత సద్వినియోగం చేసుకోవాలి.

# చేపల పెంపకం..అక్రమాల పంపకం



పాణ్యం : సంపాదనే ధ్యేయంగా కొందరు ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారు. అక్రమంగా చెరువులు తవ్వి.. అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తూ చేపలు పెంపకం చేపడుతున్నారు. గడివేముల మండలం గడిగరేవుల, తిరుపాడు, కొరటమద్ది, దుర్వేశి గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో చేపల చెరువులు తవ్వారు.. చాగలమర్రి మండలంలోనూ పెద్దఎత్తున చేపల పెంపకం కొనసాగిస్తున్నారు. చేపల పెంపకానికి మత్స్య, రెవెన్యూ, విద్యుత్తుశాఖల అధికారుల అనుమతులు ఉండాలి. చాలా చోట్ల అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారు. నదిలో నీటిని వాడుకుంటూ.. విద్యుత్తు చౌర్యానికి పాల్పడుతున్నారు. చేపలకు ప్రత్యేక దాణా వేయాలంటే ఖర్చవుతుందని భావించి.. కోడి మాంసం వ్యర్థాలు వేస్తున్నారు. వీరి అక్రమాల కారణంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడటంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**విద్యుత్తు చౌర్యం.. అక్రమ నీటి వినియోగం**

చేపల చెరువుల కోసం ప్రత్యేకంగా విద్యుత్తు కనెక్షన్లు తీసుకోవాలి. వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు ఏర్పాటు చేసుకొని కుందూనది నుంచి అక్రమంగా నీటిని తోడేస్తున్నారు. విషయం తెలిసినా ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యజమానుల నుంచి డబ్బులు తీసుకుని కొందరు సిబ్బంది సహకరిస్తున్నట్లు ఆరోపణలు ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల విజిలెన్స్ అధికారులు దాడులు చేసి అక్రమంగా విద్యుత్తు వినియోగిస్తున్న చేపల చెరువుల యజమానులకు సుమారు రూ.8 లక్షల జరిమానా విధించారు.

**రొయ్యలూ పెంచేస్తున్నారు**

గడిగరేవుల గ్రామ పరిధిలో రొయ్యల సాగు అక్రమంగా కొనసాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండానే రొయ్యలు పెంచుతున్నారు. దీని గురించి మత్స్యశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. జిల్లాలో రొయ్యల సాగుకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇక్కడ మాత్రం నాలుగేళ్లుగా సాగు చేపడుతున్నా.. ఇంతవరకు అధికారులు ఇటువైపు తొంగిచూసిన దాఖలాల్లేవు.

**కోళ్ల వ్యర్థాలే దాణా**

చేపలకు దాణాగా మిల్లెట్, వేరుసెనగ చెక్క, జొన్నపిండి, మొక్కజొన్నపిండి, తవుడు వంటి పదార్థాలు వేయాల్సి ఉంది. వీటి ధర అధికంగా ఉందని చేపల పెంపకందార్లు అడ్డదారులు తొక్కుతున్నారు.

చికెన్ దుకాణాల్లో లభించే కోడిమాంసం వ్యర్థాలు, చనిపోయిన కోళ్లను చేపలకు ఆహారంగా వేస్తున్నారు.

కుళ్లిపోయిన వ్యర్థాలు తిన్న చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల ప్రజల ఆరోగ్యంపై దుష్ప్రభావాలు ఉంటాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. కోళ్ల వ్యర్థాలను తరలించేందుకు ప్రత్యేకంగా ఒక ముఠా తయారైంది.

నంద్యాల పట్టణంలోని గొర్రెల సంత వద్ద అడ్డా ఏర్పాటు చేసుకొని చేపల చెరువులకు కోళ్ల వ్యర్థాలను తరలిస్తున్నారు. అధికారుల కళ్ల ముందే ఈ దందా జరుగుతున్నా పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**తాఖీదులు జారీ చేశాం : వీరరాఘవరెడ్డి, జిల్లా మత్స్యశాఖ అధికారి**

జిల్లాలో రొయ్యల పెంపకం కోసం ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. చేపల చెరువుల్లో కొన్నింటికే అనుమతులు ఉన్నాయి. అక్రమంగా చేపలు పెంచుతున్న వారికి స్థానిక రెవెన్యూ అధికారుల ద్వారా నోటీసులు ఇచ్చాం. చేపలకు ఆహారంగా కోళ్ల వ్యర్థాలు వేయరాదు. వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

# భూవిలువ సవరణకు సన్నద్ధం


కర్నూలు : వైకాపా హయాంలో భూములు, స్థలాల విలువలు అడ్డగోలుగా పెంచారు. మార్కెట్ విలువ కంటే తక్కువగా ఉండాల్సింది పోయి రెండు నుంచి మూడు రెట్ల వరకు భారం మోపారు. వాటిని సవరించాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. ఫిబ్రవరి 1వ తేదీన సవరించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ సన్నద్ధమవుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్నిచోట్ల 10 శాతం నుంచి 15 శాతం వరకు భూముల విలువలు పెరిగే అవకాశాలున్నాయి. ఉమ్మడి జిల్లాలో కర్నూలు నగరపాలక సంస్థతోపాటు నంద్యాల, ఆదోని, డోన్, ఎమ్మిగనూరు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు, ఆత్మకూరు, గూడూరు, బేతంచెర్ల పురపాలక సంఘాలు ఉన్నాయి. కుడా పరిధిలో 53 మండలాలు, 896 గ్రామాలున్నాయి. అర్బన్, గ్రామీణ కమిటీ సూచనల ఆధారంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో భూముల విలువలు సవరించనున్నారు. అర్బన్ కమిటీ ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ వ్యవహరిస్తుండగా జడ్పీ సీఈవో, పురపాలక కమిషనర్లు, సబ్ రిజిస్ట్రార్లు సభ్యులుగా ఉన్నారు. రూరల్ కమిటీకి ఆర్డీవోలు ఛైర్మన్‌గా, సభ్యులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కన్వీనర్లుగా సబ్ రిజిస్ట్రార్లు వ్యవహరిస్తున్నారు. భూములు, స్థలాల విలువల సవరణకు రంగం సిద్ధమవుతున్న ఈ నేపథ్యంలో జిల్లా స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ ఇన్‌ఛార్జి జిల్లా రిజిస్ట్రార్ చెన్నకేశవరెడ్డి శుక్రవారం నగరంలోని కార్యాలయంలో కర్నూలు జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో సమావేశమయ్యారు. ఏ ప్రాంతంలో ఎంతమేర పెంచాలన్న అంశంపై చర్చించారు. అనంతరం కమిటీ సభ్యుడైన జడ్పీ సీఈవో నాసరరెడ్డిని కలిసి ప్రతిపాదనల నివేదికలో సంతకం తీసుకున్నారు. ఈనెల 25న చివరిగా జేసీతో సమావేశమై భూములు, స్థలాల సవరణకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో పలు ప్రాంతాల్లో అడ్డగోలుగా పెంచిన భూములు, స్థలాల విలువలు తగ్గే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి.



# పన్నుల పక్కదారికి చెక్

ఆళ్లగడ్డ : పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. పన్నుల వసూలులో పారదర్శకత ఉండేలా నగదు రహిత చెల్లింపుల విధానం అమలుకు ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటికే పంచాయతీ కార్యదర్శుల పేరిట యూనియన్ బ్యాంకులో ప్రత్యేక ఖాతాలు తెరిపించారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 973 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఏటా రూ.80 కోట్ల వరకు పన్నులు వసూలు చేస్తున్నారు.. వాటికి లెక్కా పత్రం లేకుండా పోయింది. కొందరు సిబ్బంది స్వాహా చేస్తున్నారు. ఆలూరు మేజరు పంచాయతీలో గతంలో ఇంటి, నీటి కుళాయి పన్నుల రూపంలో వచ్చిన రూ.32 లక్షల్ని ఉద్యోగి సొంతానికి వాడేశారు. పత్తికొండ మేజరు పంచాయతీలోనూ గతంలో ఒక ఉద్యోగి ఏకంగా రూ.40 లక్షల పంచాయతీ ఆదాయాన్ని పక్కదారి పట్టించారు. అధికారులు విచారణ జరిపి అందులో రూ.30 లక్షల వరకు రికవరీ చేశారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతో నగదు



రహిత చెల్లింపుల ప్రక్రియకు స్వీకారం చుట్టారు. క్యూఆర్ కోడ్, పీవోఎస్ పరికరాలను పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చారు. అయిదువేల మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలకు రెండు, తక్కువ ఉన్న గ్రామాలకు ఒకటి చొప్పున క్యూఆర్ కోడ్, పీవోఎస్ పరికరాలను అందించారు. ఇంటి, కుళాయి పన్నులు, ఇంటి ప్లానింగ్, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల రుసుముతో పాటు ఇతర వాటికి డిజిటల్ పద్ధతిలో వసూలు చేస్తారు." గతంలో డిజిటలైజేషన్ చెల్లింపుల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా చేపట్టలేకపోయాం. ఈసారి మాత్రం అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని" కర్నూలు డీపీవో భాస్కర్ పేర్కొన్నారు.

# పల్లె సీమలకు స్వచ్ఛత

కర్నూలు : పల్లె సీమలు ఆహ్లాదకరంగా ఉండేలా.. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. ఇప్పటికే 'పల్లె పండగ' పేరుతో గ్రామీణ ప్రాంతాలకు చక్కటి రహదారి వసతి కల్పించగా.. ప్రస్తుతం 'స్వచ్ఛత' కార్యక్రమానికి అడుగులు వేసింది. ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఉమ్మడి కర్నూలు జిల్లావ్యాప్తంగా 18వ తేదీన కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

**ప్రతి నెలా మూడో శనివారం**

ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు వరకు ప్రతి నెలా మూడో శనివారం ఒక్కో అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

మొదటగా ఈనెల 18న నిర్వహించే స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. పట్టణాలు, పల్లెలు, పంచాయతీలతోపాటు పాఠశాల లు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద ముళ్ల పొదలు, చెత్తాచెదారాలు, వ్యర్థాలు తొలగించాలి. ప్రధాన రహదారుల వెంట పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. కాల్వలు శుభ్రం చేయాలి. మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల పరిశుభ్రతపై ప్రజల చేత ప్రతిజ్ఞ చేయించాలి.

కలసికట్టుగా ముందుకు

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే 'స్వచ్ఛ ఆంధ్రా.. స్వచ్ఛ దివస్'లో భాగంగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు వివిధ రంగాలను భాగస్వాములుగా చేయాలి. పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రధానంగా గ్రామీణ నీటి సరఫరా, జడ్పీ, మండల పరిషత్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ ఉద్యోగులు భాగస్వాములవ్వాలి.

**గతంలో నిధుల పక్కదారి**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు విడుదలైన ఆర్థిక సంఘం నిధులను పక్కదారి పట్టించింది. గ్రామాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించలేదు. ఫలితంగా జనం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గతేడాది నవంబరులో 2024-25 సంవత్సరానికి సంబంధించి 15వ ఆర్థిక సంఘం తొలి విడత నిధులు రూ.66.22 కోట్లు పంచాయతీ ఖాతాలకు నేరుగా జమయ్యాయి. ఈ నిధులతో పల్లెల్లో కనీస వసతులు కల్పించేందుకు అవకాశం ఏర్పడింది.

# రేషన్ బండి.. అంతా తొండి

కర్నూలు : బియ్యం బండి ఇంటికి రావడం లేదు.. ఇంటింటికి వచ్చినట్లు ఆపరేటర్లు లెక్కలు రాసుకొంటున్నారు.. ప్రతి నెలా రూ.1.60 కోట్ల వరకు బిల్లులు తీసుకుంటున్నారు. ఆహారభద్రతా చట్టం ప్రకారం రేషన్ డీలర్లు సరకులు పంపిణీ చేయాల్సి ఉండగా.. గత ప్రభుత్వం పూర్తి అధికారాలను ఆపరేటర్ల చేతికి అప్పగించింది. ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరకులు ఇంటింటికి అందిస్తున్నట్లు గొప్పలు చెప్పారు. ఆపరేటర్లు రేషన్ దుకాణాల వద్దే కూర్చొని కానిచ్చేస్తున్నారు.. మరికొందరు డీలర్లకే బాధ్యత అప్పగించారు. ఎండీయూ ఆపరేటర్లు వినియోగదారులకు సరకులు అందించినా.. అందించకపోయినా ప్రతి నెలా వారి ఖాతాల్లో రూ.21 వేల చొప్పున జమ చేసేస్తుండటం గమనార్హం.!!

కొరవడిన పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో ఎండీయూ ఆపరేటర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా పౌరసరఫరాల అధికారులు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పౌరసరఫరాల ఉప తహసీల్దార్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సచివాలయ ఉద్యోగులు.. ఇలా ఏ ఒక్కరూ వాహనాలను తనిఖీ చేసిన దాఖలాలు లేవు. ఇటీవల విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేయడం మినహా రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఇటు ఎండీయూ ఆపరేటర్లు, అటు డీలర్లు ఇద్దరూ కుమ్మక్కై అందినకాడికి దోచుకుంటున్నారు.

ఏటా రూ.19.15 కోట్ల ఖర్చుకర్నూలు జిల్లాలో 409, నంద్యాలలో 351 ఎండీయూ వాహనాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం వాహనాలు ఇంటింటికి వెళ్లి రేషన్ సరకులు ఇవ్వాలి. వీధి చివరన.. గ్రామంలో ఒకమూల వాహనం పెట్టి సరకులు అందిస్తున్నారు. ఆ సమయంలో వినియోగదారుడు ఉంటే సరి.. లేకుంటే ఆ నెలలో సరకులు వదులుకోవాల్సిందే. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఒక్కో ఎండీయూ వాహన ఆపరేటరుకు ప్రభుత్వం ప్రతి నెలా రూ.21 వేలు చెల్లిస్తోంది. ఏటా రూ.19.15 కోట్ల వరకు వెచ్చిస్తోంది. ప్రతి నెలా పరిశీలిస్తే 85 నుంచి 90 శాతం మంది కార్డుదారులకే సరకులు అందుతున్నాయి. చిల్లర పేరుతో చిల్లులుసరకుల పంపిణీ సమయంలో కొందరు ఎండీయూ ఆపరేటర్లు అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. కార్డుదారులకు కందిపప్పు, చక్కెర పంపిణీ చేసినట్లు ఈ.పోస్ యంత్రాల్లో వేలిముద్రలు వేయించుకుంటున్నారు.

# వరి సాగుకు సమాయత్తం

అనంతపురం : జిల్లాలో రైతులు రబీలో వరి పంటను విస్తృతంగా సాగు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. పెట్టుబడి ఖర్చులు పెరిగినప్పటికీ ఎన్నో ఆశలతో నాట్లు వేస్తున్నారు. గత ఖరీఫ్ ధాన్యానికి బహిరంగ మార్కెట్‌లో ధరలు పతనమైనప్పటికీ, ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసింది. 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేసింది. దానికితోడు పత్తి పంటపై ఆశలు సన్నగిల్లుతుండటం, హెచ్చెల్సీలో ప్రవాహం ఎక్కువ రోజులు కొనసాగితే నీరు వస్తుందనే నమ్మకంతో రైతులు వరి సాగుకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లా వ్యాప్తంగా కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాళ్, బీటీపీ కింద గుమ్మఘట్ట, బ్రహ్మసముద్రం, గార్లదిన్నె, పామిడి, బుక్కరాయసముద్రం, పెద్దపప్పూరు, యల్లనూరు, శింగనమల మండలాల్లో బోర్ల కింద రైతులు ఎక్కువగా వరి సాగు చేయనున్నారు. ఆర్ఎన్ఆర్, ఐఆర్ 93 రకాలను సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ముందుగానే నార్లు పెంపకం చేపట్టిన రైతులు మడులను సిద్ధం చేసుకొని, జోరుగా నాట్లు వేసుకొంటున్నారు. సాధారణంగా 16వేల



ఎకరాల్లో వరి సాగు కానుందని అధికారులు ప్రతిపాదిస్తుండగా రెట్టింపు విస్తీర్ణంలో, 30 వేల ఎకరాల్లో సాగు కానున్నట్లు అంచనా.

**పెరిగిన పెట్టుబడి ఖర్చులు**

ఖరీఫ్ కంటే రబీ కింద వరి సాగు రైతుకు భారంగా మారింది. ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్ల అద్దె, కూలీల ధరలతో ఖర్చులు తడిసి మోపెడు అవుతున్నాయి. హెచ్చెల్సీ ఆయకట్టు భూముల్లో వరికొయ్య మడులను నాట్లు వేసేలా సిద్ధం చేసేందుకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ట్రాక్టరుతో టిల్లరు తోలడానికి ఎకరాకు రూ.1,000, దమ్ము చేయడానికి గంటకు రూ.1,500 చొప్పున, వరి నారుకు రూ.5 వేలు, ఎకరా వరి నాట్లు వేసేందుకు రూ.6 వేలు, కూలీలు, ఎరువులు, కలుపు నివారణ, సస్యరక్షణ, మందుల పిచికారీ ఇతరాత్ర కలిపి ఎకరాకు మొత్తం పెట్టుబడి రూ.50 వేలకుపైగా వ్యయం చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

**మెలకువలు పాటించాలి- సాయికుమార్, ఏవో** వరి నాట్లు వేయడంలో రైతులు మెలకువలు పాటించాలి. తగిన దూరం పాటించి నాట్లు వేయడంతోపాటు కాలి బాటలు తీసుకోవాలి. మోతాదుకు మించి రసాయన ఎరువులు, క్రిమసంహారక మందులు వాడకూడదు.

# గోకులం.. పాడిరైతుకు ఊతం

ఉరవకొండ : పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం తోడ్పాటుగా నిలిచింది. గోకులాలను మంజూరు చేసింది. జిల్లాలో ఇప్పటికే చాలా గ్రామాల్లో గోకులాల నిర్మాణాలు పూర్తికాగా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. మిగిలిన నిర్మాణాలను వేగవంతం చేశారు. అనంతపురం జిల్లాలోని 31 మండలాలకు 1,709 గోకులాలు మంజూరు అయ్యాయి. రైతు వాటాతో కలిసి ఒక్కో నిర్మాణానికి రూ.2.30 లక్షలు చొప్పున కేటాయించారు. ఈ లెక్కన రూ.33.45 కోట్లతో పనులు చేపట్టారు.



అందులో 1,652 పనులు ప్రారంభం కాగా, 767 గోకులాల నిర్మాణాలు పూర్తయ్యాయి. 378 పునాదుల స్థాయిలోనూ, 353 బేస్‌మెంటు స్థాయిలో, 154 పైకప్పు వేయడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాలను అధికారులు, కూటమి ప్రభుత్వ నాయకులు ఎక్కడికక్కడ ప్రారంభించారు. పాడిరైతులు పశువులను గోకులం షెడ్డు కింద కట్టేసుకోవడం ద్వారా అవి ఆరోగ్యంగా పెరుగుతాయి. సంరక్షణకు, మేత మేయడానికి ఇబ్బంది ఉండదు. గత వైకాపా ప్రభుత్వం వీటి నిర్మాణాలకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. గోకులాలను సంక్రాంతి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందుల వల్ల కొన్ని నిర్మాణాలు పూర్తి కాలేదు. ఈ విషయమై డ్వామా పీడీ సలీంబాషాతో ప్రస్తావించగా ఈ నెలాఖరు నాటికి గోకులాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు.

# అరకోటి స్థలం ఆక్రమణకు యత్నం!

అనంతపురం : కొత్తచెరువు మండలం మీర్జాపురం పంచాయతీ కొత్తదేవరపల్లి గ్రామంలో అరకోటి విలువైన భూమిని కొందరు ఆక్రమించడానికి ప్రయత్నాలు చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. సుదీర్ఘకాలంగా నివాసాల మధ్య ఖాళీ స్థలంలో గుంతలు పడి అపరిశుభ్రంగా ఉండేది. గుంతలను పూడ్చి శుభ్రం చేయించాలని



పలుమార్లు గ్రామస్థులు అధికారులకు విన్నవించారు. ఇటీవల అధికారులు గుంతలను పూడ్చడానికి రూ.3 లక్షల మండల పరిషత్తు నిధులు మంజూరు చేశారు. పొక్లెయిన్, ట్రాక్టర్లతో మట్టిని తరలించి గుంతలను పూడ్చి చదును చేశారు. దాదాపు 30 నుంచి 40 సెంట్ల విలువైన భూమి భవిష్యత్తులో గ్రామ ప్రజోపయోగాలకు ఉపయోగపడుతుందని భావించారు. స్థలం ఆక్రమణకు గురికాకుండా కంచె ఏర్పాటుకు సామగ్రి సైతం తెప్పించారు. ఇంతలోనే కొందరు రాజకీయ జోక్యంతో గడ్డివాము, దిబ్బలు ఏర్పాటు చేసి స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నారు. అయితే ఈ స్థలంలో కొంత రోడ్డుకు వదిలి మిగిలిన దాంట్లో ప్రభుత్వ పాఠశాలకు కేటాయించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై ఎంపీడీవో నటరాజ్‌ను వివరణ కోరగా స్థలం చుట్టూ కంచె ఏర్పాటు చేసి అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడతామన్నారు.

# భూ రీసర్వేకు ముహూర్తం ఖరారు




అనంతపురం : ప్రతిష్టాత్మకమైన భూ రీసర్వే నిర్వహణకు ముహూర్తం ఖరారైంది. ఈనెల 20 నుంచి శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఇదే భూ రీసర్వే వ్యవహారం అస్తవ్యస్తంగా.. గందరగోళంగా సాగింది. తప్పులు, పొరపాట్లు లెక్కలేనన్నీ తెరపైకి వచ్చాయి. ఈ తరహా తప్పులు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా రీ సర్వే చేసేందుకు అధికారులు పక్కా ప్రణాళికను రూపకల్పన చేశారు. ఇదే విషయాన్ని జిల్లా భూమి, రికార్డుల శాఖ ఏడీ రూప్లానాయక్ తెలిపారు. తొలి ప్రయత్నంగా ప్రతి మండలానికి ఒక గ్రామాన్ని ఎంపిక చేసి ప్రయోగాత్మక రీసర్వే చేయాలని సంకల్పించారు. జిల్లాలో 31 గ్రామాల్లో సర్వే మొదలు కానుంది. ఏ చిన్న తప్పు దొర్లకుండా ముందస్తుగా గత నెల 25 నుంచి నిర్దేశిత 31 గ్రామాల్లో ప్రత్యేక సభలు నిర్వహించారు. భూమి రీసర్వే పునఃప్రారంభానికి సర్వం సిద్ధం చేసుకున్నారు.

**ప్రతి బ్లాక్‌కు ఒక బృందం**

రీసర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. 200 నుంచి 250 ఎకరాలను ఒక బ్లాక్‌గా విభజించారు. ఈ బ్లాక్‌కు ఒక బృందం ఉంటుంది. బృందంలో ఇద్దరు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి(వీఆర్‌ఓ), గ్రామ సహాయకుడు (వీఆర్‌ఏ) ఉంటారు. బృందానికి మరొక సాంకేతిక సిబ్బంది సాయంగా ఉంటారు. పొలాల గట్లు, విస్తీర్ణాన్ని పక్కాగా కొలుస్తారు. ఎక్కడికక్కడ గ్రామ ప్రజలు, భూ యజమానుల సమక్షంలోనే రీసర్వే చేస్తారు.

**సర్వే చేయనున్న గ్రామాలివే**

అనంత గ్రామీణ మండలంలో తాటిచెర్ల, ఆత్మకూరులో సనప, బీకే సముద్రంలో రెడ్డిపల్లి, గార్లదిన్నెలో కల్లూరు, శింగనమలలో మట్లగొంది, రాప్తాడులో బండమీదపల్లి, నార్పలలో బొందలవాడ, తాడిపత్రిలో ఊరుచింతల, పెద్దపప్పూరులో చిన్నయక్కలూరు, పుట్లూరులో గాండ్లపాడు, కూడేరులో జయపురం, ఎల్లనూరులో పాతపల్లి, గుంతకల్లులో శంకరబండ, గుత్తిలో కొజ్జెపల్లి, పామిడిలో కళాపురం, పెద్దవడుగూరులో దిమ్మగుడి, ఉరవకొండలో వ్యాసాపురం, వజ్రకరూరులో గంజికుంట, విడపనకల్లులో ఉండబండ, యాడికిలో చందన, కళ్యాణదుర్గంలో దురుదకుంట, బెళుగుప్పలో తగ్గుపర్తి, బ్రహ్మసముద్రంలో గుండిగానపల్లి, కుందుర్పిలో అపిలేపల్లి, కంబదూరులో తిమ్మాపురం, శెట్టూరులో అయ్యగార్లపల్లి, గుమ్మఘట్ట, కణేకల్లులో మీనహళ్, రాయదుర్గంలో జుంజురాంపల్లి, డి.హీరేహాళ్‌లో కడలూరు, బొమ్మనహాళ్ మండలంలో కురువపల్లి గ్రామాలను ఎంపిక చేశారు. గత వైకాపా ప్రభుత్వ పెద్దల ప్రచారపిచ్చి పరాకాష్ఠకు చేరిన సంగతి తెలిసిందే. పొలాల సరిహద్దు రాళ్లపై అప్పటి సీఎం బొమ్మలు, పేర్లు వేసుకున్నారు. రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలపై కూడా అదే తరహా ప్రచారాన్ని చేసుకున్నారు. ఇప్పుడు వాటిని చెరిపేస్తున్నారు. రాజముద్రతో ఉన్న పాసుపుస్తకాలను అందజేస్తారు.

# గుట్టుగా డీజిల్, సిమెంట్ చౌర్యం!




అనంతపురం : డీజిల్ అక్రమ విక్రయాలకు 44వ నంబరు జాతీయ రహదారి ఇరువైపులా దుకాణాలు అడ్డాలుగా మారుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 180 కి.మీ మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. వందల సంఖ్యలో దాబాలు, టీ దుకాణాలు వెలిశాయి. వాటికి పక్కనే పలుచోట్ల డీజిల్, సిమెంట్ వాహనాల నుంచి అక్రమంగా కొనుగోలు చేసేందుకు పలువురు దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం వందల లీటర్ల డీజిల్, సిమెంట్ బస్తాలు దారిన వెళ్లే వాహన చోదకుల నుంచి సేకరించి అధిక సొమ్ముకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వివిధ నియోజక వర్గాలు, మండలాలను కలుపుతూ విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై ఇటు హైవే పెట్రోలింగ్ సిబ్బంది, అటు పలుస్టేషన్ల పరిధిలోని పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో అక్రమ దందా నిరంతరం సాగుతోంది. డీజిల్ కొనుగోలు కోసమే పలువురు జాతీయ రహదారి పక్కనే దుకాణాలు ఏర్పాటు చేశారు. పలుచోట్ల కంటెయినర్ ద్వారా సిమెంట్ సైతం కొనుగోలు చేస్తున్నారు. సుదూర ప్రాంతాలకు భారీ వాహనాలలో లగేజీ తీసుకెళ్లే వాహన చోదకులు యజమానులకు తెలియకుండా డీజిల్ విక్రయిస్తున్నారు. పలు కంపెనీలు నగరాల్లోని నిర్మాణ సంస్థలకు సిమెంట్ను కంటెయినర్ల ద్వారా రవాణా చేస్తున్నారు. తిరిగి వచ్చే సమయంలో మిగిలిపోయిన సిమెంట్ను జాతీయ రహదారి పక్కన ఏర్పాటు చేసుకున్న వారికి విక్రయిస్తుంటారు. వారు కొనుగోలు చేసిన ధర కన్నా అధిక ధరలకు డీజిల్, సిమెంట్ విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

వాహనదారుల నుంచి లీటరు డీజిల్ రూ.60 నుంచి 65 కొనుగోలు చేసి ఇతర వాహనాల వారికి రూ.85 లకు విక్రయిస్తుంటారు. ఈ లెక్కన లీటరుపై రూ.20 నుంచి 25 వరకు సంపాదిస్తున్నారు. ఒక్కో వాహనదారుడు 10 లీటర్ల నుంచి 80 లీటర్ల వరకు అక్రమంగా విక్రయిస్తుంటాడు. విడి సిమెంట్ను కంటెయినర్ నుంచి 50 కేజీల బస్తాకు రూ. 200 నుంచి 250 చెల్లించి రూ. 300 నుంచి 350 వరకు విక్రయిస్తుంటారు.

కనగానపల్లి మండల జాతీయ రహదారి పరిధిలో 20 అక్రమ డీజిల్ దుకాణాలు, రామగిరి మండలం పరిధిలో 7, చెన్నేకొత్తపల్లి పరిధిలో 3 ఉన్నాయి. కేవలం 15 కి.మీ పరిధిలోనే ఇన్ని ఉన్నాయంటే జిల్లాలో జాతీయ రహదారి పరిధి 180 కి.మీ ఉంది. బహిరంగ మార్కెట్లతో పోలిస్తే రహదారుల పక్కన అక్రమంగా చౌర్యం చేసిన డీజిల్, సిమెంట్ తక్కువ ధరకు లభిస్తుండటంతో వినియోగదారులు వీటిని కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

**అక్రమ వ్యాపారంపై చర్యలు–** మహ్మద్ రిజ్వాన్, ఎస్సై, కనగానపల్లి జాతీయ రహదారి పక్కన అక్రమంగా జరుగుతున్న డీజిల్, సిమెంట్ చౌర్యంపై చర్యలు తీసుకుంటాం. జాతీయ రహదారిపై ప్రత్యేక దృష్టి సారించి డీజిల్, సిమెంట్ అక్రమాలు జరగకుండా చూస్తాం.

# వేరుసెనగకు మచ్చ తెగులు



చెన్నేకొత్తపల్లి : ఎన్ఎస్‌గేట్ గ్రామానికి చెందిన కౌలు రైతు చంద్రాయుడు ఎనిమిదెకరాలలో పంట సాగు చేయగా 20 బస్తాల దిగుబడి వచ్చింది. రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టగా కనీసం రూ.50 నుంచి 60 వేలు వచ్చే పరిస్థితి కూడా లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేరుసెనగ రైతుల పరిస్థితి ఇలాగే ఉంది. శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా 35,785 ఎకరాల్లో అనంతపురం జిల్లాలో 20, 297 ఎకరాలలో వేరుసెనగ సాగు చేశారు. అందులో 80 శాతం పంటకు నల్లమచ్చ తెగులు సోకడంతో పంటను తొలగించుకుంటున్న దుస్థితి.

వేరుసెనగ పంటలకు తెగుళ్లు సోకడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నడూలేని విధంగా రబీ వేరుసెనగకు చీడపీడలు అధికంగా వ్యాపించాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. మూడు, నాలుగు పిచికారీలతో పూర్తయ్యే పంట ఈసారి ఎడెనిమిది సార్లు పిచికారీలు చేసినా చీడపీడలు, మచ్చ తెగులు అదుపులోకి రాలేదు. రాప్తాడు నియోజకవర్గం సీకేపల్లి, కనగానపల్లి, రామగిరి మండలాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. రైతులు చేసేదేంలేక ఇంకా నెలరోజుల సమయం ఉండగానే పంటను తొలగిస్తున్నారు.

సెప్టెంబరు చివర నుంచి అక్టోబరు చివరి వరకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రబీ కాలానికి రైతులు వ్యవసాయ బోర్ల ద్వారా విస్తారంగా వేరుసెనగ సాగు చేశారు. అక్టోబరులో భారీ వర్షాలు కురిశాయి. పంట దెబ్బతిని చీడపీడలు చుట్టుముట్టాయి. మందులు పిచికారీ చేసినా నల్లమచ్చ అదుపులోకి రాలేదు. మొక్క ఆకులు నల్లమచ్చ తెగుళ్లు సోకి రాలిపోతూ మొక్క నల్లగా మారి ఎందుకూ పనికి రాకుండా పోయింది.

ఎంత కష్టపడి పనిచేసినా.. రైతుకు పంట దక్కడం గగనం అవుతోంది. పంట దిగుబడి వస్తే ధర ఉండదు.. ధర ఉంటే దిగుబడి రాదు.. శెట్టూరు మండలం బసంపల్లి గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు రెండెకరాల్లో రూ.2.70 లక్షలతో సాహు టమాటా రకం సాగు చేశారు. దిగుబడి ఆశాజనకంగా వచ్చినా.. కోతలు మొదలయ్యే సరికి మార్కెట్లో 15 కిలోల బుట్ట ధర రూ.50 మించలేదు. 3 వేల బుట్టెల మార్కెట్‌కు తరలించగా చేతికి ఏమీ రాలేదు. కోత, బుట్టెలు అద్దె, రవాణా ఖర్చులకు కూడా గిట్టుబాటు కాకపోవడంతో గొర్రెలకు వదిలేశానని రైతు ఆంజనేయులు

ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం గ్రామీణం కురుగుంటకు చెందిన రైతు సిద్దన్న ఎనిమిదెకరాలు గుత్తకు తీసుకుని ఉలవ సాగు చేశారు. ఎకరాకు రూ.2 వేలు చొప్పున రూ.16 వేలు గుత్తకు తీసుకోగా, ఎకరా సాగుకు రూ.6 వేలు చొప్పున రూ.48 వేలు పెట్టుబడి పెట్టారు. తీరా పంట పూత, కాయ రాలేదు. ఉన్న పంటకు పురుగు ఆశించడంతో చేసేదిలేక గొర్రెలు మేతకు వదిలేశారు.

**పశుగ్రాసానికి పనికిరాదు - కర్రి సూరి, రైతు, సీకేపల్లి**

3 నెలల క్రితం మూడెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. రెండు నెలలపాటు భారీ వర్షాలు కొనసాగడంతో పంట ఎదుగుదల అంతంత మాత్రంగానే ఉంది. మొక్కలకు నల్లమచ్చల తెగుళు, లద్దె పురుగు, పచ్చపురుగు వ్యాపించాయి. వాటిని నివారించేందుకు పురుగుల మందులు పిచికారీ, రసాయనిక ఎరువులు చల్లినప్పటికీ ఫలితం అంతంత మాత్రమే. మూడు ఎకరాల్లో కేవలం 15, 20 బస్తాల దిగుబడి వస్తుందో రాదోనన్న ఆందోళన ఉంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

**రూ.మూడున్నర లక్షలు నష్టపోయా - నారాయణరెడ్డి, రైతు, పులేటిపల్లి**

రూ.4 లక్షలు పెట్టుబడి పెట్టి ఎనిమిదెకరాల్లో వేరుసెనగ సాగు చేశా. పంట వేసిన రెండో రోజే భారీ వర్షం కురవడం, నెలరోజుల పాటు వర్షాలు కొనసాగడంతో పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎన్నడూలేని విధంగా చీడపీడలు వ్యాపించాయి. మూడున్నర లక్షలు నష్టం వచ్చింది.

# 'ఆయుష్' పోసిన కూటమి

నర్సీపట్నం : వైద్యులు, సిబ్బంది లేక కొన్నేళ్లుగా సేవలకు దూరంగా ఉన్న ఆయుష్ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం పూర్వవైభవం తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టింది. జాతీయ ఆయుష్ మిషన్ ద్వారా ఆసుపత్రులన్నింటికీ వైద్యులను నియమించింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో దశాబ్దాల కిందట ఏర్పాటైన ఆసుపత్రుల్లో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన వైద్యులు, సిబ్బంది స్థానంలో ఇప్పటివరకు ఎవర్నీ నియమించకపోవడంతో అవన్నీ మూతపడ్డాయి. ప్రస్తుతం ఆసుపత్రులన్నీ తెరచుకోనున్నాయి. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఆయుష్ ఆరోగ్య మందిరాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా చాలాకాలం నుంచి మూతపడిన ఆయుష్, హోమియో, యునాని ఆసుపత్రుల్లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (ఏపీపీఎస్సీ) ద్వారా ఉత్తరాంధ్రలో (జోన్–1) 39 మంది వైద్యులను నియమించింది. వీరిలో 23 మంది ఆయుర్వేద, 16 మంది హోమియో వైద్యులున్నారు. ఉత్తరాంధ్రలోని మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 113 డిస్పెన్సరీల్లో 59 హోమియో, ఆయుర్వేద, యునానీ ఆసుపత్రులు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. మిగతా 54లో 39 ఆసుపత్రులకు తాజాగా వైద్యులను నియమించగా, 15 చోట్ల భర్తీ చేయాల్సి ఉంది.

**నర్సీపట్నంకు యశోదాదేవి, దేవరాపల్లికి గ్రీష్మ**



ఉమ్మడి విశాఖ జిల్లాలో ఏఎల్‌పురం, కన్నూరుపాలెం, వేంపాడు, దేవరాపల్లి, నర్సీపట్నం, అరకులోయ, డుంబ్రిగుడ, తాజంగి, సీలేరు ఆసుపత్రులకు వైద్యులు నియమితులయ్యారు. నర్సీపట్నంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం వైద్యాధికారిగా యశోదాదేవి, దేవరాపల్లిలో మూడేళ్లుగా మూతపడిన ఆసుపత్రికి వైద్యాధికారిణిగా జి.గ్రీష్మ నియమితులయ్యారు.

**త్వరలోనే మందుల నిల్వలు**

ఆయుష్ డిస్పెన్సరీల్లో వైద్యులు లేక కొన్ని మూతపడ్డాయి. వాటిలో 39 మంది చోట్ల కొత్తగా వైద్యులు నియమితులయ్యారు. వారంతా విధుల్లో చేరిన వెంటనే మందుల నిల్వలూ పంపుతాం. మూతపడిన ఆసుపత్రి భవనాలను స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకువస్తాం. పారా మెడికల్ సిబ్బంది నియామకం త్వరలో జరుగుతుంది. ఆయుష్ ఆరోగ్య మందిరాల్లో యోగా నేర్పేందుకు ఇద్దరు యోగా శిక్షకులను నియమించాం. వారిలో ఒకరు ఆసుపత్రిలో, మరొకరు ప్రభుత్వ పాఠశాలలో యోగా నేర్పుతారు. ఝాన్సీలక్ష్మి, ఆయుష్ ప్రాంతీయ ఉప సంచాలకురాలు, జోన్–1

# గృహమే సాగుసీమ

విశాఖపట్నం : విశాఖ నగరంలో మిద్దె పంటల సాగు సంస్కృతి విస్తృతమవుతుంది. ఒకరిని చూసి మరొకరు స్ఫూర్తిపొందుతున్నారు. ఇల్లు.. మేడ.. గోడ.. బాల్కనీలు.. ఎక్కడైనా ఆకుకూరలు, కాయగూరలు పండించేస్తున్నారు. అపార్టుమెంటు, విల్లాలను కూడా సేంద్రియ సాగుకు అనుకూలంగా మార్చేస్తున్నారు. నగరంలో ఎక్కువగా మాధవధార, మురళీనగర్, తిరుమలనగర్, రుషికొండ, మధురవాడ, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లో అధిక సంఖ్యలో మహిళలు మిద్దె తోటలపై పండిస్తున్నారు. ఒక్క మాధవధారలో 300 కుటుంబాలు, మధురవాడలో 200, సీతమ్మధార, ఎంవీపీలో వందేసి కుటుంబాలు ఈ దిశగా సాగుతున్నాయి.

కాలనీల్లో మేడలపై కొద్ది పాటి స్థలాన్ని పలువురు మహిళలు ఇంటి అవసరాలకు సరిపడేలా వినియోగిస్తున్నారు. ఆకుకూరలను చిన్నచిన్న కుండీలు, ప్లాస్టిక్ సంచుల్లో సాగు చేస్తున్నారు. చిక్కుడు, కాకర, బీర, వంగ, బీన్స్, నేతిబీర, డ్రాగన్ ఫ్రూట్స్, మల్బరీ, ద్రాక్ష, అంజీరా, కస్తూరి పసుపు, కొన్ని పండ్ల మొక్కలు పెంచుతున్నారు. సేంద్రియ ఎరువుతో గులాబి, సంపెంగ, చామంతుల సాగు చేయడంతో ఎక్కువ పూలు చేతికందుతున్నాయి.

సమాచారం ఇలా: మిద్దె సాగులో ఎదురయ్యే సమస్యలు చెప్పుకొని పరిష్కారం పొందటానికి, అనుభవాలు మిగిలిన వారితో పంచుకోవటానికి వాట్సప్ గ్రూపులున్నాయి. ఒక్కో బృందంలో 50 నుంచి 100 మంది వరకు సభ్యులుంటున్నారు.

పెంపకంపై ఆసక్తి ఉన్నవారికి అవగాహన కల్పించి కొందరు ఉ



చితంగానే మొక్కలను అందజేస్తున్నారు. పండిన కూరగాయలను సభ్యులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు.

**12 సంవత్సరాలుగా..:** 250 గజాల స్థలంలో నిర్మించిన ఇంటిపై ఎన్నో రకాలు మొక్కలు పెంచుతున్నాం. యూట్యూబ్‌లో ఒకరి సాగు చూసి ప్రారంభించాం. 12 ఏళ్లుగా ఆసక్తిగా పండిస్తున్నాం. వర్మీ కంపోస్టు ఎరువుల ద్వారా 700కు పైగా ప్లాస్టిక్ కుండీలు, సిమెంటు మడుల్లో సాగు చేస్తున్నాం. ఇంట్లో తయారు చేసిన పశువుల గెత్తం, వృథా కాయగూరలు తదితర వాటితో ఎరువు తయారు చేసి మొక్కలకు వేస్తాం. చిన్నపాటి కొలనులో చేపలూ పెంచుతున్నాం.

**స్థలం సద్వినియోగం:** మాది మూడంతస్తుల ఇల్లు. ఇంటి గోడలు, కిటికీలు, మెట్ల మార్గం ఇలా దేన్నీ వదల్లేదు. ఖాళీ నీళ్ల సీసాలే కాకుండా కోక్ టిన్నులు, నీళ్ల డబ్బాలు, పెయింట్ డబ్బాలు, ప్లాస్టిక్ వస్తువుల్లో పెంచుతున్నా. అందంగా కనిపించడానికి సీసాలకు రంగులు అద్ది మరీ వేలాడదీస్తున్నా. పూలమొక్కలే కాకుండా ఆకుకూరలు, కూరగాయలు, పండ్ల రకాలు ఎన్నో పెంచుతున్నా. అన్ని ఒకే చోట కాకుండా... చిన్న పాత్రలు, డబ్బాల్లో అయితే తక్కువ మట్టితో ఎక్కువ పెంచుకోవచ్చు. అరుణ, మురళీనగర్

# బాలన్ బోల్డ్ అందాలు

భూల్ భూలైయా 3లో నటించిన విద్యాబాలన్ అత్యుత్తమ నట ప్రదర్శనతో హృదయాలను గెలుచుకున్నారు. కెరీర్ లో ఎన్నో వైవిధ్యమైన పాత్రల్లో నటించిన బాలన్, ఈసారి కూడా పెద్ద తెరపై వైవిధ్యమైన పాత్రతో తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఇది బాలన్ కి కెరీర్ పరంగా చాలా కీలకమైన సమయం. వరుసగా సినిమాలకు సంతకాలు చేస్తోంది. అదే సమయంలో బాలన్ వరుస ఫోటోషూట్లు వెబ్‌లో దుమారం రేపుతున్నాయి. ఈ బ్యూటీ తదుపరి ఏ సినిమాలో నటిస్తోంది అనేది అటుంచితే, ఇప్పటికి ఘాటైన ఫోటోషూట్లను షేర్ చేస్తూ యూత్‌లో తన బోల్డ్ ఇమేజ్ ని కాపాడుకుంటోంది. తాజాగా విద్యా బాలన్ తన టోన్డ్ బాడీ అందాలను ఆవిష్కరిస్తూ గుబులు రేపుతోంది. ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోషూట్ ఇప్పుడు నెట్‌లో వైరల్‌గా మారుతోంది. కాంజీవరం చీరలో లేదా బ్రీజీ లినెన్ చీరలో కనిపించినా బాలన్ కి అవి వందశాతం యాప్ట్. కానీ అందుకు



భిన్నంగా పూర్తి మోడ్రన్ దుస్తుల్లోను బాలన్ అంతే అందంగా కనిపిస్తుంది. ఈ బ్యూటీ మోడ్రన్ అటైర్ కి అంతే బాగా సూటబుల్. విద్యా బాలన్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్న ఎథ్నిక్ ఫ్యాషన్ బ్రాండ్ షోబితం బెంగళూరు స్టోర్ ఇటీవల ప్రారంభమైంది. అక్కడ అభిమానులు చీరలు ధరించి కనిపించారు. బనారసి సిల్క్ చీర ధరించి, తన అమ్మమ్మ తన మొదటి చీరను బహుమతిగా ఇచ్చిన జ్ఞాపకాలను, ముంబైలోని చెంబూర్‌లో పెరిగిన జ్ఞాపకాలను బాలన్ ఈ సందర్భంగా గుర్తుచేసుకుంది. మీ సినిమాల విషయానికి వస్తే, లుక్ పరంగా తీసుకునే జాగ్రత్తలు ఎలా ఉంటాయి? అని తాజా ఇంటర్వ్యూలో ప్రశ్నించగా బాలన్ సమాధానం ఆలోచింపజేసింది. నేను ఒక పాత్రపై పని చేస్తున్నప్పుడు, ఆ పాత్ర ఏమి ధరిస్తుందో నిర్దేశిస్తుంది. నాకు కచ్చితంగా ఒక ధృక్కోణం ఉంటుంది. ప్రతి సినిమాలో నేను వేరే పాత్రను పోషిస్తున్నప్పటికీ, నా వ్యక్తిత్వానికి సరిపోని వస్తువులను నేను ధరించలేను. సాధారణంగా చెప్పాలంటే, నా పాత్రల వార్డ్‌రోబ్‌ను సృష్టించినందుకు నేను ఎటువంటి క్రెడిట్ తీసుకోలేను. ఎందుకంటే పాత్రను అర్థం చేసుకున్న కొంతమంది మంచి కాస్ట్యూమ్ డిజైనర్లతో కలిసి పనిచేసే అవకాశం నాకు లభించింది! అని బాలన్ తెలిపింది.

## అమీర్ కొడుకు తేలిపోయాడు.. సైఫ్ కొడుకు నిరూపిస్తాడా?

సైఫ్ అలీ ఖాన్ -అమృతా సింగ్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ నాదానియన్ చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నాడు. ఈ రొమాంటిక్ కామెడీలో ఖుషీ కపూర్ కథానాయిక. తొలుత ఈ చిత్రం అధికారికంగా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుందని ప్రకటించారు. కానీ విడుదల తేదీని వెల్లడించలేదు. ఇప్పుడు ఈ చిత్రం ఫిబ్రవరిలోనే విడుదల కానుందని తెలుస్తోంది. తాజాగా నెట్‌ఫ్లిక్స్ ఇండియా అధికారిక ఇన్‌స్టాగ్రామ్ లో ఈ విషయాన్ని ధృవీకరించింది. నెక్ట్స్ రాబోయే చిత్రం నాదానియాన్ ఫిబ్రవరి 2025లోనే.. అని వెల్లడించింది. ఇబ్రహీం అలీ ఖాన్, ఖుషీ కపూర్ ఇప్పటికే ప్రమోషన్లను ప్రారంభించారు. ఫిబ్రవరి 14న ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఖుషీ ఇన్‌స్టాగ్రామ్‌లో



ఇబ్రహీంతో కలిసి ఉన్న ఫోటోలను షేర్ చేయగా వైరల్ అయ్యాయి. ఈ జంట రొమాంటిక్ పోస్టర్లు ఆకట్టుకున్నాయి. నాదానియన్ చిత్రాన్ని ధర్మాటిక్ ఎంటర్‌టైన్‌మెంట్ లో కరణ్ జోహార్ నిర్మించారు. షౌనా గౌతమ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రాన్ని కరణ్ జోహార్, అపూర్వ మెహతా, సోమెన్ మిశ్రా నిర్మించారు. ఈ రొమాంటిక్ డ్రామా కథాంశం యువతరం మెచ్చే లవ్ డ్రామాతో ఆకట్టుకుంటుందని సమాచారం. ఒక అపార్థం తన స్నేహితులను విరోధులుగా మార్చినప్పుడు.. లవ్ కోసం ధనవంతురాలైన పియా తన ప్రియుడిగా నటించడానికి కెరీర్ నే జీవితంగా భావించే కొత్త విద్యార్థి అర్జున్‌ను నియమించుకుంటుంది. ఆ తర్వాత ఏం జరిగిందన్నదే ఈ సినిమా. నాదానియన్ సినిమా మొదటి పోస్టర్ లో ఇబ్రహీం అలీ ఖాన్, ఖుషీ కపూర్ ఒకరినొకరు కౌగిలించుకుని కనిపించారు. ప్రతి ప్రేమకథలో థోడి సి నాదానీ (కొంచెం మూరత్వం) ఉంటుంది! అనే క్యాప్షన్ ఆకట్టుకుంది. ఈ సినిమా నుంచి పాటలు ఇప్పటికే విడుదల కాగా యువతరాన్ని ఆకట్టుకున్నాయి. ఖుషి కపూర్ ఇటీవలే అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ సరసన లవ్ యాపా చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన వసూళ్లను సాధించలేదు. అమీర్ కొడుకు జనాల్ని ఆకర్షించడంలో ఫెయిల్ అయ్యాడు.. సైఫ్ కొడుకు నిరూపిస్తాడా లేదా? అన్నది ఇప్పటికి సస్పెన్స్. నెట్ ఫ్లిక్స్ లో నాదానియాన్ ఏమేరకు ఆదరణ దక్కించుకుంటుందో వేచి చూడాలి.




# ఆ హీరోతో లిప్ కిస్సులో రీతూ వర్మ!



తెలుగు అమ్మాయి రీతు వర్మ గురించి పరిచయం అవసరం లేదు. అమ్మడు ఇప్పటికే తెలుగు, తమిళ్ లో చాలా సినిమాలు చేసింది. ప్రేమ ఇష్క్ కాదల్ తో ఎంట్రీ ఇచ్చిన అమ్మడు చాలా తెలుగు సినిమాలు చేసింది. అటుపై కోలీవుడ్ లోనూ చాలా సినిమాల్లో నటించింది. అయితే వెండి తెరపై ఎప్పుడూ హద్దులు మీరింది లేదు. గ్లామర్ పాత్రలకు దూరంగానే ఉంది. లిప్ కిస్సులు..ఇంటిమేట్ సీన్లు అంటే ఏ సినిమా విషయంలోనూ ఛాన్స్ తీసుకోలేదు. అలాంటి ఆఫర్లు చాలా వచ్చినా? వద్దనుకుని తన ఫరిది మేర సినిమాలు చేసుకుంటూ వచ్చింది. ఏనాడు గ్లామర్ గేట్లు ఎత్తింది లేదు.

అయితే తాజాగా రీతూ వర్మ కూడా సరిహద్దులు దాటేసిందని ఓ వార్త వెలుగులోకి వస్తోంది. ప్రస్తుతం ఈ బ్యూటీ త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో మజాకాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఇందులో హీరోగా సందీప్ కిషన్ నటిస్తున్నాడు. త్రినాథరావు సినిమాలంటే పక్కా కమర్శియల్ చిత్రాలు. అవసరం మేర మసాలా సన్నివేశాలకు ఛాన్స్ తీసుకుంటాడు. ఈ నేపథ్యంలో మజాకాలో రీతూవర్మ హీరో సందీప్ కిషన్ తో ఓ లిప్ కిస్ సన్నివేశంలో నటించిందని ప్రచారం జరుగుతోంది. ఓ సీన్ డిమాండ్ మేరకు నక్కిన తప్పదు నటించాల్సిందేనని పట్టుబట్టడంతో రీతూ వర్మ ఛాన్స్ తీసుకుందని అంటున్నారు. మరి ఈ ప్రచారంలో నిజమెంతో తేలాలి. రీతూ వర్మకు గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశం వచ్చినా? నటించలేదు. ఈ క్రమంలో చాలా అవకాశాలు కోల్పోయింది. అటు కోలీవుడ్ లో కూడా అవకాశాలు తగ్గడానికి ఇదే కారణమని చాలా కాలంగా అక్కడ మీడియాలో కథనాలొస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం రీతూ వర్మ చేతిలో ఉన్నది కూడా మజాకా చిత్రమే. కోలీవుడ్ లో ధృవ నక్షత్రం సినిమా చేసింది గానీ ఆ సినిమా రిలీజ్ కి నోచుకోలేదు. చాలా కాలాంగా వాయిదా పడుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో మాజాకా చిత్రంతో ఎలాగైనా బౌన్స్ బ్యాక్ అవ్వాలని చూస్తుంది. ఈ క్రమంలోనే లిప్ కిస్సు కి ఒకే చెప్పిందనే వార్తలొస్తున్నాయి.

# సంక్రాంతికి వస్తున్నాం.. ఓటీటీ రైట్స్ తో లాభమెంత?



సంక్రాంతి బరిలోకి దిగి భారీ విజయాన్ని అందుకున్న వెంకటేష్ చిత్రం సంక్రాంతికి వస్తున్నాం ఇప్పుడు డిజిటల్ ఎంట్రీకి సిద్ధమవుతోంది. థియేటర్లలో గ్రాండ్‌గా ఆడిన ఈ సినిమా, ఓటీటీలో కూడా అదే మ్యాజిక్ రిపీట్ చేయాలని చూస్తోంది. వెంకటేష్, అనిల్ రావిపూడి కాంబినేషన్ ఇప్పటికే మూడోసారి హిట్ అందుకున్న నేపథ్యంలో, సినిమా ఓటీటీ హక్కులు భారీ డీల్‌లో అమ్ముడుపోయినట్టు టాక్. ఇప్పటికే థియేట్రికల్ గా ఈ సినిమా బయ్యర్లకు మంచి ప్రాఫిట్స్ అందించింది. ప్రతీ డిస్ట్రిబ్యూటర్ కూడా పెట్టిన పెట్టుబడి కంటే కూడా ఊహించని లాభాలు అందుకున్నారు. ఇక నిర్మాత దిల్ రాజుకి దాదాపు 100 కోట్లకు పైగా ప్రాఫిట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. గేమ్ ఛేంజర్ నష్టాలను దిల్ రాజు ఈ సినిమాతో బ్యాలెన్స్ చేసుకున్నారు. ఇక తాజా సమాచారం ప్రకారం, ప్రముఖ ఓటీటీ సంస్థ %గజుజు%5 ఈ సినిమాను 27 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిందట. అయితే, ఓటీటీలో రిలీజ్‌కు ముందు టీవీలో ప్రసారం చేయాలని నిర్ణయించుకున్నారట. దీంతో, ఇప్పటికి ఓటీటీ రిలీజ్ డేట్ ఖరారు కాలేదు. సాధారణంగా థియేటర్లలో విజయవంతమైన సినిమాలు ఓటీటీలో కూడా భారీ వ్యూస్‌ను సాధిస్తాయి. కానీ, ముందుగా టీవీలో ప్రసారం చేయడం వల్ల డిజిటల్ రన్ ఎలా ఉంటుందో చూడాలి. వెంకటేష్ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కు మంచి వినోదాన్ని అందించింది. ఒక మాజీ ఐపీఎస్ అధికారి, అతని మాజీ గర్ల్‌ఫ్రెండ్, ప్రస్తుత భార్య.. ఈ ముగ్గురి మధ్య సాగే కథ ఎంతో ఎంటర్టైనింగ్‌గా సాగుతుంది. యాక్షన్, కామెడీ మిక్స్ చేసి రూపొందించిన ఈ కథలో, వెంకటేష్ అద్భుతంగా ఆకట్టుకున్నారు. ఆయన సరసన ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటించగా, నరేశ్, సాయి కుమార్, ఉపేంద్ర లిమాయే, శ్రీనివాస రెడ్డి తదితరులు కీలక పాత్రలు పోషించారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, ప్రేక్షకులను థియేటర్లకు బలంగా రప్పించడంలో విజయం సాధించింది. గతంలో వెంకటేష్‌తో కలిసి F2, F3 లాంటి సూపర్ హిట్ సినిమాలను అందించిన అనిల్, ఈసారి కూడా అదే కమర్షియల్ ఫార్ములా ఫాలో అయ్యారు. ప్రేక్షకులకు నచ్చే కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మిక్స్ చేసి, ఈ సినిమాను రూపొందించడం వల్లే మంచి విజయాన్ని అందుకుంది. ఇప్పటికే ఈ సినిమా సీక్వెల్‌కు గ్రీన్ సిగ్నల్ లభించింది.

2027 సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం 2 ప్రేక్షకుల ముందుకు రానుందని వెంకటేష్ ప్రకటించారు. వెంకటేష్ ప్రస్తుతం మరో క్రేజీ ప్రాజెక్ట్ రాణా నాయుడు 2 కోసం రెడీ అవుతున్నారు. ఇక, సంక్రాంతికి వస్తున్నాం ఓటీటీలో ఎప్పుడు వస్తుందో, మరోసారి ఈ సినిమా మ్యాజిక్ రిపీట్ చేస్తుందా అనేది వేచి చూడాలి.

# లిల్లీ నుంచి కీర్తి వరకు.. వావ్ అనిపిస్తున్న అనుపమ

మలయాళ ప్రేమమ్ సినిమాతో వెండితెరకు పరిచయమైన కేరళ కుట్టి అనుపమ పరమేశ్వరన్ ఇవాళ తన 29వ పుట్టినరోజును జరుపుకుంటుంది. అ..ఆ సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన అనుపమ, తక్కువ కాలంలోనే మంచి నటిగా, పక్కింటి అమ్మాయిగా గుర్తింపు తెచ్చుకుంది. రీసెంట్ గా టిల్లూ స్క్వేర్ సినిమాలో లిల్లీ జోసెఫ్ గా నటించి అందరినీ ఆకట్టుకుంది అనుపమ. టిల్లూ స్క్వేర్ లో రెండు విభిన్న షేడ్స్ లో నటించి అనుపమ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. సినిమా మొదట్లో లిల్లీ జోసెఫ్ పాత్ర పెద్దగా ఆకట్టుకోనప్పటికీ, ఆ తర్వాత లిల్లీ జోసెఫ్ ఐఎస్ఎఫ్ గూఢచారి అని రివీల్ అయ్యాక మాత్రం ఓ రేంజ్ లో క్లిక్ అయింది. ఓ వైపు ప్రేయసిగా, మరోవైపు సీక్రెట్ ఏజెంట్ గా అనుపమ ఆ పాత్రను పండించిన తీరు విమర్శకుల ప్రశంసల్ని కూడా అందుకుంది. ఇదిలా ఉంటే అనుపమ ప్రస్తుతం డ్రాగన్ అనే తమిళ సినిమాలో నటిస్తోంది.



ఈ సినిమాలో కూడా అనుపమ చాలా భిన్నమైన పాత్రలో కనిపించనుంది. రాఘవన్ మాజీ ప్రేయసి కీర్తి పాత్రలో అనుపమ డ్రాగన్ సినిమాలో నటించింది. ఇప్పటికే రిలీజైన డ్రాగన్ ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. ట్రైలర్ లో అనుపమ చాలా సింపుల్ గా కనిపించింది. కథ మొత్తంలో తన ప్రియుడికి సపోర్ట్ చేసే పాత్రలో అనుపమ డ్రాగన్ సినిమాలో కనిపించనుంది. టిల్లూ స్క్వేర్ లోని లిల్లీ పాత్రకు, డ్రాగన్ లోని కీర్తి పాత్రకు ఏ మాత్రం పొంతన కనిపించదు. ఇంకా చెప్పాలంటే ఆ రెండు పాత్రలు చేసింది ఒకరేనా అనే అనుమానం కలిగించేలా అనుపమ ఆ పాత్రల్లో ఒదిగిపోయింది. ఫిబ్రవరి 21న డ్రాగన్ ప్రేక్షకుల ముందుకు రానుంది. కాలేజ్ స్టూడెంట్ అయిన రాఘవ బ్రేకప్ తర్వాత అనుకోని విధంగా మోసపోతాడు. రాఘవ మోసానికి గురవుతున్నప్పుడు కీర్తి పాత్ర అతని జీవితంలో ఎలాంటి పాత్ర పోషిస్తుందనే దానిపై డ్రాగన్ కథ నడవనుంది. డ్రాగన్ సినిమాతో అనుపమ ఎలాంటి హిట్ అందుకుంటుందో చూడాలి మరి.

# గుబులు రేపుతున్న రుహానీ ఫోజ్

రుహానీ శర్మ పరిచయం అవసరం లేదు. చిలసౌ చిత్రంలో సుశాంత్ సరసన నాయికగా నటించింది. మొదటి సినిమాతోనే ఈ బ్యూటీ తనదైన నట ప్రతిభతో ఆకట్టుకుంది. ఆ తర్వాత 'డర్టీ హరి' లాంటి బోల్డ్ మూవీలో అద్భుత పెర్ఫామెన్స్ తో ఆకట్టుకుంది. హిట్ – ది ఫస్ట్ కేస్ చిత్రంలో మరోసారి ఫ్యాన్స్ ని ఆకట్టుకుంది. తెలుగు–తమిళంలో వరుసగా అవకాశాలు అందుకుంది. నేచురల్ బ్యూటీ రుహానీ సోషల్ మీడియాల్లోను భారీ ఫాలోయింగ్ ని ఆస్వాధిస్తోంది. ఈ హిమచల్ బ్యూటీ నిరంతర ఫోటోషూట్లతో అగ్గి రాజేస్తోంది. రుహానీ తాజా ఫోటోషూట్ ఇంటర్నెట్ లో గుబులు రేపుతోంది. ఈ భామ బ్లేజర్ లో మరోసారి తనలోని బోల్డ్ యాంగిల్ ని బయటపెట్టింది. భారీతనం నిండిన బ్లేజర్ ధరంచిన రుహానీ థై సొగసుల్ని ఎలివేట్ చేసింది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా



షేర్ అవుతోంది. రుహానీ ఈ గెటప్‌లో స్టన్నింగ్ అంటూ అభిమానులు ప్రశంసిస్తున్నారు. "వెలుగు నీడల మధ్య కొట్టుకుపోవడం, ఆలోచనలు కవిత్వంగా మారడం..." అంటూ ఈ ఫోటోషూట్ కి రుహానీ పోయెటిక్ క్యాప్షన్ ఇచ్చింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే... రుహాని తదుపరి %-%మీట్ క్యూట్%-% అనే సిరీస్ లో నటించింది. అలాగే యోడ్లీ ఫిల్మ్స్ నిర్మిస్తున్న 'ఆగ్రా' అనే చిత్రంతో బాలీవుడ్ లోకి అడుగుపెడుతోంది. ఈ సినిమాలో బోల్డ్ పెర్ఫామెన్స్ కి సంబంధించిన క్లిప్స్ ఇటీవల లీకయ్యాయి. దీనిపై చాలా మంది షాక్ కి గురవ్వడమే గాక ఈ సిరీస్ వివాదాల గురించి చర్చించుకున్నారు. ముఖ్యంగా సాఫ్ట్ గా కనిపించే రుహానీ ఇలాంటి బోల్డ్ సీన్స్ లో నటించడం చర్చకు వచ్చింది. రుహానీ ఇటీవల టాలీవుడ్ కి దూరమైంది. ఇక్కడ సినిమాలేవీ ప్రకటించలేదు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536